www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



2

తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం

వచ్చే నెల 11న ప్రమాణ స్వీకారం

శుక్రవారం | 25-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 208 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: నవమి తె. 3.23 తదుపరి దశమి; నక్షత్రం: పుష్యమి ఉ. 7.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: రా.9.35-11.19; దుర్ముహూర్తం: ఉ.8.32-9.18, మ.12.21-1.07; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 5.43

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రెండు డీఏలు!

ఉద్యోగులకు కరువు భత్యంపై నేడు అధికారిక ప్రకటనకు అవకాశం

- భట్టితో చర్చించి చెబుతానన్న సీఎం రేవంత్
- ఉద్యోగ ఐకాసతో ముఖ్యమంత్రి సుదీర్ఘ భేటీ
- మార్చి దాకా ఆర్థిక అంశాలపై ఒత్తిడి తేవొద్దు
- ఇతర సమస్యలపై భట్టి నేతృత్వంలో కమిటీ
- దీపావళి తర్వాత కమిటీ సమావేశమవుతుంది
- ఆర్థికేతర అంశాలన్నీ సానుకూలంగా చేస్తాం
- జీవో 317పై క్యాబినెట్‌లో చర్చించి చెబుతాం
- ధర్నాలు చేస్తే కేసులు, అరెస్టులు ఉండవు
- ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం వ్యాఖ్యలు
- 13 ఏళ్ల తరువాత ఐకాసతో సీఎం భేటీ ఇదే
- డిసెంబరు 9 నుంచి ఉద్యోగ ఆరోగ్య బీమా
- నేడు సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్
- ఒక్కొక్కరికి సగటున రూ. 93,750 చెల్లింపు



ఉద్యోగ నేతలతో సమావేశంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుక్రవారం తీపి కబురు వచ్చే అవకాశం ఉంది. ఉద్యోగుల డీఏ బకాయిలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చించి శుక్రవారం నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఉద్యోగులకు రావాల్సినవి ఐదు డీఏలు పెండింగులో ఉండగా, గరిష్ఠంగా రెండు డీఏలు ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. ఉద్యోగుల ఇతర సమస్యలను కూడా చర్చించి, తక్షణ పరిష్కారం

మిగతా 13వ పేజీలో...

రూ.300 కోట్లతో 'షూఆల్స్' ప్లాంట్!

11 750 ఎకరాల్లో ఏర్పాటు.. 87 వేల మందికి ఉపాధి

5 వేల ఎకరాలిస్తే స్మార్ట్ హెల్త్ సిటీ.. శ్రీధర్‌బాబుతో చైర్మన్ లీ



నవంబర్ 1-8 వరకు

అరెస్టులు!

- గత ప్రభుత్వంలోని కీలక నేతలు జైలుకే
- స్కాముల్లో ఒకటి దీపావళిలోపే పేలుతుంది
- బీఆర్ఎస్ ముఖ్యుల అక్రమాలపై ఫైళ్లు సిద్ధం
- ఎవరినీ వదలం.. సినిమా ముందుంది.. 14
- మీరు హైదరాబాద్‌లో దిగేటప్పటికే సంచలనం
- కొరియాలో మీడియాతో మంత్రి పొంగులేటి

మూసీ అభివృద్ధి సాధ్యమే!

కావాల్సింది గట్టి సంకల్పం, రాజకీయ నిబద్ధతే!

స్కిల్స్ యూనివర్సిటీ చక్కని ముందడుగు 13

మీడియాతో భారత రాయబారి అమిత్ కుమార్

ఆస్తులపైనే మీ ప్రేమ!





- అనుబంధాలను మరిచిపోయారు
- 4 గోడల మధ్య మాట్లాడుకోవాల్సింది..
- ఇప్పుడు తల్లీ చెల్లిని కోర్టుకు ఈడ్చారు
- ఇది మామూలు విషయం కాదు జగన్ సార్!
- ఓటమి తర్వాత మనసు మారింది
- కంపెనీలను వదులుకోవద్దనే ఈ కథలు
- షేర్లు బదిలీ చేస్తే బెయిలు రద్దవుతుందా?

ఇది ఈ శతాబ్దపు జోక్: షర్మిల


అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల మీద ప్రేమతో రక్త సంబంధాన్ని, అనుబంధాలను మరిచిపోయారని తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్‌పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. నాలుగు గోడల మధ్య కూర్చొని పరిష్కరించుకోవాల్సిన కుటుంబ విషయాలను రోడ్డు మీదకు తీసుకొచ్చారని ఆగ్రహించారు. అది చాలదన్నట్లుగా కోర్టు వరకూ తీసుకెళ్లారని విమర్శించారు. ఆస్తులు ఇచ్చేది లేదంటూ లేఖ రాయడంతోపాటు, తల్లిపైనా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్టీ)లో జగన్ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో షర్మిల గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. 'కుటుంబ కలహాలు మామూలే' అని జగన్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. "కుటుంబాల్లో గొడవలు సాధారణమే అని జగన్ చెబుతున్నారు. కుటుంబ కలహాలు సామాన్యమేనంటూ తల్లిని, చెల్లిని కోర్టుకెందుకు ఈడ్చారు. ఇది సామాన్యమైన విషయం కాదు జగన్ సార్" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేవలం ఆస్తులను లాక్కోవడం

మిగతా 11వ పేజీలో...

కలహాలు మామూలే!

గొడవలు ఏ కుటుంబంలో ఉండవు?

షర్మిలతో వివాదాలపై జగన్ వ్యాఖ్య 11



కృష్ణానదిపై నిర్మించనున్న వంతెన నమూనా

అమరావతికి రైలు మార్గం

- రూ.2,245 కోట్లతో ఆమోదించిన కేంద్రం.. దేశమంతా కనెక్టివిటీతో కొత్త రైల్వే లైను
- ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం-నంబూరు మధ్య 57 కి.మీ. మార్గం.. కృష్ణా నదిపై 3.2 కి.మీ. వంతెన
- బందరు, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులతో కనెక్టివిటీ.. ప్రధాన మెట్రో నగరాలతో అనుసంధానం
- దక్షిణ, ఉత్తర భారతాలను కలుపుతూ నిర్మాణం.. పర్యావరణహితం.. నాలుగేళ్లలో పూర్తి: వైష్ణవ్
- మూడేళ్లలో పూర్తయ్యేలా చూడాలన్న ఏపీ సీఎం చంద్రబాబు 11

33 వేల కోట్లతో పనులు

- అమృత్ భారత్‌లో రూ. 2,635 కోట్లతో
- 40 రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నాం
- రెండేళ్లలో యాదాద్రికి ఎంఎంటీఎస్
- త్వరలో అందుబాటులోకి 'చర్లపల్లి'
- ద.మ. రైల్వే పరిధి ఎంపీలతో కిషన్‌రెడ్డి

మరో 95 విమానాలకు..

- దేశంలో ఆగని బెదిరింపులు.. పది రోజుల్లో 250కిపైగా..
- అత్యధికం ఒకే సోషల్ మీడియా ఖాతా నుంచి రాక 2
- ఒట్టివేనని తెలుసుకుంటుండగానే విమానాల మళ్లింపు బంద్!
- నిందితుల వివరాలివ్వండి.. ఎక్స్, మెటాలను కోరిన కేంద్రం
- విభాగాలు సమన్వయంతో చర్యలు చేపట్టాలి: మోదీ

మామునూరుకు మోక్షం

విమానాశ్రయం ఏర్పాటుకు తొలగిన అడ్డంకి

- 150 కి.మీ.ల నిబంధనను పక్కనపెట్టేందుకు జీఎంఆర్ ఓకే
- త్వరలో ప్రభుత్వానికి సమాచారం
- పట్టాలెక్కనున్న పనులు..
- మొత్తం 949 ఎకరాలు అవసరం
- ఎయిర్‌పోర్టు నిర్మాణంతో వివిధ ప్రాంతాల అనుసంధానం
- పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రానున్న కంపెనీలు
- పెరగనున్న ఉపాధి అవకాశాలు



హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గ్రహణం వీడనుంది. ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైన ఈ విమానాశ్రయం నిర్మాణానికి మోక్షం లభించనుంది. అక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఇప్పటి వరకు ఆటంకంగా ఉన్న '150 కిలోమీటర్ల' నిబంధనను పక్కనపెట్టడానికి జీఎంఆర్ సంస్థ ఒప్పుకున్నట్టు అత్యంత విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఇదే విషయాన్ని అధికారికంగా త్వరలోనే ప్రభుత్వానికి తెలుపనున్నట్టు సమాచారం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జీఎంఆర్ సంస్థ నిర్మించింది. నిర్మాణ సమయంలో అప్పటి ప్రభుత్వంతో సంస్థ చేసుకున్న ఒప్పందం ప్రకారం.. శంషాబాద్ విమానాశ్రయానికి 150 కి.మీ.ల పరిధిలో 30 ఏళ్ల పాటు (2038 వరకూ) వాణిజ్య విమానాశ్రయాలను ఏర్పాటు

మిగతా 3వ పేజీలో...

జైలుకు వెళ్లడానికైనా నేను సిద్ధమే

- కాంగ్రెస్ నేతలు పెట్టే కేసులకు భయపడం 14
- ఆ పార్టీ వారిని ఉరికించి కొట్టే రోజులు దగ్గర్లోనే
- పోలీసులూ అతి చేయొద్దు
- మిత్తితో సహా చెల్లిస్తాం
- ఆదిలాబాద్ రైతు పోరుబాట సభలో కేటీఆర్

కేసీఆర్ ఆదేశాలతోనే

- సీఎం అధ్యక్షతన భేటీలోనే 'కాళేశ్వరం'పై నిర్ణయం
- బ్యారేజీల నిర్మాణ స్థలాల్ని ప్రభుత్వమే ఎంపిక చేసింది
- సర్కారు ఆదేశాల మేరకే వ్యాప్కోస్ నివేదిక
- ఈ ప్రాజెక్టు కట్టాలన్న నిర్ణయం తప్పే!
- ప్రభుత్వ పెద్ద ఆదేశాలతోనే బ్యారేజీల్లో నీటి నిల్వ
- జస్టిస్ ఘోష్ కమిషన్‌తో మాజీ ఈఎన్సీ వెంకటేశ్వర్లు
- 199 ప్రశ్నలు సంధించిన కమిషన్.. నేడూ విచారణ



విచారణకు వచ్చిన మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు



హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలు నిర్మించాలని అప్పటి సీఎం కేసీఆరే నిర్ణయం తీసుకున్నారని రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు చెప్పారు. కేసీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలోనే బ్యారేజీల నిర్మాణ స్థలాలపై నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. వ్యాప్కోస్ తయారు చేసిన కాళేశ్వరం డీపీఆర్‌ను ప్రభుత్వం ఆమోదించిందని, ముఖ్యమంత్రే అనుమతి ఇస్తూ సంతకం చేశారని తెలిపారు. నిర్మాణం చేపట్టే క్రమంలో అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ ప్రదేశాలను మార్చినట్లు చెప్పారు. గురువారం కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ముందు నల్లా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. గతంలో, గురువారం కలిపి కమిషన్ మొత్తం ఆయనకు 199 ప్రశ్నలు సంధించింది. శుక్రవారం కూడా

మిగతా 14వ పేజీలో...

అరచేతిని అడ్డుపెట్టి..

- చైనాలో స్టోర్లు, షాపింగ్ మాల్స్‌లో అరచేతితో చెల్లింపులు
- సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్ట్ చేసిన పాక్ కంటెంట్ క్రియేటర్




న్యూఢిల్లీ, అక్టోబరు 24: ఏదైనా స్టోర్‌కో, షాపింగ్ మాల్‌కో వెళితే సరుకులు కొన్నాక నగదు రహిత చెల్లింపులు మామూలైపోయాయి. డెబిట్, క్రెడిట్ కార్డుతోనో, యూపీఐ యాప్స్ ద్వారానో డబ్బు చెల్లిస్తుంటాం! మరి.. ఇవేవీ లేకుండా కేవలం 'అరచేతి' ద్వారా చెల్లింపులు చేయగలిగితే? మీరు చదివింది వాస్తవమే. స్కానర్ ముందు అరచేతిని ఉంచితే చాలు.. కొన్న సరుకుల విలువ మేరకు బిల్లు చెల్లింపు జరిగిపోతుంది. ఈ వినూత్న సాంకేతిక పరిజ్ఞానం చైనాలో వచ్చేసింది. పాకిస్థాన్‌కు చెందిన రానా హంజా సైఫ్ అనే కంటెంట్ క్రియేటర్ చైనాలోని జూజౌ పట్టణంలోని ఓ స్టోర్‌లో ఈ 'పామ్ పేమెంట్ సిస్టమ్' ద్వారా జరుగుతున్న చెల్లింపులను చూసి ఆశ్చర్యపోయాడు. చైనాలో ఈ తరహా చెల్లింపుల కోసం ఆయన తన అరచేతిని స్కాన్ చేయించుకొని రిజిస్టర్ చేసుకున్నారు. తర్వాత తన చేతితోనే చెల్లింపులు చేశారు. ఈ తతంగాన్నంతా ఆయన వీడియోగా తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టాడు. సాంకేతిక, మౌలిక రంగాల్లో ముందంజలో నిలిచి ప్రపంచ దేశాలకే సవాలు విసురుతున్న చైనా 'ప్రస్తుతం 2050'లో ఉంది అని వీడియో కింద క్యాప్షన్ పెట్టారు. సైఫ్. పామ్ పేమెంట్ విధానంపై నెటిజెన్లు సంభ్రమాశ్చర్యాలు వ్యక్తం చేస్తున్నారు. 'త్వరలో ఇది ప్రపంచ వ్యాప్తం కానుందేమో' అని ఓ నెటిజెన్ కామెంట్ చేశారు. దీనిపై సైఫ్ తరహాలోనే ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గొయాంకా గతంలోనే ఎక్స్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. బీజింగ్‌లోని మెట్రోలో ఓ మహిళ తన చేతితో చెల్లింపు చేస్తుండటాన్ని అందులో చిత్రీకరించారు.

ఎలా పనిచేస్తుందంటే..

అరచేతి ద్వారా చెల్లింపులు చేయాలంటే యూపీఐ యాప్స్ తరహాలోనే కొన్ని లాంఛనాలు పూర్తిచేయాలి. మన అరచేతిని ప్రత్యేక స్కానర్ ద్వారా స్కాన్ చేయించాలి. ఆ తర్వాత ఆ స్కాన్ చేసిన అరచేతి నకలును బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసి ఉన్న మొబైల్ నంబరుతో కూడిన యాప్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఒకసారి రిజిస్ట్రేషన్ పూర్తయితే.. ఎక్కడైనా కేవలం అరచేతిని ఉపయోగించి నగదు రహిత చెల్లింపులు చేయొచ్చు. ఇది చైనాలో మాత్రమే అమల్లో ఉంది.

లోకం తీరు



యూపీ ఉపఎన్నికల్లో పోటీ చేయట్లేదు

- 'ఇండియా' అభ్యర్థుల్ని బలపరుస్తాం: కాంగ్రెస్

న్యూఢిల్లీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న ఉత్తరప్రదేశ్‌లో 9 అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఉపఎన్నికల్లో పోటీ చేయట్లేదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. 'ఇండియా' కూటమి అభ్యర్థులకు మద్దతిస్తామని వెల్లడించింది. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని పార్టీ హెడ్ క్వార్టర్స్‌లో కాంగ్రెస్ యూపీ చీఫ్ అజయ్ రాయ్‌తో కలిసి పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి అవినాష్ పాండే మీడియాతో మాట్లాడారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నాయకత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నామని అవినాష్ పాండే తెలిపారు. మరోవైపు 'ఇండియా' అభ్యర్థులంతా తమ పార్టీ గుర్తు సైకిల్ పైనే బరిలో నిలుస్తారని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్, ఎస్పీలు ఐక్యంగా ఉన్నాయన్నారు.

ఖర్గేను కాంగ్రెస్ అవమానించింది

దళితుడనే ఆయనను దూరం పెట్టారు.. బీజేపీ ఆరోపణ

న్యూఢిల్లీ, అక్టోబరు 24: వయనాడ్ ఉప ఎన్నిక నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. వయనాడ్ లోక్‌సభ అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున ప్రియాంకా గాంధీ బుధవారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ అవమానించిందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంకాతోపాటు నామినేషన్ దాఖలు చేసే గదిలోకి ఆయనను పంపలేదని, దీంతో ఆయన గది బయటే వేచి ఉండాల్సి వచ్చిందని పేర్కొంది. దళితుడైనందుకే ఇలా చేశారని విమర్శించింది. ఖర్గే ఆ గది బయటే వేచిచూస్తున్న వీడియోను బీజేపీ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఆ పార్టీ నేతలు.. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, అమిత్ మాలవీయ ఈ విషయంలో కాంగ్రెస్‌ను 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ఖర్గే వంటి సీనియర్ పార్లమెంటేరియన్, దళిత నాయకుడి పట్ల గాంధీ కుటుంబం ప్రవర్తించిన తీరు, ఆయనకు చేసిన అవమానం చూస్తే చాలా బాధగా ఉందని వారన్నారు. కాగా బీజేపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ విరుచుకుపడింది. సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీతో కలిసి ఖర్గే కూర్చున్న ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది.

రాముని గుడిలో సాయి విగ్రహంపై అభ్యంతరం

- ఆలయాల్లో వాటికి చోటు లేదని శంకరాచార్య వ్యాఖ్య

సిమ్లా, అక్టోబరు 24: స్థానిక జఖూలోని రామ మందిరంలో సాయిబాబా విగ్రహం ఉండడంపై జ్యోతిష్‌మఠ్ శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి అభ్యంతరం తెలిపారు. ఆ ఆలయానికి వెళ్లబోనంటూ గురువారం ఉదయం అక్కడ ఏర్పాటు చేసిన 'గౌ ధ్వజ్' కార్యక్రమాన్ని బహిష్కరించారు. గోవుల సంరక్షణపై అవగాహన కలిగించేందుకు ఆలయం ఆవరణలో గౌ ధ్వజ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే అక్కడ సాయిబాబా విగ్రహం ఉందని ఆయనకు సమాచారం అందడంతో ఆలయానికి రాలేనంటూ ఆయన నిర్వాహకులకు తెలిపారు. హిందూ ఆలయాల్లో సాయిబాబాకు స్థానం లేదని శంకరాచార్య చెప్పారు. సాయి పేరును ఏ గ్రంథాల్లోనూ ప్రస్తావించలేదని తెలిపారు. కేవలం ధనార్జన కోసమే ఆలయ నిర్వాహకులు, పూజారులు ఆ విగ్రహాన్ని పెట్టారని ఆరోపిస్తూ వీడియోను విడుదల చేశారు.

ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక ముందడుగు

- మోదీ-జిన్ పింగ్ సమావేశంపై చైనా స్పందన

బీజింగ్, అక్టోబరు 24: బ్రిక్స్ సదస్సు జరిగిన కజాన్‌లో భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య చర్చలకు ద్వైపాక్షిక సంబంధాల పురోగతిలో గొప్ప ప్రాముఖ్యత ఉందని చైనా అభివర్ణించింది. దేశాధినేతల సమావేశం నిర్మాణాత్మకంగా సాగిందని వివరించింది. సంబంధాలను మెరుగుపరిచేందుకు ఇద్దరు నేతలు ముఖ్యమైన ప్రాథమిక అవగాహనలకు వచ్చారని, ఇది మళ్లీ స్థిరమైన అభివృద్ధి మార్గంలో నడిపేలా నిర్దేశిస్తుందని పేర్కొంది. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ గురువారం బీజింగ్‌లో మీడియాతో మాట్లాడారు. భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధమని, ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక, దీర్ఘకాల ప్రయోజనాల ప్రాతిపదికన మరింత ఎత్తుకు తీసుకెళ్తామన్నారు. కాగా, మోదీ-జిన్ పింగ్ మధ్య చర్చలు ఫలించాయని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇది చర్చల ప్రాముఖ్యతను చాటుతోందన్నారు.

జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదా!


- మోదీ, అమిత్ షాను కలిసిన సీఎం ఒమర్

న్యూఢిల్లీ, అక్టోబరు 24: జమ్మూకశ్మీరు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఒమర్ అబ్దుల్లా దేశ రాజధానిలో పర్యటిస్తున్నారు. గురువారం ఆయన ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఎన్సీ పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ నేతృత్వంలో సర్కారు కొలువుదీరగానే.. జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కోరుతూ తీర్మానం చేశారు. ఆ తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదించారు. తాజాగా సీఎం ఒమర్ ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన సందర్భంగా ఈ విషయాన్ని ప్రస్తావించడంతోపాటు తీర్మానాన్ని అందజేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. మరోవైపు బుధవారం ఒమర్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీరులో కొత్త ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తామని షా హామీఇచ్చినట్లు సమాచారం.

ఉగ్రదాడిలో ఇద్దరు సైనికుల మృతి

న్యూఢిల్లీ, అక్టోబరు 24: జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రధాని మోదీని కలిసిన కొన్ని గంటల్లోనే ఉగ్రవాదులు రెచ్చిపోయారు. గురువారం బారాముల్లాలోని గుల్మార్గ్ వద్ద బుటపత్రి ప్రాంతంలో 18 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన సైనికుల గస్తీ వాహనంపై మెరుపుదాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు కూలీలు మృతి చెందారు. ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. దీంతో భద్రతా సిబ్బంది ముష్కరుల కోసం వేట ముమ్మరం చేసింది. అంతకుముందు ఉగ్రవాదుల కాల్పుల్లో యూపీకి చెందిన ఓ వలసకార్మికుడు మరణించాడు.

బెంగళూరులో 5 గంటలపాటు నిలిచిన వాహనాలు




బెంగళూరులో బుధవారం రాత్రి భారీ వర్షం కురవడంతో ఐదు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. ఎలక్ట్రానిక్ సిటీ ఫ్లై ఓవర్‌పై గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. గంటలకొద్దీ క్యాబ్‌ల్లో వేచిచూసిన ఐటీ ఉద్యోగులు చివరికి నడుచుకుంటూ ఇళ్లకు వెళ్లారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.

-బెంగళూరు, ఆంధ్రజ్యోతి

మహారాష్ట్ర ఎన్నికల్లో ఫ్యామిలీ ప్యాక్

ప్రతి పార్టీలో రక్త సంబంధీకులకే సీట్లు.. పట్టున్న నియోజకవర్గాల్లో పాగాకు ప్లాన్



వర్లి నియోజకవర్గం నుంచి నామినేషన్ వేస్తున్న శివసేన (యూబీటీ) నేత ఆదిత్య థాక్రే; చిత్రంలో ఉద్ధవ్ థాక్రే తదితరులు

ముంబై, అక్టోబరు 24: దేశంలో ప్రతి రాజకీయ పార్టీ కుటుంబ రాజకీయాలకు దూరంగా ఉండాలని చెబుతుంటాయి.. కానీ ఆచరణలో మాత్రం ఆ సూత్రాన్ని విస్మరించి.. తమ రక్త సంబంధీకులకే సీట్లు కేటాయిస్తుంటాయి. మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలకు నవంబరు 20న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అక్కడ అన్ని పార్టీలు తమ అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించాయి. అందులో ప్రతీ పార్టీ వారి ముఖ్య నేతల తనయులు, భార్య, సోదరి, సోదరులకు ఏదో ఒకచోట సీటు కేటాయించింది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత అశోక్ చవాన్ తనయ శ్రీజయ చవాన్ ఇటీవల కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరగా.. వారి కుటుంబానికి కంచుకోట అయిన నాందేడ్ జిల్లాలోని భోకర్ నియోజకవర్గాన్ని బీజేపీ ఆమెకు కేటాయించింది. అలాగే ముంబై బీజేపీ అధినేత ఆశిష్ షేలర్ పశ్చిమ బాంద్రా నియోజకవర్గం నుంచి పోటీకి దిగనుండగా.. ఆయన సోదరుడు వినోద్ షేలర్‌ను పశ్చిమ మలాడ్ నియోజకవర్గం నుంచి బీజేపీ బరిలోకి దింపింది. శ్రీగొండ నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే బాబన్‌రావ్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా అక్కడి నుంచి ఆయన భార్య ప్రతిభా పచ్‌పూతేను బీజేపీ పోటీ చేయిస్తోంది. కాంకావ్లి నియోజకర్గ ఎమ్మెల్యే నితేశ్ సోదరుడు నీలేశ్ ఇటీవల బీజేపీ నుంచి ఉద్ధవ్ శివసేనలో చేరగా.. ఆయనకు పార్టీ కుడాల్ నియోజవర్గాన్ని కేటాయించింది. రాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్ సోదరుడు కిరణ్ సామంగ్‌కు శిందే శివసేన రాజాపూర్ సీటు నుంచి బరిలోకి దింపుతోంది. అలాగే ఆ పార్టీ ఎంపీలు సందీపన్ భూమరే, రవీంద్ర వైకర్ తమ వారికి సీట్లు దక్కించుకోవడంలో సఫలమయ్యారు. భూమరే కుమారుడు విలాస్.. పైథాన్ నియోజకవర్గం నుంచి, వైకర్ భార్య మనీశా తూర్పు జోగేశ్వరీ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్నారు. ఎన్సీపీ నేత పంకజ్ భుజ్‌బల్ నాసిక్ జిల్లాలోని యోలా నియోజకవర్గం నుంచి, ఆయన సోదరుడు చాగన్ భుజ్‌బల్ ఇండిపెండెంట్‌గా అదే నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. ఉద్ధవ్ థాక్రే కుమారుడు ఆదిత్య థాక్రే వర్లి నియోజకవర్గం నుంచి ఆయన సోదరుడు వరుణ్ సర్దేశాయ్ తూర్పు బాంద్రా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. శరద్ పవార్ మనవడు రోహిత్ పవార్ అహిల్యానగర్ స్థానం బరిలోకి దిగారు. ఇలా అన్ని పార్టీలు.. ముఖ్య నేతల కుటుంబసభ్యులకు సీట్లు కేటాయించాయి. కొన్ని నియోజకవర్గాల్లో అక్కడ పట్టున్న నేత ఆకస్మికంగా మృతి చెందడంతో వారి వారసులకు పార్టీలు సీట్లు కేటాయించాయి. ఏదీ ఏమైనా గెలుపే లక్ష్యంగా మహారాష్ట్రలో ప్రతి పార్టీ పూర్తి ఫ్యామిలీ ప్యాక్‌తో బరిలోకి దిగాయి.

48 మందితో కాంగ్రెస్ తొలి జాబితా

న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో నిలువనున్న అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను గురువారం కాంగ్రెస్ ప్రకటించింది. ఇందులో 48 మందికి చోటు కల్పించింది. సకోలి నుంచి మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే, కరాడ్ సౌత్ నుంచి మాజీ సీఎం పృథ్వీరాజ్ చవాన్, బ్రహ్మపురి నుంచి విజయ్ వాడెట్టివర్, నాగ్‌పూర్ నార్త్ నుంచి మాజీ మంత్రి నితిన్ రౌత్, సంగమనేర్ నుంచి మాజీ మంత్రి బాలాసాహెబ్ థోరట్‌ను పోటీలోకి దింపుతోంది.

గడియారం అజిత్ పవార్ వర్గానికే!

శాసనసభ ఎన్నికల వరకే వర్తిస్తుంది

ప్రచారంలో స్పష్టంగా పేర్కొనాలి: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 24: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కూడా గడియారం గుర్తును నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అజిత్ పవార్ వర్గానికే కేటాయించాలని సుప్రీంకోర్టు గురువారం నిర్ణయించింది. ఇది ఈ ఎన్నికల వరకే వర్తిస్తుంది. గడియారం గుర్తు ఎవరిదన్నది సుప్రీంకోర్టు తుది తీర్పులో తేలుతుంది. అజిత్ పవార్ వర్గం గడియారం గుర్తును ప్రదర్శించే అన్ని ప్రకటనల కింద ఇదే విషయాన్ని గమనిక (డిస్క్లైమర్)గా పేర్కొనాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గత లోక్‌సభ ఎన్నికల్లోనూ గడియారం గుర్తును ఈసీ అజిత్ పవార్ వర్గానికే కేటాయించగా, సుప్రీంకోర్టు డిస్క్లైమర్ పెట్టాలన్న షరతుతో ఆమోదించింది. శరద్ పవార్ వర్గానికి ఎన్సీపీ శరద్ పవార్‌గా ప్రచారం చేసుకొనేందుకు అనుమతించింది. ఆయనకు కొమ్ముబూర గుర్తును తాత్కాలికంగా కేటాయించింది. గత ఎన్నికల్లో డిస్క్లైమర్ నిబంధనను అజిత్ పవార్ వర్గం యథేచ్ఛగా ఉల్లంఘించిందని శరద్ పవార్ వర్గం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకురాగా, ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని తేలితే తామే సుమోటోగా చర్యలు చేపడతామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం అజిత్ పవార్ వర్గం ఎన్సీపీని హెచ్చరించింది. గడియారం గుర్తును ఎవరికీ కేటాయించకుండా ఉంచాలని, ఇద్దరికీ చెరో కొత్త గుర్తును కేటాయించాలని శరద్ పవార్ వర్గం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

- నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ, అక్టోబరు 24: సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సంజీవ్ ఖన్నాను నియమిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 51వ ప్రధాన న్యాయమూర్తిగా ఆయన నవంబరు 11న బాధ్యతలు చేపడుతారని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ ప్రకటించారు. 2025 మే 13 వరకు అంటే సుమారు ఏడు నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ అయిన జస్టిస్ ఖన్నా పేరును ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సిఫారసు చేశారు. దానిని ఆమోదించిన కేంద్రం ఈ మేరు ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పనిచేసిన జస్టిస్ ఖన్నా 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. పలు కీలక తీర్పులు వెలువరించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం స మాచార హక్కు చట్టం పరిధిలోకి వస్తుందని పేర్కొం టూ 2019లో రాజ్యాంగ ధర్మాసనం తరఫున తీర్పు రాశారు. అమీష్ దేవ్‌గన్ కేసులో విద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ నిర్ణయాన్ని వెలువరించారు. సెంట్రల్ విస్టా ప్రాజెక్టు నిర్మాణంలో చట్టపరంగా తగిన నిబంధనలు పాటించలేదంటూ అసమ్మతి తీర్పు రాసిన ఇద్దరు న్యాయమూర్తుల్లో ఆయన కూడా ఉన్నారు.ఈవీఎం-వీవీప్యాట్ రసీదుల లెక్కింపు కేసును విచారించిన ధర్మాసనంలోనూ ఆయన ఉన్నారు. వీవీప్యాట్ స్లిప్‌లను 100% మేర లెక్కించాలన్న వినతిని తిరస్కరిస్తూ మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు.

కోలాల కొట్లాటతో తగ్గుతున్న రేట్లు!

- క్యాంప కోలా ధరలయుద్ధంతో ఆలోచనలో పడ్డ పెప్సీ, కోక్
- 15-20 శాతం తక్కువ ధరతో కొత్త డ్రింకులు తెచ్చే యోచన?

న్యూఢిల్లీ, అక్టోబరు 24: తక్కువ ధరలతో మార్కెట్లోకి ఒకేసారి పెద్ద ఎత్తున కమ్ముకొచ్చేయడం.. అప్పటికే ఆ రంగంలో పాతుకుపోయిన దిగ్గజ కంపెనీల మార్కెట్ షేర్‌ను కొల్లగొట్టి, బలంగా జెండా పాతేయడం.. ఇదీ రిలయన్స్ కంపెనీకి బాగా అలవాటైన, ఎప్పుడూ పాటించే వ్యూహం. నిరుడు క్యాంప కోలా అనే పేరుతో శీతల పానీయాల మార్కెట్లోకి వచ్చిన రిలయన్స్.. తనదైన శైలిలో తక్కువ ధరలతో ఆకట్టుకుని మార్కెట్లో గట్టి పట్టే సాధించింది. దీంతో.. ప్రత్యర్థి కంపెనీలైన కోక్, పెప్సీ ఆలోచనలో పడ్డాయి! ప్రస్తుతం తాము విక్రయిస్తున్న శీతలపానీయాల కంటే 15-20 తక్కువ ధరలతో కొత్త డ్రింకులను మార్కెట్లోకి తెచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం. 2022లో క్యాంప కోలాను కొనుగోలు చేసిన రిలయన్స్ తొలి నుంచే ధరల యుద్ధానికి తెరతీసింది. పెప్సీ, కోక్ 250మిల్లీలీటర్ల పెట్ బాటిల్స్‌ను 20 రూపాయలకు విక్రయిస్తుంటే.. 200 మిల్లీలీటర్ల క్యాంప కోలా పెట్ బాటిల్‌ను రూ.10కే విక్రయించింది! పెప్సీ, కోక్ 300 మిల్లీలీటర్ల టిన్ ధర రూ.30 అయితే.. 200మిల్లీలీటర్ల క్యాంప కోలా టిన్‌ను రూ.20కే అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే.. డిస్ట్రిబ్యూటర్లకు ప్రత్యర్థి కంపెనీలు 3.5 నుంచి 5% మార్జిన్ ఇస్తుంటే.. రిలయన్స్ 6 నుంచి 8% మార్జిన్ ఇచ్చింది. మొదట్లో రిలయన్స్‌ను పట్టించుకోని ప్రత్యర్థి కంపెనీలు ఇప్పుడు అప్రమత్తమై.. క్యాంప కోలాకు పోటీగా కొత్త 'బడ్జెట్ ఫ్రెండ్లీ' శీతలపానీయాలను తెచ్చే ప్రణాళికలు రచిస్తున్నట్టు తెలుస్తోంది. కోకాకోలా ఇప్పటికే ద్వితీయ శ్రేణి నగరాల్లో.. పది రూపాయల కోక్ సీసాల పంపిణీని విస్తృతం చేసింది.

బట్టతలపై జుట్టు మొలిచిన విధంబెట్టిదనిన..

న్యూయార్క్, అక్టోబరు 24: 'రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవా..' అని సామెత! దాన్నిప్పుడు. 'బిలియనీర్ తల్చుకుంటే బట్టతలపై జుట్టు మొలిపించడం కష్టమా?' అని మార్చుకోవచ్చు. అవును.. వయసు మీరే ప్రక్రియను రివర్స్ చేసేందుకు కోట్లకు కోట్లు ఖర్చు పెడుతున్న అమెరికన్ బిలియనీర్ బ్రయాన్స్ జాన్సన్ (47).. తన బట్టతలపై జుట్టు మొలిపించి చూపించారు. "జన్యుపరంగా అయితే.. ఇప్పటికే నాకు పూర్తిస్థాయిలో బట్టతల వచ్చేసి ఉండాలి. ముప్పై ఏళ్లకు దగ్గర్లో ఉన్నప్పుడు నా జుట్టు ఊడడం మొదలైంది. కానీ, ఇప్పుడు నా వయసు 47 సంవత్సరాలు. నా తలపై పూర్తిగా జుట్టుంది. 70% తెల్లజుట్టు నల్లబడింది." అని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. నిజానికి.. బట్టతల సమస్యకు పరిష్కారంగా మార్కెట్లో ఇప్పటికే 'మినాక్సిడిల్' అనే మందు అందుబాటులో ఉంది. దాన్ని వాడడంతోపాటు తాను తీసుకున్న ఇతరత్రా జాగ్రత్తలు, చికిత్సలు, పోషకాల గురించి కూడా 'ఎక్స్'లో పలు పోస్టుల ద్వారా జాన్సన్ వివరించారు. మినాక్సిడిల్ ఔషధాన్ని వాడడం కన్నా ముందు.. విటమిన్లు, పోషకాలు.. ముఖ్యంగా ప్రోటీన్, ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలను తాను ఒక పద్ధతి ప్రకారం తీసుకున్నానని తెలిపారు. రోజూ ఒక ప్రత్యేకమైన టోపీని ధరించడం ద్వారా.. తన తల వెంట్రుకలకు 'ఎర్రటి కాంతి చికిత్స' చేసేవాణ్నని వివరించారు. కొద్దిగా ఆలస్యమైతే కావచ్చుగానీ.. జుట్టు రాలడం అనేది భవిష్యత్తులో అంత పెద్ద సమస్య కాదని భరోసా ఇచ్చారు.

28లోగా రాజీనామా చెయ్యాల్సిందే

ట్రూడోకు సొంత పార్టీ ఎంపీల అల్టిమేటం



న్యూఢిల్లీ/అట్టావా, అక్టోబరు 24: భారత్‌పై కయ్యానికి కాలు దువ్వుతున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు సొంత పార్టీలోనే అసమ్మతి సెగ తగిలింది. ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలని పలువురు లిబరల్ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ నెల 28లోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని అల్టిమేటం ఇచ్చారు. బుధవారం నిర్వహించిన పార్టీ అంతర్గత భేటీలో అసమ్మతి సభ్యులు గళం విప్పారు. నేరుగా ట్రూడోపై తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూన్, సెప్టెంబరుల్లో జరిగిన ప్రత్యేక ఎన్నికల్లో లిబరల్ పార్టీకి కంచుకోట వంటి రెండు నియోజకవర్గాలను కోల్పోయింది. ట్రూడో నాయకత్వంలో పార్టీ రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని సర్వేలు కూడా సూచించాయి. ఈ పరిస్థితికి ట్రూడో వైఖరే కారణమని సమావేశంలో ఎంపీలు మండిపడ్డారు. ట్రూడో రాజీనామా చేయాలంటూ బ్రిటిష్ కొలంబియా ఎంపీ ప్యాట్రిక్ వీలర్ ప్రతిపాదించిన తీర్మానంపై మొత్తం 153 మంది లిబరల్ ఎంపీల్లో 24 మంది సంతకాలు చేశారని, ఈ నెల 28 వరకూ డెడ్‌లైన్ విధించినట్లు సీబీసీ న్యూస్ వర్గాలు తెలిపాయి. ఇది కొంత కాలంగా రగులుతున్న అంశమేనని, ఇప్పటికైనా వారు దీనిని బయటపెట్టడం అవసరమని ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ పేర్కొన్నారు. అయితే ఇదేమంత ఆందోళన చెందాల్సినంత విషయం కాదని, ఈ పరిస్థితులను ట్రూడో సమర్థంగా ఎదుర్కోగలరని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా, 2025 అక్టోబరులో జరగబోయే ఎన్నికలకు పార్టీ సన్నాహకాలపైనా ఎంపీలు సంతృప్తిగా లేరు. ట్రూడోకు ప్రజాదరణ క్షీణించడం కూడా వారి అసంతృప్తికి కారణంగా కనిపిస్తోంది. లిబరల్ పార్టీ కంటే కన్జర్వేటివ్ పార్టీ 19 పాయింట్ల ఆధిక్యంలో ఉండటంతో రాబోయే ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదనే ఆందోళనతో ట్రూడో రాజీనామాకు ఎంపీలుడిమాండ్ చేస్తున్నారు.

భారత్‌కు కెనడా వెన్నుపోటు: సంజయ్ వర్మ

ఖలిస్థానీ తీవ్రవాదుల పట్ల కెనడా న్యాయ వ్యవస్థ అతి సున్నితంగా వ్యవహరిస్తూ వారికి తమ దేశంలో ఆశ్రయం కల్పిస్తోందని ఆ దేశం నుంచి వెనక్కు పిలిపించిన భారత రాయబారి సంజయ్ వర్మ విమర్శించారు. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినేలా కెనడా వ్యవహరించిందని, ట్రూడో నేతృత్వంలోని ఆ దేశం భారత్‌ను వెన్నుపోటు పొడిచిందన్నారు. నిజ్జర్ హత్య కేసు విచారణ ప్రక్రియను ప్రశ్నించిన ఆయన ఈ కేసులో లారెన్స్ బిష్ణోయ్‌తో పాటు గోల్డీ బ్రార్ పేరును భారత్ సూచించిన తర్వాత వాంటెడ్ లిస్ట్ నుంచి బ్రార్ పేరు మాయం కావడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. కెనడాలో నివసించే సిక్కుల్లో సుమారు 10వేల మంది మాత్రమే ఖలిస్థానీ మద్దతుదారులు ఉన్నారని, తమ డిమాండ్లను బలంగా వినిపించడం ద్వారా వీరు అక్కడి రాజకీయ పార్టీల దృష్టిని ఆకర్షిస్తున్నారని తెలిపారు. ఖలిస్థానీలు కెనడాలో మానవ అక్రమ రవాణాకు పాల్పడటంతో పాటు తమ అక్రమ వ్యాపారాల కోసం గురుద్వారాల ద్వారా నిధులు సేకరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

95 విమానాలకు బెదిరింపులు

- పది రోజుల్లో 250కిపైగా.. అత్యధికం ఒకే సోషల్ మీడియా ఖాతా నుంచి వస్తున్నట్లు గుర్తింపు
- ఒట్టివేనని తేలుతుండటంతో విమానాల మళ్లింపు బంద్!
- నిందితుల వివరాలివ్వాలని ఎక్స్, మెటాలను కోరిన కేంద్రం


న్యూఢిల్లీ, అక్టోబరు 24: విమానాలకు బాంబు బెదిరింపులు ఆగటం లేదు. గురువారం ఒక్కరోజే 95 విమానాలకు బెదిరింపులు వచ్చాయి. వీటిలో ఇండిగో, ఎయిరిండియా, విస్తారా, స్పైస్‌జెట్, అలయెన్స్ ఎయిర్, ఆకాశ ఎయిర్ కంపెనీలకు చెందిన విమానాలున్నాయి. నాలుగు విమానాలు హైదరాబాద్ నుంచి రాకపోకలకు సంబంధించినవి. వీటితో కలిపి గత 11 రోజుల్లో మొత్తం 250కిపైగా విమానాలకు ఈ రకమైన హెచ్చరికలు వచ్చినట్లు తేలుతోంది. ఇవన్నీ కూడా దాదాపుగా సోషల్ మీడియా వేదికలుగానే వస్తున్నాయి. అన్నీ ఒట్టివేనని రుజువుతున్నాయి. ఈ ఘటనల నేపథ్యంలో ఢిల్లీ, ముంబయిల్లో పోలీసులు పలు కేసులు నమోదు చేశారు. కాగా.. బెదిరింపుల వల్ల తమ విమానాలను వేటినీ మళ్లించలేదని ఎయిరిండియా అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు, ఈ బెదిరింపుల్లో అత్యధికం ఒకే సోషల్ మీడియా ఖాతా (హ్యాండిల్) నుంచి వస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. దీంతో సదరు హ్యాండిల్ నుంచి వస్తున్న బెదిరింపులను తీవ్రంగా తీసుకోనవసరం లేదని, విమానాలను దారి మళ్లించవద్దని తాజా నిబంధనల్లో అధికారులు పేర్కొన్నట్లు సమాచారం.

చట్ట ప్రకారం చర్యలు: మోదీ

విమానాలకు పెరుగుతున్న బెదిరింపు ఘటనలపై అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ప్రధాని మోదీ ఆదేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. బెదిరింపుల నేపథ్యంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ సోషల్ మీడియా వేదికలైన ఎక్స్, మెటా (ఫేస్‌బుక్, వాట్సా్ప్‌ల కంపెనీ)లను సంప్రదించింది. బెదిరింపులకు పాల్పడుతున్న వారిని గుర్తించటానికి వీలుగా వారి వివరాలను అందజేయాలని ఆ సంస్థలను కోరినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే కొందరిని గుర్తించామని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నాయి. అయితే, ఈ బెదిరింపులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? వీటి వెనక ఎవరున్నారు? వంటి వివరాలను మాత్రం ప్రభుత్వ వర్గాలు వెల్లడించలేదు.

వయసు ధ్రువీకరణకు ఆధార్ సరైన పత్రం కాదు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ, అక్టోబరు 24: వయసు ధ్రువీకరణకు ఆధార్ సరైన పత్రం కాదని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జువెనైల్ జస్టిస్ చట్టం-2015లోని సెక్షన్ 94 ప్రకారం స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్‌లో పేర్కొన్న పుట్టిన తేదీనే ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపింది. రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి వయసును ఆధార్ కార్డు ఆధారంగా నిర్ణయించి, ఆ మేరకు నష్ట పరిహారాన్ని తగ్గిస్తూ పంజాబ్-హరియాణా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. ఆధార్ గుర్తింపు కార్డుగా పనికొస్తుందే తప్ప, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంగా ఉపయోగపడదంటూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ జారీ చేసిన సర్క్యులర్‌ను ఈ సందర్భంగా గుర్తు చేసింది. రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి వయసును స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ ఆధారంగానే నిర్ణయించాల్సి ఉంటుందని కేసును విచారించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం తెలిపింది. 2015లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.19.35 లక్షల పరిహారం ఇవ్వాలని రోహ్‌తక్‌లోని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (ఎంఏసీటీ) ఆదేశించింది. స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ ఆధారంగా వయసు 45 ఏళ్లు అని నిర్ధారించి పరిహారాన్ని లెక్కించింది. ట్రిబ్యునల్ తీర్పుపై హైకోర్టులో అప్పీలు దాఖలు కాగా ఆధార్ కార్డు ఆధారంగా వయసు 47 ఏళ్లు అని లెక్కించి దానికి అనుగుణంగా పరిహారాన్ని రూ.9.22 లక్షలకు తగ్గించింది. దీనిపై మృతుని కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆధార్ ఆధారంగా వయసు లెక్కించడం సరికాదన్న ధర్మాసనం ట్రిబ్యునల్ తీర్పును సమర్థించింది.

కూల్చివేతల బాధితులు కోర్టుకెళ్లొచ్చు: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 24: ఆస్తుల కూల్చివేతల కారణంగా నష్టపోయిన బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని గురువారం సుప్రీంకోర్టు తెలిపింది. న్యాయస్థానం ఆదేశాలను కాదని ఆస్తులను కూల్చివేసిన రాష్ట్ర ప్రభుత్వాలపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టడానికి మాత్రం నిరాకరించింది. సుప్రీంకోర్టు అనుమతి లేకుండా ఇళ్లను కూల్చివేయొద్దన్న ఆదేశాలను ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్ ప్రభుత్వాలు పాటించలేదని, వాటిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ పి.కె.మిశ్ర, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం పరిశీలించింది. బాధితులు కాకుండా వేరే వ్యక్తి ఈ పిటిషన్ వేయడంతో స్వీకరించడానికి నిరాకరించింది. బాధితులు స్వయంగా కోర్టుకు రావచ్చని, ధర్మాసనాలు వాటిపై విచారణ జరుపుతాయని పేర్కొంది.

నాగార్జున సాగర్ 20 గేట్ల ఎత్తివేత

- జలాశయానికి 1.5 లక్షల క్యూసెక్కుల వరద నీరు
- శ్రీశైలం ప్రాజెక్టుకు 1.8 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గద్వాల/నాగార్జున సాగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర జలాశయానికి భారీగా వరద వస్తోంది. గురువారం ప్రాజెక్టుకు 97,751 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. డ్యాం సామర్థ్యం 105 టీఎంసీలు కాగా 101 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి వచ్చిన వరదను వచ్చినట్లే విడుదల చేస్తున్నారు. సుంకేసుల డ్యాంకు 1,09,730 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో 25 గేట్ల ద్వారా శ్రీశైలానికి నీటిని విడుదల చేస్తున్నారు. గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 14 గేట్లను ఎత్తి 58,254 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 36,969 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.89 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 4 గేట్లను ఎత్తి 1,12,300 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 67 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిగా నిండి ఉంది. నాగార్జునసాగర్‌కు 1,51,529 క్యూసెక్కుల నీరు వస్తోంది. 20 గేట్లను ఎత్తి 1,62,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,10,149 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

కానిస్టేబుళ్లను కూలీలుగా మార్చి, వేధిస్తారా?

బెటాలియన్ పోలీసు కుటుంబాల ఆందోళన.. నిరంతరం డ్యూటీలే.. సెలవులు ఇవ్వరని ఆగ్రహం

- సిరిసిల్ల, డిచ్‌పల్లి, ఎర్రవల్లిలలో బైఠాయింపు
- 'ఏక్ స్టేట్ - ఏక్ పోలీస్' అమలు చేయాలని డిమాండ్



నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి రహదారిపై ఆందోళన చేస్తున్న పోలీసుల కుటుంబ సభ్యులు

సిరిసిల్ల, డిచ్‌పల్లి, ఎర్రవల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గౌరవప్రదమైన పోలీసు ఉద్యోగంలో ఉన్న తమ భర్తలను అధికారులు కూలీలుగా మార్చి, వేధింపులకు గురి చేస్తున్నారంటూ 17వ బెటాలియన్ పోలీసు కానిస్టేబుళ్ల భార్యలు, వారి కుటుంబ సభ్యులు గురువారం సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి, గద్వాల జిల్లా ఎర్రవల్లిలోని జాతీయ రహదారులపై బైఠాయించి ఆందోళనకు దిగారు. తెలంగాణలో ఏక్ స్టేట్ - ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో అంబేడ్కర్ విగ్రహం వద్దకు బెటాలియన్ పోలీసు కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబ సభ్యులు తరలి వచ్చి బైఠాయించారు. తమ భర్తల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలంటూ ధర్నా చేపట్టారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆందోళనకారుల వద్దకు వచ్చి ధర్నా విరమించాలని సూచించినా ఫలితం లేకపోవడంతో బలవంతంగా వారిని అదుపులోకి తీసుకొని సర్దాపూర్‌లోని బెటాలియన్ వద్దకు తరలించారు. కమాండెంట్ శ్రీనివాసరావు వారి సమస్యలను విని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్ల భార్యలు మాట్లాడుతూ పోలీసు ఉద్యోగానికి తమ భర్తలు చేస్తున్న పనికి సంబంధం లేకుండా పోయిందన్నారు. పోలీసు ఉద్యోగం పేరుతో బెటాలియన్‌లో కూలి పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భర్తలకు విరామంలేని డ్యూటీలు వేసి కుటుంబంతో గడపకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భర్తలు డ్యూటీ చేయాలంటే భయంతో వణికిపోతున్నారని అన్నారు. ఇళ్లలో శుభకార్యాలు జరుపుకోవడానికి కూడా సెలవులను ఇవ్వకుండా అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. బెటాలియన్‌లో పనిచేసే వారు చనిపోతే కానిస్టేబుళ్లే అంత్యక్రియలు చేయాలని, వారే డప్పులు కొట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పోలీసు విధానాన్ని తెలంగాణలో అమలు చేసి తమ భర్తలకు వెట్టి చాకరీ నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. డిచ్‌పల్లిలో ఆందోళన విరమించాలని పోలీసులు కోరగా వినకపోవడంతో.. పోలీసులు వారిని బలవంతంగా లాక్కెళ్లి.. అక్కడి నుంచి పంపించివేశారు. అంతకు ముందు డిచ్‌పల్లి వద్ద ఆందోళన చేస్తున్న పోలీసు కుటుంబాలకు కేటీఆర్ సంఘీభావం తెలిపారు.

హక్కులడిగితే పోలీసులపై వేటేస్తారా?: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాపపు పాలనలో తెలంగాణలోని ప్రతిబిడ్డా ఆగమైపోతోందని.. హక్కుల గురించి అడిగితే ఉద్యోగులపై వేటెయ్యడం ఏమిటని కేటీఆర్ గురువారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. డిజిటల్ సర్వేకు ఒప్పుకోలేదని 165 మంది ఏఈవోలను, హక్కులు అడిగారని 20 మంది కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2 లక్షల ఉద్యోగాలు రాహుల్ ఎరుగు... అడ్డగోలు సాకులతో సస్పెన్షన్ చేస్తూ.. రేవంత్ సర్కార్ ఉన్న ఉద్యోగాలను ఊడపీకుతోందని ఆరోపించారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'మామునూరు'కు మోక్షం

(మొదటి పేజీ తరువాయి)

చేయవద్దు. దీని కారణంగానే శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 150 కిలోమీటర్ల పరిధిలో కొత్త విమానాశ్రయాలేవీ ఏర్పాటు కాలేదు. అయితే, 2017లో కేంద్రం తీసుకొచ్చిన 'ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్' (ఉడాన్) పథకం కింద మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయాలని గుర్తించారు. కానీ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ఎయిర్‌పోర్టు పనులు ముందుకు సాగలేదు. గతేడాది రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత.. అనువైన ప్రాంతాల్లో విమానాశ్రయాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తును ప్రారంభించింది. దీంట్లో భాగంగా.. జీఎమ్మార్ సంస్థతో పలుమార్లు చర్చలు జరపగా, 150 కి.మీ.ల షరతును పక్కనపెట్టటానికి సదరు సంస్థ అంగీకరించినట్లు తెలిసింది. వరంగల్ జిల్లాలో నిర్మించతలపెట్టిన మామునూరు ఎయిర్‌పోర్టు.. శంషాబాద్ విమానాశ్రయానికి 146-148 కి.మీ.లలోపే ఉండటం గమనార్హం. అయితే, జీఎమ్మార్ సుముఖతతో త్వరలోనే మామునూరు విమానాశ్రయ నిర్మాణ పనులు పట్టాలెక్కనున్నాయి.

నిజాం హయాంలోనే ఎయిర్‌పోర్టు

మామునూరులో 1930లో నిజాం హయాంలోనే విమానాశ్రయం ఏర్పాటు కాగా.. వివిధ కారణాలతో 1980లో అది మూతపడింది. ఆ తర్వాత కాలంలో అసలు అక్కడ ఎయిర్‌పోర్టు ఉందన్న విషయమే మరుగునపడింది. 2007లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రీజినల్ కనెక్టివిటీ స్కీం (ఆర్‌సీఎస్) కింద తెలంగాణ ప్రాంతంలో ఆరు కొత్త విమానాశ్రయాల ఏర్పాటుతోపాటు, మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయాలని అప్పటి ప్రభుత్వం ఎంవోయూ కూడా కుదుర్చుకుంది. కానీ, అభివృద్ధికి నోచుకోలేదు. ఈ క్రమంలోనే ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. అయితే మామునూరు విమానాశ్రయాన్ని పూర్తిస్థాయి ప్రయాణాలకు అనువుగా అందుబాటులోకి తీసుకురావాలంటే భూసేకరణ అంశంతోపాటు ఇతర సాంకేతిక సమస్యలు ఉన్నాయి. వీటిలో కీలకమైన 150 కి.మీ.ల సమస్య పరిష్కారానికి అడుగులు పడ్డాయి. ఇక విమానాశ్రయం ఏర్పాటుకు మొత్తం 949 ఎకరాలు అవసరం కాగా, ప్రస్తుతం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలో 696.14 ఎకరాల భూమి ఉంది. మిగిలిన 253 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. కాగా మామునూరు విమానాశ్రయం నుంచి విమానాలు నడిపేందుకు అవసరమైన ఇన్‌స్ట్రుమెంటల్ ఫ్లైట్ రూల్స్ (ఐఎఫ్ఆర్), విజువల్ ఫ్లైట్ రూల్స్ (వీఎఫ్ఆర్) అనుమతుల కోసం రాష్ట్ర ఏవియేషన్ విభాగం కసరత్తు చేస్తోంది. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే.. ఢిల్లీ సహా ఇతర ప్రాంతాలకు ఎయిర్ కనెక్టివిటీ పెరగడంతోపాటు.. పరిశ్రమల స్థాపనకు భారీస్థాయి కంపెనీలు ముందుకొచ్చే అవకాశం ఉంది. తద్వారా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి.


ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఉద్యోగులు

ఏసీబీ వలలో పంచాయతీరాజ్ ఉద్యోగులు

- భూపాలపల్లి కలెక్టరేట్‌లో ఈఈ, ఏటీవో, సీనియర్ అసిస్టెంట్ పట్టివేత

భూపాలపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో గురువారం లంచం తీసుకుంటూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)తో పాటు మరో ఇద్దరు సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన సదానందం అనే కాంట్రాక్టర్ డీఎంఎఫ్‌టీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టారు. వీటితోపాటు ఇతరత్రా పనులకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆయనకు రూ.4 లక్షల బిల్లు రావాల్సి ఉంది. దీని గురించి ఎన్నిసార్లు అధికారులను అడిగినా చెల్లించకుండా దాట వేస్తున్నారు. ఈ క్రమంలో సదానందం.. ఏటీవో చంద్రశేఖర్‌ను సంప్రదించగా బిల్లులు రావాలంటే తనతోపాటు ఈఈ దిలీప్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణికి కలిపి రూ.20వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పంచాయతీరాజ్ కార్యాలయంలో కాంట్రాక్టర్ నుంచి నగదు తీసుకుంటున్న ఈఈ దిలీప్ కుమార్, ఏటీవో చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'బ్రిక్స్' వేదికగా...

ప్రపంచ ఆర్థికవ్యవస్థలో మూడోవంతు వాటా ఉన్న 'బ్రిక్స్' కూటమి తన పదహారవ శిఖరాగ్ర సదస్సును దిగ్విజయంగా జరుపుకుంది. ఉక్రెయిన్ మీద యుద్ధం చేస్తున్నందుకు అంతర్జాతీయ న్యాయస్థానం జారీ చేసిన అరెస్టువారెంట్ కారణంగా గత ఏడాది బ్రిక్స్ సదస్సుకు గైర్హాజరైన రష్యా అధ్యక్షుడు ఈ ఏడాది సదస్సును స్వదేశంలో ఘనంగా నిర్వహించారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో పాటుగా, ఈజిప్ట్, ఇరాన్, ఇథియోపియా, అరబ్ ఎమిరేట్స్ వచ్చిచేరడంతో ఈ కూటమి ఇప్పుడు 'బ్రిక్స్ ప్లస్'గా మరింత బలపడిన విషయం తెలిసిందే. దాదాపు ముప్పై ఆరుదేశాలు ఈ సదస్సులో వివిధ రూపాల్లో, పాత్రల్లో భాగస్వాములు కావడం బ్రిక్స్ పట్ల దక్షిణాది దేశాలకు ఉన్న నమ్మకానికి ఉన్న నిదర్శనమని విశ్లేషకుల అభిప్రాయం. రష్యాతో పాశ్చాత్యదేశాల వైరం పతాకస్థాయిలో ఉన్న కాలంలో, అది ఆతిథ్యమిస్తున్న ఓ సదస్సు విజయవంతం కావడం ఆదేశం పట్ల ఉన్న విశ్వాసాన్ని తెలియచెబుతోందన్నది మరో అభిప్రాయం. మిగతాదేశాల సంగతి అటుంచితే, బ్రిక్స్ సదస్సు మనకు మాత్రం బాగానే ఉపకరించింది. పుతిన్ చొరవ, మధ్యవర్తిత్వం వల్ల ఐదేళ్ళుగా రగులుతున్న ఇండియా–చైనా సరిహద్దులు కాస్తంత శాంతించబోతున్నాయి. ఇంతకాలానికి ఉభయ దేశాధినేతలు నవ్వుమొఖంతో కనిపించడం, కరచాలనం చేసుకోవడం, ఓ నలభైఐదునిముషాల పాటు ఎదురెదురుగా కూర్చొని చర్చోపచర్చలు చేసుకోవడం స్వాగతించవలసిన పరిణామమే.

ఈ సయోధ్య ఎంతకాలం అన్న ప్రశ్న అటుంచితే, ఘర్షణలు, ఉద్రిక్తతలు లేని స్థితి ముందుముందు కనీసం కొంతకాలం ఉండబోతోంది. ఎవరు రాజీపడ్డారో, మెట్టు ఎక్కిందెవరో, దిగిందెవరో పూర్తివివరాలు వెలువడితే తప్ప తెలియదు కానీ, ఎల్ఏసీ వెంబడి పూర్వపరిస్థితులను పూర్తిగా పునరుద్ధరించబోతున్న మాట మట్టుకు ఇంపుగానే ఉంది. పెట్రోలింగ్ పాయింట్లన్నీ చేతికి వచ్చి, సైనిక ప్రతిష్టంభన పూర్తిగా తొలగిపోయి, ఎవరికివారు వెనకడుగువేసే ఈ ఒప్పందాన్ని రెండు దేశాలూ చరిత్రాత్మకంగానే అభివర్ణిస్తున్నాయి. ఒప్పందానికి ఆమోదముద్రవేయడంతో పాటు, రాబోయేరోజుల్లో ఉభయదేశాలు ఎంత చక్కగా, పరస్పర విశ్వాసంతో, సయోధ్యతో మెలగాలో కూడా దేశాధినేతలు సంకల్పం చెప్పుకున్నారు. మోదీ–జిన్‌పింగ్ చేతులు కలిపిన ఆ దృశ్యం చూసినప్పుడు చాలామందికి ఐదేళ్ళక్రితం మహాబలిపురంలో వారి వ్యాహ్యాళి, ఉయ్యాలలూగిన దృశ్యాలు గుర్తుకొచ్చాయి. ఈ అనుబంధం, ఆత్మీయత బూటకమా, వ్యూహాత్మకమా అన్న మీమాంస అటుంచితే, ప్రస్తుత ప్రపంచ పరిణామాల నేపథ్యంలో, ఇది తాత్కాలికమే అయినప్పటికీ స్వాగతించవలసిన మార్పే. నలభైఐదు నిముషాల పాటు ఇద్దరు దేశాధినేతలు విస్తృతమైన ప్రతినిధి బృందాలతో సహా చర్చల్లో కూర్చోవడం విశేషమైన పరిణామం. రష్యా, చైనా అధ్యక్షులు తన పక్కన ఉండగా భారతప్రధాని థంబ్స్ అప్ ప్రదర్శన మారిన వాతావరణానికీ, మూడుదేశాల మధ్యా పెరిగిన సయోధ్య సమన్వయాలకు నిదర్శనం. మోదీ చూపిన ఆ బొటనవేలు అమెరికా, కెనడాలను ఉద్దేశించినది కావచ్చునని కొందరు సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. సదస్సు యావత్తూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చెరోవైపునా భారత ప్రధాని, చైనా అధ్యక్షుడు కనిపిస్తూ వచ్చారు. ఇక, భారత్ రష్యా సంబంధాలమీద పుతిన్ ప్రశంసనీయమైన వ్యాఖ్యలు చేశారు. అనువాదం అక్కరలేదని, తాను చెబుతున్నదేమిటో భారత ప్రధానికి అర్థమయ్యే స్థాయిలో రెండుదేశాల మధ్యా సాన్నిహిత్యం ఉన్నదని పుతిన్ వ్యాఖ్యానించడం బాగుంది. కొన్ని సందర్భాల్లో ఇటువంటి అతిశయోక్తులు కూడా ఆత్మీయతలను సూచిస్తాయి. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి ప్రధాని మోదీ గతంలో కంటే ఎంతో స్వేచ్ఛగా వ్యాఖ్యానించడానికి ఈ వాతావరణం దోహదం చేసింది. ఇరాన్‌తోనూ, దాని మద్దతున్న హమాస్, హిజ్బొల్లాలతోనూ ఇజ్రాయెల్ యుద్ధంలో ఉన్న తరుణంలో ఇరాన్ కొత్త అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో మోదీ భేటీ కావడం ఓ విచిత్రమైన దృశ్యం. కజాన్ సదస్సుతో బ్రిక్స్‌లో కొత్త ఉత్సాహం వచ్చింది. బహుళధృవ ప్రపంచం ఆకాంక్షలకు అనుగుణంగా సదస్సు సాగిందని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించడం మిగతా ప్రపంచానికి, మరీ ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌కు మేలుచేస్తుందని మనం మరోమారు గట్టిగా చెప్పుకోగలిగాం.

'లడ్కీ బహిన్' గెలుపు గుర్రమేనా?



ముంబై మురికివాడ నివాసి (లడ్కీ బహిన్ లబ్ధిదారు) అయిన ఒక మహిళ నిర్మొహమాటంగా ఇలా అన్నారు: 'నేను ఎవరికి ఓటు వేసినా, అధికారంలోకి ఎవరు వచ్చినా ఏ ప్రభుత్వమూ ఇప్పుడు లడ్కీ బహిన్ పథకాన్ని ఆపలేదు'. ఇటువంటి ఓటర్లు జిత్తులమారి స్వభావం గలవారని నేతలు అనుకోవచ్చుగాక! మరి ఓటర్లు ఒక ఆకు ఎక్కువే చదివినవారే కాదూ? అంతిమంగా నేతలను వారు తప్పక కంగుతినిపిస్తారు, సందేహం లేదు.

వచ్చే నెల 20న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్ర ప్రజలే కాదు, యావద్దేశ జనులూ ఆ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండనున్నాయనే ఉత్కంఠతో ఉన్నారు. ఇప్పుడు మహారాష్ట్ర లోను, విశాల భారతదేశంలోను ప్రజల పిచ్చాపాటీలో రెండు మాటలు ప్రధానంగా వినపడుతున్నాయి. అవి: 'లడ్కీ బహిన్'. అది ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం సరికొత్తగా అమలుపరుస్తున్న 'సంక్షేమ' పథకం. దాని కింద సంవత్సరాదాయం రూ. రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్న ప్రతి కుటుంబానికి నెలానెలా ఆ కుటుంబ గృహిణికి రూ.1500 బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఇప్పుడు ఈ ఉదార ఆర్థిక హాయమే చర్చనీయాంశంగా ఉన్నది. అయితే అది ఒక నిర్ణాయకమైన రాజకీయ ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నది: గత ఆగస్టు నుంచి రెండు కోట్ల మందికి పైగా మహిళల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తున్న డబ్బు పాలక మహాయుతి కూటమి ప్రభుత్వంపై ప్రబలంగా ఉన్న ప్రజా వ్యతిరేకతను తొలగించగలదా?

రాష్ట్రాలలో గానివ్వండి లేదా కేంద్రంలో గానివ్వండి అధికారంలో ఉన్న ఏ పార్టీ ప్రభుత్వమైనా ఎన్నికల ముందు నిర్దిష్ట సామాజిక సమూహాలకు నగదు సహాయం పేరిట లంచాలు ఇవ్వడం ఇదే మొదటిసారి కాదు. అయితే ఇందుకు ముందెన్నడూ ఇంత హఠాత్తుగా, నిస్సిగ్గుగా, ఆర్థిక పర్యవసానాలను పట్టించుకోకుండా ఓటర్లకు ప్రత్యక్ష నగదు చెల్లింపులు చేయడం జరగలేదు. నవంబర్ 20న తమ ఓటు వేసేనాటికి లడ్కీ బహిన్ లబ్ధిదారులు అయిన మహిళల బ్యాంకు ఖాతాల్లో దీపావళి బోనస్ (ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రాకముందు చివరి నిమిషంలో ప్రకటించారు)తో సహా రూ.7500 జమ అవుతాయి. ఈ ఉదార ఆర్థిక సహాయం అందించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నెలసరిన ఇంచుమించు రూ.3700 కోట్లు వెచ్చించనున్నది. వార్షికంగా రూ.46 వేల కోట్ల భారం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై పడనున్నది. మరి మహారాష్ట్ర ప్రభుత్వ రుణ భారం ఇప్పటికే రూ.7.8 లక్షల కోట్లుగా ఉన్నదని అంచనా. ఎన్నికల ముందు మహాయుతి ప్రభుత్వ 'టిజోరీ ఖోలో' (ప్రభుత్వ ఖజానాను తెరువడం) రాజకీయాల మూలంగా ఆ రుణ భారం మరింతగా పెరగనున్నదని సీనియర్ బ్యూరాక్రాట్ ఒకరు అన్నారు.

లడ్కీ బహిన్ యోజనను మూడు విధాలుగా చూడవచ్చు. ఒకటి– ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అగాడీని చిత్తుచేసేందుకు ఉద్దేశించిన తెలివైన రాజకీయం. 2024 లోక్‌సభ ఎన్నికలలో పాలక మహాయుతి కూటమి రాష్ట్రంలోని 48 సీట్లలో కేవలం 17ను మాత్రమే గెలుచుకోగలిగింది. ఈ కారణంగా కీలక ఓటర్ల బృందాలను ఆకట్టుకోవడానికై కొత్త మార్గాలను అనుసరించేందుకు ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వానికి అనివార్యమయింది. మహిళలు, యువత లక్షిత ఓటు బ్యాంకులు కదా. మహిళలకు లడ్కీ బహిన్ పేరిట నేరుగా నగదు సహాయం అందించేందుకు, ఆర్థిక తోడ్పాటు అవసరమైన నిరుద్యోగ యువతకు 'లడ్కా భావు' పేరిట నగదు సహాయం చేసేందుకు షిండే సర్కార్ నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్ష ఇండియా కూటమి 'సంవిధాన్ ఖత్రే మే హై' (ప్రమాదంలో రాజ్యాంగం) అనే నినాదంతో గణనీయమైన విజయాలు సాధించగా ఇప్పుడు షిండే ప్రభుత్వం నగదు ఆధారిత పథకాలను శాసనసభ ఎన్నికల ప్రధాన ప్రచారాంశంగా చేయడంలో కనీసం తాత్కాలికంగా సఫలమయింది.

పై దృక్కోణానికి ప్రత్యామ్నాయంగా లడ్కీ బహిన్‌ను పూర్తిగా అనైతిక పద్ధతులలోనైనా సరే అధికారాన్ని కైవసం చేసుకోవడమే ధ్యేయమైన క్షుద్ర రాజకీయాలకు చిహ్నంగా చూసితీరాలి. ఇదే అందరినీ అమితంగా వ్యాకులపరుస్తున్న పరిణామం. గత ఐదేళ్లుగా మహారాష్ట్ర దేశంలోనే ఎక్కడా లేని రీతిలో రాజకీయ అస్థిరత్వంతో కుదేలైపోతోంది. ఈ ఐదేళ్లలో మూడు ప్రభుత్వాలు మారాయి. ఒక ముఖ్యమంత్రిని తెల్లవారుజామున గుట్టు చప్పుడు కాకుండా ప్రమాణ స్వీకారం చేయించారు. రెండు ప్రాంతీయ పార్టీలు చీలిపోయాయి. ధనరాశుల, మంత్రి పదవుల ప్రలోభంతో ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారు. భారత రాజకీయాల సంపూర్ణ నైతిక పతనానికి మహారాష్ట్ర అద్దం పట్టింది. 'వాషింగ్ మెషీన్', 'ఖోఖె చి సర్కార్' (ఒక 'ఖోఖా' ఒక కోటికి సమానం) అనేవి ఇప్పుడు మహారాష్ట్రీయుల రాజకీయ పరిభాషలో అంతర్భాగంగా ఉన్నాయి. ధన బలం, రహస్య బేరసారాలు, ఒప్పందాలు రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా భ్రష్టపరిచాయి. భావజాలం ఏదైతేనేమి రాష్ట్ర శాసనసభ్యులలో మూడోవంతు మంది గత 15 ఏళ్లలో ఒకటి కంటే ఎక్కువ పార్టీలలో ఉన్నవారే!



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

లడ్కీ బహిన్ లాంటి నగదు సహాయం పథకాలను స్పర్ధాత్మక 'రేవడి' రాజకీయాలుగా చూడడం మూడో దృక్కోణం (ఇదే చాలా తార్కికమైనది). ఇవి, ఆర్థిక వ్యవస్థకు తీవ్ర హానికరమైనవి అనవచ్చు. అనడమేమిటి, అలా నిరూపితమయ్యాయి కూడా. 2022లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉచితాల సంస్కృతికి వ్యతిరేకంగా ఓటర్లను హెచ్చరించారు. రాజకీయ పార్టీలు వాగ్దానం చేస్తున్న ఉచితాలు దేశ ఆర్థిక వ్యవస్థకు చాలా ప్రమాదకరమైనవి అని ఆయన స్పష్టం చేశారు 'రేవడి' సంస్కృతిని పెంచుతున్నవారు ప్రజలకు ఉచిత కానుకలు పంపిణీ చేయడం ద్వారా వారిని తమ స్వప్రయోజనాలకు కొనుగోలు చేసుకోవచ్చని విశ్వసిస్తున్నారని మోదీ గర్హించారు. 'మనమందరమూ సమైక్యంగా ఇటువంటి ఆలోచనలను అరికట్టాలి. దేశ రాజకీయాల నుంచి రేవడి సంస్కృతిని తొలగించాల్సిన అవసరం జరూరుగా ఉందని' ప్రధాన మంత్రి ఘోషించారు.

అదే సందర్భంలో కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నగదు హామీలను, ఢిల్లీ, పంజాబ్ లలో ఉచిత విద్యుత్తు, నీరు సమకూరుస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చిన హామీలను ప్రధానమంత్రి తీవ్రంగా విమర్శించారు. రెండు సంవత్సరాలు గడిచేసరికి ఇప్పుడు మహారాష్ట్రలో పాలక కూటమిలో ఉన్న బీజేపీ లడ్కీ బహిన్ పథకానికి చొరవ తీసుకున్నది తామేనని గొప్పగా చాటుకుంటోంది. దాని ద్వారా అందే నగదు సహాయం మహారాష్ట్ర మహిళలకు ఆర్థిక సాధికారత సమకూరుస్తుందని బీజేపీ శ్రేణులు వాదిస్తున్నాయి. ఓటర్లకు లంచాలు ఇవ్వడం, వారికి సాధికారత కల్పించడం మధ్య ఉన్న విభజన రేఖ చాలా పలుచన. ముఖ్యంగా ఒకటి రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అటువంటి పథకాలను ప్రవేశ పెడుతున్న రాజకీయ పార్టీలకు ప్రజలకు ఆర్థిక సాధికారత కల్పించడంలో చిత్తశుద్ధి ఉన్నదని భావించగలమా?

నగదు ఆధారిత సంక్షేమ పథకాలకు ముఖ్యంగా మహిళా ఓటర్లు ఒక కీలక ఓటు బ్యాంకుగా ఉన్నారు. 2023లో మధ్యప్రదేశ్‌లో శివరాజ్ చౌహాన్ తన లడ్లీ బెహనా పథకంతో బీజేపీకి విజయం సాధించారు. ఇప్పుడు మహారాష్ట్రలోని మహాయుతి కూటమి ప్రభుత్వం కూడా అదే విధంగా నగదు ప్రయోజనాలను అందిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో దేశ వ్యాప్తంగా ప్రతి పేద మహిళ బ్యాంకు ఖాతాలో ఏడాదికి రూ. ఒక లక్ష జమ చేస్తామని కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసింది. 'మీరు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారైతే ప్రతి సంవత్సరమూ మీకు రూ. ఒక లక్ష 'ఖటాకట్ ఖటాఖట్ ఆతా రహేగా' అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అభయమిచ్చారు.

రాహుల్ గాంధీ 'ఖటాఖట్' హామీలు బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట అని బీజేపీ దుయ్యబట్టింది. ఆయన హామీలు అవాస్తవికమైనవని అధిక్షేపించింది. మరి అదే బీజేపీ, ఇప్పుడు షిండే సర్కార్ 'ఫటా ఫట్' నగదు బదిలీని ఒక 'రాజకీయ గేమ్ ఛేంజర్'గా అభినందిస్తోంది. ఎంత నయవంచన! ఉచితాల సంస్కృతి సామాజిక–ఆర్థిక పర్యవసానాలు ప్రశ్నించదగినవి. కార్పొరేట్ కంపెనీల వేల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను రద్దు చేస్తున్న ప్రభుత్వం అన్నదాతలు అయిన రైతుల పంట రుణాలను మాఫీ చేసేందుకు వెనుకాడడమేమిటి? కష్టకాలంలో పేద మహిళలకు ఆదాయ మద్దతు సమకూర్చడంలో తప్పేమిటి? అసలు సమస్యేమిటంటే ప్రభుత్వ ప్రాథమ్యాలు సరైన విధంగా లేకపోవడమే. నిజమేమిటంటే మహారాష్ట్రలో నగదు సహాయ పథకాన్ని సుపరిపాలన లోటుకు నష్టపరిహారంగా ఉద్దేశించారన్నది ఒక చేదు సత్యం. ఐదేళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు విద్యా ప్రమాణాలు, ఆరోగ్యభద్రతా సదుపాయాలను మెరుగుపరిచేందుకు నిధులు సక్రమంగా వినియోగించకుండా ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వాలు గెలవ కష్టసాధ్యమైన ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రత్యక్ష నగదు ప్రయోజనాలను సమకూర్చేందుకు సిద్ధమవుతున్నాయి. నెరవేర్చని హామీలకు గాను ఇటువంటి లబ్ధిని కల్పించి ఎన్నికలలో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇదెలాంటి సుపరిపాలన?

ఓటర్లు సైతం పోటీ చేస్తున్న అభ్యర్థులతో, (వారి నుంచి మరింత ఆర్థిక లబ్ధి పొందేందుకు) బేరసారాలు చేయడంలో అంతకంతకూ ఆరితేరిపోతున్నారు. ఒక నిర్దిష్ట పార్టీ అభ్యర్థి గెలిచిన అనంతరం తన పార్టీకి విధేయంగా ఉంటాడనే నమ్మకం లేనప్పుడు ఓటర్లు ఆ నేతకు ఓటు వేయాల్సిన అగత్యమేమిటి? అంతకంటే ఎవరు ఎక్కువ డబ్బు ఇస్తే వారికే ఓటు వేయడం మేలు కదా అనే ఆలోచనలో ఓటర్లు ఉన్నారు. ముంబై మురికివాడ నివాసి (లడ్కీ బహిన్ లబ్ధిదారు) అయిన ఒక మహిళ నిర్మొహమాటంగా నాతో ఇలా అన్నారు: 'నేను ఎవరికి ఓటు వేసినా, అధికారంలోకి ఎవరు వచ్చినా ఏ ప్రభుత్వమూ ఇప్పుడు లడ్కీ బహిన్ పథకాన్ని ఆపలేదు'. ఇటువంటి ఓటర్లు జిత్తులమారి స్వభావం గలవారని నేతలు అనుకోవచ్చుగాక! మరి ఓటర్లు ఒక ఆకు ఎక్కువే చదివినవారే కాదూ? అంతిమంగా నేతలను వారు తప్పక కంగుతినిపిస్తారు, సందేహం లేదు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఉద్యోగ శిక్షణతో యువత సాధికారత

భారత్‌లోని ఒక తృతీయ శ్రేణి నగరంలో– రాష్ట్ర విశ్వవిద్యాలయానికి చెందిన కళాశాల నుంచి రీనా అనే అమ్మాయి కామర్స్‌లో డిగ్రీ చేసింది. ఆమె చదువుకున్న కాలేజీలో ప్లేస్‌మెంట్ సెల్ లేదు. విద్యార్థినిగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచినప్పటికీ చదువు పూర్తయిన తర్వాత ఆమెకు లభించే అవకాశాలు స్వల్పం. ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సిద్ధం కావడం, ఇరుగుపొరుగున ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేయడం (దీనిపై ఆమెకు ఆసక్తి ఉండవచ్చు, లేకపోవచ్చు) లేదా పెళ్లి చేసుకోవడం లాంటి వాటికి ఆమె పరిమితమైపోతుంది. ఇలా దేశవ్యాప్తంగా ఉన్న యువతలో మూడింట ఒక వంతు మంది (15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్నవారు. వీరిలో సగానికి కంటే ఎక్కువ మంది అమ్మాయిలే) చదువు, ఉద్యోగం, శిక్షణకు దూరంగా ఉన్నారు. ఇప్పటికీ మన దేశంలోని యువత అధిక భాగం ప్రైవేటు సంస్థల్లో నియామకాలకు అందనంత దూరంలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలే ప్రారంభించిన పీఎం ఇంటర్న్‌షిప్ పథకం(పీఎంఐఎస్) మార్కెట్ –ఆధారిత, యువత–కేంద్రీకృత పరిష్కారాన్ని అందిస్తుంది. ఇది యువత సాధికారతను సాధించేందుకు ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది.



రానున్న ఏఐ యుగంలో విద్య నుంచి ఉపాధి వరకు పీఎం ఇంటర్న్‌షిప్ పథకం కీలకంగా మారనుంది. పనిచేస్తూనే చదువుకునే, నేర్చుకునే అవకాశాన్ని ప్రతి ఒక్కరికీ ఈ విధానం కల్పిస్తుంది. జీవనసరళిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పెంచుకునే నైపుణ్యాలు ఉద్యోగ అవకాశాలను నిర్ణయిస్తాయి. భారతీయ యువతలో నైపుణ్యం పెంచడం, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడం, వారి జీవనోపాధిని పెంపొందించడమే లక్ష్యంగా ఉన్న ఈ పథకాన్ని విజయవంతం చేసే దిశగా, మొదటి నుంచీ కార్పొరేట్ కంపెనీలు పెద్ద ఎత్తున ఆసక్తి చూపిస్తున్నాయి.

నిర్దేశిత వయసుకు చెందిన కొంతమంది యువతకు 500 కంపెనీల్లో 12 నెలలపాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు పీఎంఐఎస్ అవకాశాన్ని కల్పిస్తోంది. 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయసు, అల్పాదాయ కుటుంబాలకు చెందినవారు, మెట్రిక్యులేషన్ నుంచి గ్రాడ్యుయేషన్ (ఐఐటీ గ్రాడ్యుయేట్లు, సీఏలు తదితరులను మినహాయించి) పూర్తి చేసినవారు ఈ పథకానికి అర్హులు. దీని ద్వారా నెలకు రూ.5000 స్టైఫండ్ లభిస్తుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం (రూ.4,500), సంబంధిత సంస్థ (రూ.500) సంయుక్తంగా అందిస్తాయి. అలాగే ఇతర ఖర్చుల కోసం అదనంగా మరో రూ.6,000 లభిస్తుంది. ప్రయోగాత్మక దశలో భాగంగా 2024 ఏడాదికి గాను 1.25 లక్షల మందికి ప్రయోజనం చేకూర్చాలని, అయిదేళ్లలో కోటి మందికి ఇంటర్న్‌షిప్ అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. దీని కోసం సంస్థలు తమ సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులను ఖర్చు చేసుకోవచ్చు.

ఇంటర్న్‌షిప్ – ఇటు ఉద్యోగార్థులకూ, అటు యాజమాన్యాలకూ పరస్పర ప్రయోజనాన్ని కలిగించేదిగా అనేక అధ్యయనాల్లో తేలింది. పని ఆధారిత అభ్యాస ప్రాధాన్యాన్ని విద్యా పరిశోధకులు, ఆ రంగానికి చెందిన శాస్త్రవేత్తలు గుర్తించారు. డేవిడ్ కోల్బ్, జాన్ డ్యూయి, కర్ట్ లూయిస్ సహా పలువురు పండితులు ఈ అంశంపై విస్తృతంగా అధ్యయనం చేశారు. పనిచేస్తూ నేర్చుకోవడం శ్రామికశక్తిని తయారు చేయడానికి ఉపకరించే ముఖ్య సాధనంగా అంతర్జాతీయ పరిశోధనల్లో తేలింది. భావవ్యక్తీకరణ, సహకారం, సృజనాత్మకత, నిర్ణయాత్మక ఆలోచనలను ఇంటర్న్‌షిప్‌లు మెరుగుపరుస్తాయి.

పీఎంఐఎస్ ద్వారా లభించే ఇంటర్న్‌షిప్– ఒక అవకాశాన్ని కల్పించేదిగా మాత్రమే కాకుండా, యువ ఔత్సాహికుల్లో గొప్ప మార్పును తెస్తుంది. కార్పొరేట్ ప్రపంచంలోని వాస్తవ పని విధానం అనుభవంలోకి వస్తుంది. ఇందుకు భిన్నంగా కళాశాలల్లో విద్యా బోధన నిర్మాణాత్మకంగానూ, స్థిరంగానూ ఉంటుంది. ఇంటర్న్‌షిప్ ద్వారా వారికి సరిపోయే కెరీర్ మార్గాన్ని గుర్తించి, అభివృద్ధి చేయడంతో పాటు బాధ్యతల నిర్వహణ, సమస్య–పరిష్కారం, నిర్ణయం తీసుకోవడం, సంఘటితంగా పనిచేయడం, సమయపాలనలో సైతం శిక్షణ పొందవచ్చు. ప్రతిభ, నిజాయితీ, అంకితభావం ఉన్నా, చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చేవారు ఉద్యోగాల్లో ప్రవేశించడానికి తొలినాళ్లలో పడే ఇబ్బందులను ఇంటర్న్‌షిప్‌లు తొలగిస్తాయి. ఇంగ్లీషులో సంభాషణా నైపుణ్యాలు, ఈ–మెయిల్ సంప్రదాయాలు, కంప్యూటర్ ఉపయోగించడం, ఎంఎస్ ఆఫీస్‌లో ప్రావీణ్యం లేదా ఇంటర్నెట్‌లో విశ్వసనీయ సమాచారాన్ని శోధించే ప్రాథమిక నైపుణ్యాలను వారు నేర్చుకుంటారు. భారతదేశంలోని ప్రముఖ విద్యాసంస్థలు, వృత్తిపరమైన కోర్సుల్లో ప్రవేశించేందుకు ఇంటర్న్‌షిప్ చేయడం తప్పనిసరి. కానీ కొన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, అంతగా ప్రాధాన్యం లేని కళాశాలల్లో కెరీర్ కౌన్సెలింగ్, జాబ్– ఆధారిత వ్యవస్థ లేకపోవడం వల్ల ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం ఎక్కువ శాతం యువతకు దక్కడం లేదు. పీఎంఐఎస్ ద్వారా పెద్ద మొత్తంలో లభించే ఇంటర్న్‌షిప్ సదుపాయాలు మెట్రోయేతర నగరాల్లోని యువతకు సమాన అవకాశాలు అందేలా చేసి ఉద్యోగావకాశాలను మెరుగుపరుస్తాయి. వ్యక్తిగతంగా, కొత్తగా లభించిన ఆర్థిక స్వేచ్ఛ వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మరింత మెరుగ్గా పనిచేసేలా, ఉన్నత లక్ష్యాలను అందుకునేందుకు యువతకు స్ఫూర్తిని అందిస్తుంది.

అభ్యర్థికి దీర్ఘకాలిక ఉద్యోగ అవకాశాన్ని కల్పించే విషయంలో అతని నైపుణ్యాలను పరీక్షించడానికి యాజమాన్యాలకు తక్కువ ఖర్చుతో చేసే ప్రయోగమే కాకుండా, ఇంటర్న్‌షిప్ నైపుణ్యాల అంతరాన్ని తగ్గిస్తుంది. సీఎస్ఆర్ లక్ష్యాన్ని కూడా అవి అధిగమించగలుగుతాయి. 12 నెలల పాటు ఇంటర్న్‌కు సంబంధించిన ఐక్యూ, ఈక్యూలను గమనించే అవకాశం వాటికి దక్కుతుంది. 'స్వభావం ఆధారంగా ఉద్యోగం ఇవ్వడం, నైపుణ్యాల కోసం శిక్షణ ఇవ్వడం' అనే వ్యూహాన్ని సంస్థ అమలు చేసుకోవచ్చు.

ఆర్థిక వ్యవస్థ విస్తరణకు, జాతీయ విద్యా విధానం–2020కు అనుగుణంగా పీఎంఐఎస్ ఉంది. యువతకు ఉపాధి, వెనుకబడిన నేపథ్యాలకు చెందిన వారికి సమాన అవకాశాలను వేగంగా అందించే చర్యగా దీన్ని పేర్కొనవచ్చు. యువతకు విద్యానంతర శిక్షణాలయంగా వ్యవహరిస్తూ, 'నైపుణ్య రహిత ఉపాధి' వల్ల ఆర్థిక వ్యవస్థకు జరిగే నష్టాన్ని తగ్గించడంలో ఈ ఇంటర్న్‌షిప్ దోహదపడుతుంది. రానున్న ఏఐ యుగంలో విద్య నుంచి ఉపాధి వరకు ఈ విధానం కీలకంగా మారనుంది. జీవనసరళిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పెంచుకునే నైపుణ్యాలు ఉద్యోగ అవకాశాలను నిర్ణయిస్తాయి. దీర్ఘకాలంలో ఉత్పాదక రంగంలో మూలధన–కార్మిక నిష్పత్తిని సైతం ఇది ప్రభావితం చేస్తుంది.

పెద్ద సంఖ్యలో ఇంటర్న్‌లకు సంస్థల్లో అవకాశాలు కల్పించడం, అగ్రశ్రేణికి చెందిన 500 సంస్థల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు చెందిన యువతను నియమించడం, సంస్థ ఉన్న ప్రదేశానికి మారాల్సి వస్తే స్టైఫండ్ సరిపోకపోవడం లాంటి వాస్తవిక సవాళ్లు ఇందులో ఉన్నాయి. రిమోట్ తరహా పని విధానం, నాన్–మెట్రో కార్యాలయాలు, పరిశ్రమల్లో నియామకాలు, సంస్థలు స్టైపెండ్ పెంచడం ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

విస్తృత ప్రచారం, కచ్చితమైన అమలు ద్వారా ఉపాధి కల్పనలో పీఎంఐఎస్ ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. భారత్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇది లక్ష్యాలను నిర్దేశించుకుంటుంది. భారతీయ యువతలో నైపుణ్యం పెంచడం, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడం, వారి జీవనోపాధిని పెంపొందించడమే లక్ష్యంగా ఉన్న ఈ పథకాన్ని విజయవంతం చేసే దిశగా, ప్రారంభం నాటి నుంచీ కార్పొరేట్ కంపెనీలు పెద్ద ఎత్తున ఆసక్తి చూపిస్తున్నాయి.

• వి. అనంత నాగేశ్వరన్
భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు
• దీక్షా సుప్యాల్ బిష్ట్
ఇండియన్ ఎకనమిక్ సర్వీస్ అధికారిణి

వ్యాపార నిపుణతలో విలువల నిబద్ధత

రతన్ టాటా మరణం పట్ల సంతాపం వ్యక్తం చేయడం ఆయనలాంటి పారిశ్రామికవేత్తలు, వ్యవస్థా నిర్మాణ దక్షులు ప్రపంచాన్ని ప్రభావితం చేసిన రోజులు వెళ్లిపోయినందుకు విచారపడడమే; అటువంటి ఐశ్వర్యవంతులు తమ వ్యక్తిగత జీవితంలో పొదుపరితనం, నిరాడంబరత పాటించే రోజులు గతించినందుకు బాధపడడమే; వ్యాపారం అనేది కేవలం వ్యక్తిగత లాభాల ఆర్జనకు మాత్రమే కాదని, ప్రజల శ్రేయస్సుకూ అది తోడ్పడాలన్న సమున్నత విలువలు విలుప్తమవుతున్నందుకు విచారించడమే.





■ సునీతా నారాయణ్

మట్టివాసన

రతన్ టాటాతో మా మొదటి సంకర్షణ (Interaction) సంతోషదాయకమైనది కాదు. తీవ్ర కాలుష్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతుంటే నిర్మలమైన గాలి పౌరుల హక్కు అని ఎలుగెత్తుతూ మేము ఒక ఉద్యమాన్ని ప్రారంభించాము. పిఎమ్ 2.5 అనే కణ రూప ద్రవ్యాన్ని డీజిల్ ఉద్గారిస్తుందనే వాస్తవాన్ని వైజ్ఞానిక పరిశోధనలు అప్పుడప్పుడే ధ్రువీకరిస్తున్న కాలమది. 1990ల నడిమి సంవత్సరాలలో అదొక కొత్త విషయం. డీజిల్‌తో నడిచే వాహనాల నుంచి పిఎమ్ 2.5 రేణువులు ఉద్గారమై గాలిలో కలిసి, ఆ కాలుష్య గాలిని పీల్చిన వారి ఊపిరితిత్తులలోకి చొచ్చుకుపోతాయి. పౌరుల ఆరోగ్యం దృష్ట్యా డీజిల్‌తో నడిచే వాహనాలతో వాటిల్లే ఆరోగ్య ప్రమాదాల గురించి నేను, (కీర్తిశేషుడు అయిన) నా సహచరుడు అనిల్ అగర్వాల్ విపులంగా రాశాము. వెన్వెంటనే మాకు టాటా మోటార్స్ కంపెనీ నుంచి ఒక పరువు నష్టం నోటీస్ వచ్చింది. అపనిందలతో తమ వ్యాపార నష్టానికి కారకులమవుతున్నామనేది ఆ హెచ్చరిక సారాంశం. రతన్ టాటా తన ఆటోమొబైల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన రోజులవి. అది డీజిల్‌తో నడిచే వాహనం. తత్కారణంగా ప్రత్యర్థి కంపెనీలు (పెట్రోల్ కార్ల ఉత్పత్తిదారులు) అయిన మారుతి సుజుకి మొదలైన వాటి కంటే నానోకు విశేష స్థాయిలో వ్యాపార అనుకూలత సమకూరే అవకాశమున్నది. ఇదలా ఉంచితే టాటా మోటార్స్ మాకు జారీ చేసిన లాయర్ నోటీసుపై మేము ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. న్యాయస్థానంలో పోరాడడానికి నిశ్చయించుకున్నాం. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో మాకు, టాటా మోటార్స్‌కు మధ్య తీవ్ర న్యాయపోరాటమే జరిగింది. మేము మా వాదనకే దృఢంగా కట్టుబడి ఉన్నాం.

అయితే ఈ న్యాయపోరాటంలో మా పరస్పర ఆగ్రహం నెమ్మదిగా శాంతించింది. అంతిమంగా నేను ఒక వాస్తవాన్ని గ్రహించాను: మేము డీజిల్ కార్లకు వ్యతిరేకంగా ఉద్యమించింది టాటా మోటార్స్ ప్రత్యర్థి కంపెనీల (పెట్రోల్ వాహనాల తయారీదారులు) తరపున అని తప్పుగా విశ్వసించినందునే రతన్ టాటా మాకు వ్యతిరేకంగా న్యాయపోరాటానికి ఉపక్రమించారు. అలాగే పిఎమ్ 2.5 విషయమై వైజ్ఞానిక పరిశోధనలు ధ్రువీకరిస్తున్న వాస్తవాల ప్రాతిపదికన మేము మా ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామని నిరూపణ అవడంతో రతన్ మా నిజాయితీని గుర్తించారు. ఆటోమోటివ్ ఇంధనంగా డీజిల్ ప్రజల ఆరోగ్యానికి ఎనలేని హానికారి అవుతుందనే విషయాన్ని ఆయన అర్థం చేసుకున్నారు. దీంతో మా ఉద్యమం పట్ల ఆయన అభిప్రాయాలు, ఆలోచనలు మారాయి. అయితే టాటా మోటార్స్ తన డీజిల్ కార్ ప్రాజెక్టు నుంచి వెనక్కు తగ్గినట్టుగా భావించనవసరం లేదు. ఆ కంపెనీ ఆ వాహనాల ఉత్పత్తితో ముందుకు సాగింది. మేమూ, డీజిల్ వాహనాలకు వ్యతిరేకంగా మా ఉద్యమాన్ని విడనాడలేదు. మరి ఈ వ్యవహారం ఎలా ఒక కొలిక్కి వచ్చిందో తెలుసా? విరుద్ధ అభిప్రాయాలను ఆమోదించడమనే పాత కాలం మంచి ప్రజాస్వామిక సంప్రదాయాల స్ఫూర్తితో ఆ వివాదం ముగిసింది. రతన్ టాటా తన నానో కార్లను తొలుత ఢిల్లీ ఆటో మోబైల్ ఎగ్జిబిషన్‌లో విడుదల చేశారు. ఆ సందర్భంగా ఆయన నా పేరును ప్రస్తావించి సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే నానో, సునీతా నారాయణ్ ఆమోదం పొందగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు! ఆశ్చర్యపోయాను, వినమ్రంగా రతన్ టాటా విశాల, నిష్పాక్షిక దృక్పథాన్ని అంగీకరించాను.

రతన్ టాటాతో నా రెండో అనుభవం మరింత వ్యక్తిగతమైనది, మనసును తాకేది. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ హయాంలో ఒకసారి నేను ఒక ఉన్నతస్థాయి విందు సమావేశంలో పాల్గొన్నాను. అత్యున్నత స్థాయి అధికారులు, పారిశ్రామిక దిగ్గజాలు, ప్రభావ ప్రాబల్యాలుగల రాజకీయ నాయకులు ఉన్న సమావేశమది. దేశ జనాభాలోని ప్రతి ఆదాయ వర్గం వారి అవసరాలను తమ ఆటోమోబైల్ కంపెనీ ఎలా తీరుస్తుందో రతన్ టాటా వివరిస్తున్నారు. ఆయన అప్పుడే బ్రిటన్‌లోని ఆటోమోబైల్ దిగ్గజం జాగ్వార్ కంపెనీని స్వాయత్తం చేసుకున్నారు. సంపన్నులు, సెలెబ్రిటీలు, ఉన్నత స్థాయి అధికారులకు మాత్రమే లభ్యమయ్యే కారు అది. మొట్టమొదటిసారి కారు కొనుక్కోదలిచిన వినియోగదారులకు అందుబాటులో ఉండేది నానో. ఆయన మాటల మధ్యలో నేను జోక్యం చేసుకుని ఒక విషయాన్ని చెప్పడాన్ని రతన్ మరచిపోయారని వ్యాఖ్యానించాను. ఆయన కళ్లలో ఏదో కలత పొడసూపడం నాకు స్పష్టంగా కనిపించింది. పర్యావరణ ఉద్యమకారిణిగా నేను ఏదైనా ఇబ్బందికరమైన విషయాలను వెల్లడిస్తానని ఆయన అనుకున్నారు కాబోలు! అయితే నేను ఆయనకుగానీ మరెవరికిగానీ అప్రియమైన విషయాలు ఏవీ చెప్పలేదు. టాటా మోటార్స్ బస్సులు కూడా తయారు చేస్తున్నదని, అవి, కార్ల కంటే ఎంతో ఎక్కువ మందిని వారి గమ్యాలకు చేరుస్తున్నాయని, తమ కంపెనీ తాజాగా సిఎన్‌జితో నడిచే అధునాతన బస్సులను ఉత్పత్తి చేయడం ప్రారంభించిందనే విషయాన్ని ప్రస్తావించడాన్ని రతన్ టాటా మరచిపోయారని నేను అన్నాను. అందరూ నన్ను మెచ్చుకోలుగా చూడడాన్ని గమనించాను. సరే అటువంటి సమావేశాల్లో సంభాషణలు ఎప్పటి మాదిరిగానే సాధారణ విషయాల మీదకు మళ్లాయి. నేను ప్రస్తావించిన విషయం అంతటితో ముగిసినట్టేనని భావించాను.

నేను పొరపడ్డాను. కొద్దిరోజుల అనంతరం టాటా మోటార్స్ అత్యున్నత స్థాయి అధికారి ఒకరు మా కార్యాలయానికి వచ్చారు. మేము నిర్వహిస్తున్న డీజిల్ వ్యతిరేక ఉద్యమ విషయమై ఆయన వచ్చారేమోనని నేను భావించాను అయితే తాను టాటా మోటార్స్ కార్ల తయారీ విభాగం నుంచి గాక బస్‌ల ఉత్పత్తి విభాగానికి చెందినవాడినని ఆ అధికారి చెప్పారు. రతన్ టాటాకు నేను చెప్పిందేమిటని ఆయన ప్రశ్నించారు. ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించగా తాను ఎందుకు వచ్చిందీ వివరంగా చెప్పారు. ఆ విందు సమావేశంలో నేను చేసిన వ్యాఖ్యలు రతన్ టాటాకు విభ్రమం కలిగించాయట. ఆ తరువాత టాటా మోటార్స్ ఎగ్జిక్యూటివ్‌కు ఫోన్ చేశారట (మా కార్యాలయానికి వచ్చింది ఆ అధికారే), తనకు కూడా తెలియకుండా తన కంపెనీలో జరుగుతున్న, సునీతా నారాయణ్ ప్రశంసించిన ఆ ప్రశస్త పని ఏమిటనేది. ఆయనకు తెలియలేదు. ఎట్టకేలకు నా వ్యాఖ్యలను ఆయన అర్థం చేసుకుని మెచ్చుకున్నారు. నా వ్యాఖ్యలు చలనశీలత రూపాంతరీకరణం (mobility transformation) ప్రజల ప్రయాణ అవసరాలను తీర్చడంలో కార్లు కాకుండా బస్సుల పాత్ర, ప్రాధాన్యం గురించి రతన్ టాటాలో కొత్త ఆలోచనలను రేకెత్తించాయని తెలిసింది.

ఆ గొప్ప మనిషి నుంచి నాకు వ్యక్తిగతంగా లభించిన గుర్తింపు, ప్రశంసలను చెప్పుకోవడానికి నేను ఇది రాయడం లేదు. ఆయనలోని గొప్పదనమేమిటో వివరించడానికే ఇది రాస్తున్నాను. ఇతరులు చెప్పేది ఓర్పుగా వినే శక్తి, ఎంత ఇబ్బందికరమైనవి అయినప్పటికీ విరుద్ధ అభిప్రాయాలు, వైఖరులను అంగీకరించే విశాల దృక్పథమే ఆ గొప్పదనం. కొంత మంది ఇతర పారిశ్రామికవేత్తలతో మా అనుభవాల దృష్ట్యా కూడా నేను ఇది మరీ చెప్పుతున్నాను. తమ ఉత్పత్తుల్లో క్రిమిసంహారక మందులు ఉన్నాయని మేము నిరూపించినప్పుడు రెండు బహుళజాతి కంపెనీలు దౌర్జన్యకరంగా, అసహ్యంగా ప్రతిస్పందించాయి. మా శాస్త్రీయ నిరూపణలను ఆ కంపెనీలు పూర్తిగా కొట్టివేశాయి. తాము తప్పు చేయడమనేది జరగదని ఎందుకంటే తమవి అమెరికాకు చెందిన బహుళజాతి కంపెనీలు అనే దురహంకారాన్ని ప్రదర్శించాయి. ఒక కంపెనీ వారయితే మరింత ఆక్షేపణీయంగా ప్రవర్తించారు. మమ్ములను బెదిరించారు, భయపెట్టారు చౌకబారు ఎత్తుగడలకు దిగారు. చివరకు కేసులు పెట్టారు. వారు ఉత్పత్తి చేస్తున్న ఆహారంలో విష పదార్థాలు అధికంగా ఉంటున్నాయని నిరూపించడమే మేము చేసిన తప్పు! మేము మా వ్యక్తిగత ప్రయోజనాలకు పనిచేయడం లేదని, వ్యాపారంలో ఉత్పత్తిదారుల ప్రయోజనాలు, వినియోగదారుల సంక్షేమం మధ్య సమతౌల్యత ఉండాలనే ఉద్దేశంతో మేము మా కృషి చేస్తున్నామని వివరించినా ఆ కంపెనీ విన్పించుకోలేదు.

రతన్ టాటా మరణం పట్ల సంతాపం వ్యక్తం చేయడం ఆయనలాంటి పారిశ్రామికవేత్తలు, వ్యవస్థా నిర్మాణ దక్షులు ప్రపంచాన్ని ప్రభావితం చేసిన రోజులు వెళ్లిపోయినందుకు విచారపడడమే; అటువంటి ఐశ్వర్యవంతులు తమ వ్యక్తిగత జీవితంలో పొదుపరితనం, నిరాడంబరత పాటించే రోజులు గతించినందుకు బాధపడడమే; వ్యాపారం అనేది కేవలం వ్యక్తిగత లాభాల ఆర్జనకు మాత్రమేకాదని, ప్రజల శ్రేయస్సుకూ అది తోడ్పడాలన్న సమున్నత విలువలు విలుప్తమవుతున్నందుకు విచారించడమే. రతన్ టాటాకు నివాళి అర్పించటం ఈనాటి కొంత మంది కుబేరుల అసభ్య దుబారాలను తిరస్కరించడమూ, భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేయడమంటే ఒక అభిప్రాయం పట్ల అనంగీకారం కాదనే భావనను మళ్లా మన జీవితాల్లోకి తెచ్చుకోవడానికి మనం సంకల్పించుకోవడం కావాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)



పింఛన్లను పెంచడంతోపాటు కొత్త పింఛన్లను మంజూరు చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అమలులో జాప్యం చేస్తుండడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. అట్టహాసంగా తీసుకున్న దరఖాస్తులకు ఇంకా మోక్షం కలగడం లేదని అసంతృప్తి చెందుతున్నారు. అవి ఇప్పుడు ఏ దశలో ఉన్నాయో తెలియని అయోమయ స్థితిలో ఉంది. ఇక కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు ఎప్పుడు వస్తాయోనని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. సంబంధిత కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఇదిలా వుండగా, పింఛన్ డబ్బుల పెంపుపై ఇంకా సర్కారు ప్రకటన చేయకపోవడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యేడాదవుతున్నా.. పెంచకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్లు వరంగల్ జిల్లాలో 1,25,049 మంది పింఛన్ పొందుతుండగా, వీరికి ప్రతీనెలా రూ. 29.14 కోట్లు ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. అలాగే హనుమకొండ జిల్లాలో 1,04,106 మంది పింఛన్ పొందుతుండగా, వీరికి ప్రతీ నెలా రూ.24.28 కోట్లు పంపిణీ చేస్తున్నారు.

వితంతు పింఛన్ మంజూరు చేయాలి

గంధం రాజమ్మ, శంభునిపేట, వరంగల్

నా భర్త గంధం రాజు అనారోగ్యంతో 4 ఏళ్ల కిందట మృతి చెందాడు. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటివరకు పింఛన్ మంజూరు కావడం లేదు. కలెక్టరేట్ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో సైతం పింఛన్ కోసం దరఖాస్తు అందజేశాను. కలెక్టర్ కార్యాలయంలో కలిస్తే మునిసిపల్ కార్పొరేషన్‌కు వెళ్లమని సూచించారు. అక్కడికి వెళితే డీఆర్‌డీవో కార్యాలయంలో కలవాలని చెబుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరగడమే తప్పా ఎలాంటి ప్రయోజనం కలగడం లేదు.

అందని 'చే'యూత!

ఇంకా అమలులోకి రాని కొత్త పింఛన్లు

- దరఖాస్తులు స్వీకరించి నెలలవుతున్నా కలగని మోక్షం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- కేంద్రాల్లో పోటెత్తుతున్న దరఖాస్తులు
- ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న విమర్శలు

వరంగల్ కలెక్టరేట్/హనుమకొండ కలెక్టరేట్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఎన్నికలకు ముందు ఆసరా పేరును చేయూతగా మార్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారం చేపట్టి 10 నెలలు అవుతున్నా పింఛన్లపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో అర్హులైన వారు ఆవేదన వ్యక్తం చేసున్నారు. సుమారు రెండున్నరేళ్ల నుంచి నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి ప్రతీ నెలా అధిక సంఖ్యలో పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకుంటున్నప్పటికీ మంజూరుకు మాత్రం నోచుకోవడం లేదు. చాలామంది ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించి ప్రదక్షిణలు చేస్తున్నారు. నూతన పింఛన్ల మంజూరుకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి.

వెలువడని ప్రకటన

గతంలో ప్రతీ నెలా కొత్త పింఛన్లు మంజూరు చేసే విధానం అమలులో ఉండేది. రెండేళ్లుగా పింఛన్లపై మంజూరుపై ఎలాంటి ప్రకటన రావడం లేదు. ప్రతీనెలా అర్హులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు విచారణ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో పక్కన పెడుతున్నారు. ఈ నెలలోనే నూతన పింఛన్ ప్రక్రియ మొదలవుతుందని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. భార్యాభర్తల్లో ఎవరైనా ఒకరు ఆసరా పింఛన్ పొందుతూ మరణిస్తే ఆ పింఛన్‌ను భాగస్వామికి బదిలీ చేస్తున్నారు. పోయిన సంవత్సరం నుంచే స్పౌజ్ పింఛన్ల ప్రక్రియ కొనసాగుతోంది. స్పౌజ్ పింఛన్ల కోసం అర్హులైన వారు

మిగతా 6లో..

హనుమకొండ, వరంగల్ జిల్లాలో పింఛన్ పొందుతున్న వారి వివరాలు

	హనుమకొండ	వరంగల్
వృద్ధాప్య	39087	47694
వితంతు	36878	47092
వికలాంగులు	13799	15689
చేనేత	1932	2299
గీత కార్మికులు	2891	2895
బీడీ కార్మికులు	3482	5695
ఒంటరి మహిళలు	2593	3202
ఫైలేరియా బాధితులు	534	326
డయాలసిస్ బాధితులు	58	141



సైకిల్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

అమరవీరుల యాదిలో..

- నేడు కమిషనరేట్ నుంచి సైకిల్ ర్యాలీ
- అధిక సంఖ్యలో పాల్గొనాలని పౌరులకు సీపీ పిలుపు

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగాలు చేసిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ నేడు సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పిలుపు నిచ్చారు. పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27వ తేదీన ఉదయం 6గంటలకు వరంగల్ పోలీసు కమిషనరేట్ నుంచి ప్రారంభమయ్యే సైకిల్ ర్యాలీలో యువత పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ మేరకు ఏజే పెడల్స్, ట్రైసిటీ సైకిల్ రైడర్స్ సంయుక్తంగా నిర్వహించనున్న ర్యాలీ ప్రచార పోస్టర్‌ను సీపీ కార్యాలయంలో అంబర్ కిషోర్ ఝా ఆవిష్కరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. బిజీ జీవితంలో సైక్లింగ్ చక్కని వ్యాయామని, సైక్లింగ్‌కు కొద్ది సమయం కేటాయించడం అవసరమన్నారు. ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని పోలీసు అమర వీరుల కుటుంబాలకు బాసటగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజే పెడల్స్ యాజమాన్యం జయంత్, వరుణ్, ఆనంద్ ట్రైసిటీ రైడర్స్ అసోసియేషన్ సభ్యులు అనుమాండ్ల విద్యాసాగర్, కంకణాల సుధాకర్ రెడ్డి, కేదాసి వెంకటేశ్వర్ కుమార్, ఎంపీ ప్రసాద్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియాకు వివరాలను వెల్లడిస్తున్న ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్

ఒక ముఠా.. 4 జిల్లాలు

- 500కుపైగా నకిలీ పాస్ పుస్తకాల విక్రయం
- బ్యాంకు రుణాలు.. రైతు భరోసా వస్తుందని ఆశచూపి మోసం
- ములుగు, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్‌లలో దందా
- పోలీసు, అటవీశాఖ అధికారుల దర్యాప్తులో తేలిన నిజం
- ప్రధాన సూత్రధారి సహా నలుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్

6

కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

- నష్కల్ బైపాస్ లైన్‌పై పునరాలోచించాలి
- రైళ్ల హాల్టింగ్, ఇజ్జత్ పాస్‌లను పునరుద్ధరించాలి
- కేంద్రమంత్రి, రైల్వే జీఎం సమావేశంలో వరంగల్, మానుకోట ఎంపీలు కావ్య, బలరాం నాయక్



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పక్కన మహబూబాబాద్, ఖమ్మం ఎంపీలు బలరాంనాయక్, రఘురామ్‌రెడ్డి

6

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- సన్నాలకు రూ.500 బోనస్ చెల్లిస్తాం..
- ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగో లు చేస్తుందని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు స్పష్టం చేశారు. నందనం సొసైటీ ఆధ్వర్యంలో నందనం - రాంనగర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం టెస్కాబ్ చైర్మన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్నరకాలకు క్వింటాల్‌కు రూ.500లు అద నంగా బోనస్ అందిస్తూ రైతు పక్షపాతిగా నిలుస్తోందన్నారు. సన్నధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి నిబంధనలు లేవని, రైతులు ఎన్ని క్వింటాళ్లు పండించినా బోనస్ ఇస్తామన్నారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోలును వేర్వేరుగా చేపట్టనున్నట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లోకి రెండు మూడు రోజుల్లోనే నగదు జమ అవుతుందని, అందుకు ప్రభుత్వం రూ.25 వేల కోట్ల నిధులను సమకూర్చిందన్నారు. ఏగ్రేడ్ క్వింటాల్‌కు రూ.2,320తోపాటు వ్యవసాయ శాఖ ప్రకటించిన 33 రకాల సన్నాలకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు, కామన్‌రకం క్వింటాల్‌కు రూ.2,300 చొప్పున మద్దతు ధర లభిస్తుందన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీ, గొనె సంచులు, రవాణా సదుపాయాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విక్రమ్‌కుమార్, సొసైటీ నోడల్ అధికారి సునిల్‌కుమార్, ఏవో సునిల్‌రెడ్డి, ఏఈవో హీనా, సొసైటీ డైరెక్టర్లు బుచ్చిరెడ్డి, మేటి చిరంజీవి, బిర్రు పద్మలతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు



ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులు



స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా ఎంపీ కావ్య

వరంగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ వ్యవహారాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలిగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎంపిక య్యారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం చేస్తున్న ప్రయత్నాలకు తన వంతు సహకారాన్ని అందిస్తానని ఈ సందర్భంగా కావ్య తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ మెడికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. గురువారం హనుమకొండలోని ప్రభుత్వ ఛాతి, క్షయ వైద్యశాలను కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆస్పత్రిలోని వార్డులను సందర్శించి అందుతున్న సౌకర్యాలు, చికిత్స వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. పురాతన భవనాలను గుర్తించి నూతన భవనాలకు నివేదికలు అందించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌వో కె.లలితాదేవి, ప్రసాద్, రాజశేఖర్, డాక్టర్ సునిత, వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన తాగునీటి సరఫరా, విద్యుత్, టాయిలెట్స్ నిర్మాణ పనులు ప్రతీ పాఠశాలలో 100శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. హనుమకొండ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను గురించి సంబంధిత అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనవసరమైన పనులు కాకుండా ప్రాధాన్యత కలిగిన పనులనే చేపట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు అందించేలా ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓలు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో వాసంతి, డీఆర్‌డీవో నాగ పద్మజ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూపాలపల్లి కలెక్టరేట్‌లో
ఏసీబీ కలవరం

- పీఆర్ విభాగంలో దాడులు
- లంచం తీసుకుంటూ పట్టుపడ్డ ముగ్గురు ఉద్యోగులు
- కాంట్రాక్టర్ నుంచి రూ.20వేలు డిమాండ్
- రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన పీఆర్ ఈఈ, ఏటీవో, సీనియర్ అసిస్టెంట్
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ సాంబయ్య




కార్యాలయంలో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు, అవినీతి అధికారుల నుంచి ఏసీబీ స్వాధీనం చేసుకున్న నగదు

భూపాలపల్లి కృష్ణకాలనీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి కలెక్టరేట్ సముదాయంలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏసీబీ దాడులు కలకలం రేపాయి. ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఇంజనీరింగ్ అధికారితోపాటు మరో ఇద్దరుఉద్యోగులు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోవడం చర్చనీయాంశమైంది. డ్యూటీలు దిగే సమయంలో ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడులు నిర్వహించడంతో కార్యాలయ సిబ్బంది అవాక్కయ్యారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో ఈ దాడులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి జిల్లా పరిధిలోని మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన కుంట సదానందం అనేవ్యక్తి ఇదే గ్రామంలో వార్డు మెంబర్‌గా కొనసాగుతున్నాడు. కాంట్రాక్టర్‌గా కూడా ఆయన పని చేస్తున్నాడు. డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేశాడు. మొత్తం బిల్లులో రూ. 5లక్షల 83 వేలు ఇప్పటికే ఆయన అందగా మిగిలిన రూ.4 లక్షల 17 వేలు పెండింగ్‌లో ఉన్నాయి. దీని కోసం ఏఈ ఇన్‌బుక్ రికార్డు చేసి ఈఈకు ఫైలు పంపించారు. అయితే.. ఈ ఫైల్ స్క్రుటినీ చేసి పాస్ ఆర్డర్ ఇచ్చేందుకు ఈఈ సంపతి దిలీప్‌కుమార్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్(ఏటీవో) తహలాల చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ వల్లుపదాసు శోభారాణి ముగ్గురు కలిసి రూ.20వేలు డిమాండ్ చేశారు. అందుకు కాంట్రాక్టర్ సదానందం ఒప్పుకున్నాడు. అయినప్పటికీ వారు కాలయాపన చేసుకుంటూ వచ్చారు. ముందుగా డబ్బులు చెల్లిస్తేనే పని పూర్తి అవుతుందని అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ కరాఖండిగా చెప్పారు. దీంతో లంచం ఇచ్చేందుకు ఇష్టం లేక ఏసీబీ అధికారులను కాంట్రాక్టర్ ఆశ్రయించాడు. పథకం ప్రకారం ముగ్గురికి కాంట్రాక్టర్ డబ్బులు ఇస్తుండగానే ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. ఈఈ దిలీప్‌కుమార్, ఏటీవో చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే గంటన్నరపాటు సాగిన ఏసీబీ సోదాలతో అధికారుల్లో ఆందోళన కనిపించింది. ఈదాడుల్లో ఏసీబీ డీఎస్పీ సాంబయ్యతో పాటు సీఐలు శ్యాంసుందర్, ఎస్. రాజు, ఎల్. రాజు, మరో 11 మంది ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

పద్మశాలీలకు ప్రాధాన్యం కల్పించాలి

- ఉమ్మడి జిల్లా పద్మశాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిప్రకాష్

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల వీసీల నియామకాల్లో పద్మశాలీలకు ప్రాధాన్యత కల్పించాలని ఉమ్మడి జిల్లా పద్మశాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోడం రవిప్రకాష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 9 విశ్వవిద్యాలయాలకు వీసీలను ప్రభుత్వం నియమించిందని ఇందులో పద్మశాలీతో పాటు చేనేత కులాలకు చెందిన వారు ఎవరూ లేరని పేర్కొన్నారు. పద్మశాలీ కులానికి చెందిన పలువురు అర్హతగల ప్రొఫెసర్లు, రిటైర్డ్‌ప్రొఫెసర్లు, ఉన్నత విద్యావంతులు, మేథావులు వీసీల నియామకాల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అర్హత గల వారు ఎంతో మంది ఉన్నప్పటికీ వీరికి వీసీల నియామకంలో ప్రాధాన్యత కల్పించకుండా ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు.

ఒక ముఠా.. నాలుగు జిల్లాలు

- 500కుపైగా నకిలీ పాస్ పుస్తకాల విక్రయం
- బ్యాంకు రుణాలు.. రైతు భరోసా వస్తుందని ఆశచూపి మోసం
- ములుగు, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్‌లలో దందా
- పోలీసు, అటవీశాఖ అధికారుల దర్యాప్తుతో కుట్ర భగ్నం
- ప్రధాన సూత్రధారి సహా నలుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్

ములుగు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాలుగు జిల్లాలు వేదికగా రైతు భరోసా, బ్యాంకు రుణాలను అడ్డదారిలో పొందేందుకు ఒక ముఠా చేసిన భారీ కుట్రను అటవీశాఖ అధికారులు భగ్నం చేశారు. నకిలీ ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల తయారీపై జరిపిన దర్యాప్తులో ప్రధాన సూత్రధారి సహా నలుగురిని అరెస్టు చేశారు. ఈక్రమంలో నాలుగు జిల్లాల్లో ఇప్పటికే 500లకు పైగా ఫేక్ పట్టాలను విక్రయించినట్లు తేలడంతో విస్తుపోయారు. పూర్తిస్థాయి దర్యాప్తు జరపడం, నకిలీ పాస్‌పుస్తకాలను రికవరీ చేయడం ఆశాఖకు సవాల్‌గా మారింది. ములుగు డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్ జిల్లాకేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన చందావత్ భద్రు, వరంగల్‌లోని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు తాటిపాముల రాజు, క్యూఆర్ కోడ్‌లు రూపొందించిన మహబూబాబాద్ జిల్లా నెక్కొండకుచెందిన కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడు భూక్యా వెంకన్న, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లికి చెందిన అటవీ హక్కుల కమిటీ చైర్మన్ జాటోతు రాజ్‌కుమార్‌లను అరెస్టు చూపించారు. వివరాలను వెల్లడించారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని అటవీ గ్రామాలలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్న చందావత్ భద్రు రైతు భరోసా, పంట రుణాలను ఆశచూపి అమాయక రైతులు, నిరుపేదల పాస్‌బుక్కుకు రూ.50వేల చొప్పున వసూలు చేశాడని తెలిపారు. రైతుల ఫొటోలు, ఆధార్ కార్డులు, ఇతర వివరాలను వాట్సప్ ద్వారా పంపిస్తే వరంగల్‌లోని గణేష్ ప్రింటర్స్‌లో దాని యజమాని రాజు ఫొటోషాప్, పేజ్ మేకర్ వంటి సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి పాస్‌బుక్కులను తయారుచేసి ముద్రించారని తెలిపారు. ఆయా జిల్లాలకు చెందిన కలెక్టర్‌లు, డీఎఫ్‌వోలు, ఐటీడీఏ పీవోల సంతకాలు, అక్షాంశ రేఖాంశాల వివరాలను ఒరిజినల్ పాస్‌పుస్తకాల నుంచి సేకరించి ఫేక్ పుస్తకాలపై ప్రింట్ చేశారని వివరించారు. దర్యాప్తులో భాగంగా ప్రింటింగ్ ప్రెస్‌ను తనిఖీచేయగా కంప్యూటర్‌లో నకిలీ పాస్‌పుస్తకాల వివరాలు లభ్యమయ్యాయని చెప్పారు. ఆ కంప్యూటర్‌ను సీజ్ చేశామని, హోలోగ్రామ్‌లు, నకిలీ సిఫారసు లెటర్లు తయారు చేసిన బానోతు హరికిషన్, ధారావత్ కిషన్, మధ్యవర్తులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు. నకిలీ పట్టాలతో ఆయా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోందని, పోలీసుల సహకారంతో దర్యాప్తును ముమ్మరం చేశామన్నారు. ఇప్పటి వరకు తొమ్మిది నకిలీ పాస్ పుస్తకాలను రికవరీ చేశామని తెలిపారు. కాగా, పాస్‌పుస్తకాల విక్రయాలలో కోటిన్నరకు పైగా చేతులు మారినట్లు తెలుస్తోంది. దందాలో ఏజెంటుగా వ్యవహరించిన ములుగు మండలం ఖాసిందేవిపేటకు చెందిన చికెన్‌షాపు నిర్వాహకుడు వాంకుడోతు రవి ద్వారా సుమారు రూ.10లక్షలు వసూలుచేసి ప్రధాన సూత్రధారి భద్రుకు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. కాగా, ఈ మీడియా సమావేశంలో ములుగు రేంజ్ అధికారి డోలి శంకర్, డిప్యూటీ రేంజ్ అధికారి యాకుబ్‌బాషా, ఎఫ్‌బీవో శ్యాంసుందర్‌రెడ్డి, శివకృష్ణ పాల్గొన్నారు.

రికవరీ ఎలా?

అటవీ భూములలో మూడు తరాలుగా పోడు వ్యవసాయం చేస్తున్న ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని గిరిజనులకు గత ప్రభుత్వం అటవీహక్కుల చట్టం-2006 కింద పట్టాలు జారీ చేసింది. అసలుకు ఏమాత్రం తీసిపోని విధంగా తయారు చేసిన నకిలీ పాస్‌పుస్తకాలు 500లకుపైగా ప్రజల చేతుల్లోకి వెళ్లిపోయాయి. వీటిని గుర్తించడం ఇప్పుడు అటవీశాఖకు సవాల్‌గా మారింది. ఆయా జిల్లాల అధికారులు ఇప్పటికే అప్రమత్తం కాగా ఫేక్ పట్టాలను రికవరీ చేయడంపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఇదేక్రమంలో పంట రుణాల కోసం వెళ్లే అసలు పట్టాదారులను కూడా బ్యాంకర్లు అనుమానించే పరిస్థితి ఎదురైంది. నిజమైన పట్టాదారులు చాలామంది రైతు భరోసా కోసం గతంలోనే దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత నకిలీ ఉదంతం మిగిలిన వారికి తలనొప్పిగా పరిణమించింది.




శోభ చేతికి గాయం

రైల్వే ఉద్యోగికి
కుక్క కాటు

తీవ్ర గాయాలతో రైల్వే ఆస్పత్రిలో చికిత్స

కాజీపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళా రైల్వే ఉద్యోగిపై కుక్క విరుచుకుపడింది. దీంతో ఆమె చేతికి తీవ్ర గాయాలయ్యాయి. కాజీపేటలో గురువారం ఈ ఘటన జరిగింది. కాజీపేట 63వ డివిజన్‌కు చెందిన శోభ అనే రైల్వే ఉద్యోగికి గురువారం విధుల్లో చేరేందుకు విష్ణుపురి మీదుగా స్టేషన్‌కు వెళుతోంది. ఆ క్రమంలో అటుగా వస్తున్న కుక్క ఒక్కసారిగా ఆమె పై విరుచుకుపడి గాయపరిచింది. దీంతో ఆమె చేతికి మూడు చోట్ల తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు అప్రమత్తమై కుక్క ను తరిమారు. తీవ్ర గాయాలపాలైన శోభ ను సమీపంలోని రైల్వే ఆస్పత్రిలో చేర్పిం చారు. వైద్యులు చికిత్సలు చేసి కట్టుకట్టారు. గతంలో కూడా విష్ణుపురి సమీపంలోని ఇదే ఒక్క స్థానికులను కరిచి తీవ్ర గాయాలపాలు చేసిందని స్థానికులు చెబుతున్నారు. మునిసిపల్ సిబ్బంది కుక్కల నుంచి స్థానికులను కాపాడాలని కోరుకుంటున్నారు.

కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

- నష్కల్ బైపాస్ లైన్‌పై పునరాలోచించాలి
- రైళ్ల హాల్టింగ్, ఇజ్జత్ పాస్‌లను పునరుద్ధరించాలి
- కేంద్రమంత్రి, రైల్వే జీఎం సమావేశంలో వరంగల్, మానుకోట ఎంపీలు కావ్య, బలరాం నాయక్

కాజీపేట/మహబూబాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, అం దుకు రైల్వే మంత్రికి ప్రతిపాదనలు పంపాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య రైల్వే జీఎం ఏకే జైన్‌ను కోరారు. సికింద్రాబాద్ రైలు నిలయంలో గురువారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జీఎం ఏకె జైన్‌తో తెలంగాణ, కర్ణాటక ఎంపీలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా నుంచి వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్ పాల్గొని తమతమ పార్లమెంట్ పరిధుల్లో ఉన్న రైల్వే సమస్యలు, చేపట్టాల్సిన పనులపై రైల్వే జీఎం, ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీ కడియం కావ్య, మానుకోట, ఖమ్మం ఎంపీలు బలరాం నాయక్, రఘురామ్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. నష్కల్ నుంచి చింతల్‌పల్లి వరకు కొత్తగా చేపట్టనున్న బై పాస్ రైల్వే ట్రాక్ నిర్మాణంపై పునరాలోచించాలన్నారు. కొత్తలైన్ ప్రతిపాదనలపై స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులను సంప్రదించకుండా నిర్ణయం తీసుకున్నారనీ, దీంతో వ్యతిరేకత వస్తుందని తెలిపారు. కాజీ పేటలో రైల్వే ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉందని, పూర్తి స్థాయి సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. ప్లాట్‌ఫారాల తక్కువ ఉండడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్లాట్‌ఫారాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయని తెలిపారు. అందుకు స్థలం కేటాయించాలని కోరారు. ఆర్వోబీ పను లు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. వ్యాగన్ పరిశ్రమను కోచ్‌ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు వివరించిన బలరాంనాయక్

మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో పలు రైళ్ల హాల్టింగ్, ఇజ్జత్ పాస్‌లను వెంటనే పునరుద్ధరించాలని, రైల్వే సమస్యలను పరిష్కరించాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ కోరారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో తిరువనంతపురం-రప్తిసాగర్, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, గ్రాండ్‌ట్రాంక్ ఎక్స్‌ప్రెస్, ఏపీ ఏసీ ఎక్స్‌ప్రెస్, వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. గతంలో కేసముద్రం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం ఉన్న బీదర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ (అప్), కరీంనగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సాయినగర్ షిర్డీ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు పునరుద్ధరించాలని కోరారు. ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజల అవసరాలకనుగుణంగా నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లకు కేసముద్రం స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తే హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. నెక్కొండ రైల్వేస్టేషన్‌లో ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, శాతవాహన ఎక్స్‌ప్రెస్, చార్మినార్ ఎక్స్‌ప్రెస్, నవజీవన్ ఎక్స్‌ప్రెస్, షిర్డీ ఎక్స్‌ప్రెస్, కరీంనగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని బలరాంనాయక్ కోరారు. తాళ్ల పూసపల్లి వద్ద గేట్ నెంబర్ 79 ఎస్ నెంబర్ 428/10-12 వద్ద అండర్ పాస్ బ్యాలెన్స్ పనులు పూర్తి చేయాలన్నారు. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో పద్మావతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, కోణార్క్ ఎక్స్‌ప్రెస్, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలని కోరారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తాము ప్రతిపాదించిన అంశాలను పరిగణలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం సదరు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు అందజేశారు. ఎంపీ వెంట కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్‌రావు, జూలకంటి సీతారాంరెడ్డి ఉన్నారు.



సికింద్రాబాద్ రైల్వే నిలయంలో దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోరిక బలరాంనాయక్

రేపటి నుంచి
కేయూలో సైన్స్‌డే పోటీలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని ఈనెల 26 నుంచి కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తామని కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 26న జువాలజీ విభాగం సెమినార్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్విజ్ పోటీలను డాక్టర్ ముంజం శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 26న మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కంప్యూటర్ సైన్స్ విభాగంలో వ్యక్తృత్వ పోటీలను డాక్టర్ బి.రమ నేతృత్వంలో, అక్టోబరు 28న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయోటెక్నాలజీ విభాగంలో పెయింటింగ్ పోటీలు డాక్టర్ టి.శాస్త్రి నేతృత్వంలో జరుగుతాయని వెల్లడించారు. 28న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రసాయనశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో వ్యాసరచన పోటీలు డాక్టర్ కె.మమత, డాక్టర్ పి.వెంకటయ్య సారథ్యంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేయూ ఫిజిక్స్ విభాగం సెమినార్ హాల్‌లో క్వాంటిటేటివ్ అప్టిట్యూట్ టెస్ట్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ వెల్లడించారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి బహుమతులను గెలుచుకోవాలని సూచించారు.

వర్సిటీ హాస్టల్ ఉద్యోగుల అంతర్గత బదిలీలు

- దొంగతనం నేపథ్యంలో ఉద్యోగులపై చర్యలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేయూ హాస్టళ్లలో పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులను గురువారం కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ అంతర్గత బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎం.డి. అమ్జద్, ఎస్. బాలాజీ, కె.చిరంజీవి, ఎన్‌ఎంఈ డేనియల్, పి.వేణు, టి.ప్రభాకర్‌లను బదిలీ చేశారు. ఇటీవల వర్సిటీలోని జ్యోతిరావుపూలే హాస్టల్‌లో దొంగతనం జరిగి పీజీ విద్యార్థికి చెందిన విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. దీంతో బాధిత విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ విద్యార్థి హాస్టల్ ఉద్యోగులపై అనుమానం వ్యక్తం చేస్తూ హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు ఫిర్యాదుచేసిన నేపథ్యంలో వర్సిటీలోని హాస్టల్స్ ఉద్యోగులపై బదిలీ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. వస్తువులను దొంగిలించిన ఘటనలో పోలీసులు దర్యాప్తు చేపట్టి వివరాలను సేకరిస్తున్నారు.

అందని ‘చే’యూత!

5వ పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకుంటే మరుసటి నెలలోనే పింఛన్‌ను బదిలీ చేస్తున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఇప్పటికే సుమారు 25వేల కొత్త పెన్షన్ కోసం దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదు..
కౌసల్యాదేవి, నాగపద్మజ, వరంగల్, హనుమకొండ జిల్లాల గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారిణిలు

కొత్త పింఛన్ల మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు ఇప్పటి వరకు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల ప్రకారమే పింఛన్ల మంజూరు చేస్తాం. చేయూత పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించి ప్రభుత్వం నివేదికను ఎప్పటికప్పుడు అందజేస్తున్నాం.

కేంద్ర ప్రభుత్వ పథకాలను
పరిశీలించిన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యంరెడ్డి

చెన్నారావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామాల్లో అమలు తీరుపై గురువారం మండలంలోని లింగాపురం, ఎల్లాయిగూడెం, కేంద్ర గ్రామీణాభివృద్ధి లైవ్లీవుడ్ మానిటరింగ్ టీం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ అమలుచేస్తున్న పథకాలను, మహిళ సంఘాలు జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో పొందుతున్న లబ్ధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర బృందం టీమ్ సభ్యుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, జయప్రకాష్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో పనులను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు సైతం వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, సుధాకర్, ఏపీఎం ఈశ్వరయ్య, ఏపీఎం అరుణ, కమ్యూనిటీ కోఆర్డినేటర్‌లు శ్రీలత, సుజాత,ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో విద్యార్థి ఉత్తమ ప్రతిభ

- అభినందించిన ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హెచ్ఐవీ, ఎయిడ్స్ క్విజ్ కాంపిటిషన్‌లో కాజీపేట జాగీర్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎమ్డీ కరీముల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేంద ర్‌రెడ్డి కరీముల్లాను అభినందించారు. అందుకు సహకరించిన పాఠశాల పురప్రముఖులు రాజ్‌మోహన్, ప్రధానోపాధ్యా యుడు ఎస్‌ఎంఎం స్వామి అభినందించారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ అబూ బక్కర్ తదితరులు ఉన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

మాదిగలకు అన్యాయం చేస్తే మరో పోరాటం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

కేయూ క్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ పోరాటం చేసి సాధించిన ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగలకు అందించకుంటే మరో పోరాటం తప్పదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో మాదిగ విద్యార్థుల రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరై కీలక ప్రసంగం చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపడితే మాదిగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో జాప్యంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై పోరాటం తప్పదని అన్నారు. మాదిగ విద్యార్థులంతా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



సదస్సులో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కాగా, సభలో స్వాగత ఉపన్యాసం ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి చేయగా, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సభాధ్యక్షుడిగా సందె కార్తీక్ వ్యవరించారు. సభలో ఎమ్మార్పీఎస్ నేతలు సంకినేని వెంకట్ మాదిగ, కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సుదీర్ఘ పోరాట చరిత్ర ఉందన్నారు. మాదిగల అస్తిత్వం, పోరాటం గొప్పదన్నారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను జాతికి అందేట్లు చేసిన మంద కృష్ణ సేవలు అమూల్యమన్నారు. జాతి ఎదుగుదలకు రిజర్వేషన్లు తోడ్పాటును అందిస్తాయని చెప్పారు. ఈసభలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు బొడ్డు దయాకర్, డాక్టర్ వడ్డెపల్లి మధు, మంద భాస్కర్, బొక్క మొగిలి, నాగేశ్వరావు, రవీందర్, రాగల్ల ఉపేందర్, మంధని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠ	క్వింటా కనిష్ఠ
మక్కలు (బిల్టీ రకం)	2530	2080
పల్లికాయ (సూక)	5800	5000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	7350	7000
పెసళ్లు	6200	4052
పత్తి	7000	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	12000	11000
పసుపు (గోల)	11600	11000
తేజ మిర్చి	12500	9000
తేజ ఏసీ	18000	12000
వండర్‌హాట్ ఏసీ	15500	11000
యూఎస్341ఏసీ	15000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం

రక్తదానం మరొకరికి ప్రాణదానం

● ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ● మామునూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

శంభునిపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రక్తదానం ఆపద సమయంలో మరొకరికి ప్రాణదానంతో సమానమని ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం మామునూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లికుంట వాగ్దేవి కళాశాలలోని ఫార్మసీ బ్లాకులో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని డీసీపీ రవీందర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు విధిగా రక్తదానం చేయటం వలన ప్రమాదాల్లో గాయాలపాలైన వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఏసీపీ తిరుపతి మాట్లాడుతూ.. రక్తదానం చేయటం అనేది సామాజిక బాధ్యత అని అన్నారు. వరంగల్ ఎంజీఎంనకు చెందిన వైద్యులు ఆశాదేవి నేతృత్వంలోని వైద్యబృందం సుమారు 263 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కాగా, మామునూరు ఏసీపీ తిరుపతి రక్తదానం చేశారు. ఎంజీఎం వైద్యులు ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్, మామునూరు, పర్వతగిరి, గీసుకొండ, ఏ న ం వ నా వ ు ల సీఐలు ఓ. రమేష్, రాజగోపాల్, మహేందర్, రాఘవేందర్, ఎస్ఐలు శ్రీకాంత్, కృష్ణవేణి, రాజు, శ్రీకాంత్, శ్రీనివాస్, నరేష్, ప్రవీణ్, కుమార్, చక్రధర్, పోలీసు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న మామునూరు ఏసీపీ


విద్యార్థులకు ఆయుధాల గురించి వివరిస్తున్న కమాండెంట్ రాంప్రకాశ్

ఫోర్త్ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్

శంభునిపేట : అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మాము నూరు లోని టీజీఎస్పీ బెటాలియన్‌లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 200 మంది విద్యార్థులకు ఆయుధాలు వాటి పనితీరును వివరించారు. అనంతరం బెటాలి యన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నుంచి ఏఆర్ఎస్ఐ ర్యాంకు వరకు సిబ్బంది పనితీరును వివరించారు. 'సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగు పరచటంలో నా పాత్ర' అనే అంశంపై, ఆర్ఎస్ఐ, ఆర్ఐ ర్యాంకర్లకు 'సౌండ్ మైండ్ ఇన్ ఏ సౌండ్ బాడీ' అనే అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్, శ్రీనివాస్‌రావు, ఆర్ఐలు రవి, సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్,అశోక్, కృష్ణ పాల్గొన్నారు.

పీటీసీలో ఓపెన్ హౌస్

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మామునూరులోని పోలీసు శిక్షణ కళాశాలలో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయుధాలను ప్రదర్శించారు. మామునూరు క్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కృష్ణవేణి, ట్రినిటీ బీ హ్యాపీ పాఠశాలల విద్యార్థులు ఈ ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో పాల్గొని ఆయుధాలను ఆసక్తిగా తిలకించారు. పోలీసు సిబ్బంది, ఏడీఐలు విద్యార్థులకు ఆయుధాల పనితీరు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీటీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను
ప్రజలకు చేరవేయాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

పోచమ్మమైదాన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరవే యాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. పైడిపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో అమలవుతున్న కార్యక్రమాలను వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నేపథ్యంలో వైద్య శిబిరాలు నిర్వహించి, వ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నమోదైన డెంగీ బాధితుల ఇంటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేయాలని, మునిసిపల్ సిబ్బంది సహకారంతో ఫాగింగ్ చేయాలని అన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

దాస్యం విజయ్ భాస్కర్ జన్మదిన వేడుకలు

కాజీపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ నేత దాస్యం విజయ్ భాస్కర్ జన్మదిన వేడుకలు గురువారం కాజీపేట చౌరస్తాలో ఘనగా జరిగాయి. 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు హాజరై కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నార్లగిరి రమేశ్, సుంచు కృష్ణ, పాలడుగుల శివ, కాటాపూర్ రాజు, దువ్వ కనుకరాజు, ఎస్‌కె మహమూద్, కోండ్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● వడ్డేపల్లి(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ జిల్లా నేతలు ఆకుల మధు, ఎమ్డీ ఖదీర్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లోని ఒయాసిస్ అనాథాశ్రమంలోని పిల్లలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత విజయ్‌భాస్కర్ బర్త్‌డే కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. బీఎస్‌ఆర్‌కేఎస్ వరంగల్ టౌన్ అధ్యక్షుడు సిరికొండ భిక్షపతి, బీఆర్ఎస్ జిల్లా నేతలు జన్ను విజయలక్ష్మి, తాళ్లపెల్లి జయపాల్, రాసమల్ల నవీన్, సాదు వేణు, కత్తి రవి పాల్గొన్నారు.

ఎస్ఏ-1 పరీక్షలను పరిశీలించిన ఆర్జేడీ


ప్రాక్టీసింగ్ స్కూల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న ఆర్జేడీ

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో నిర్వహి స్తున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలను పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. గురువారం ఉదయం పాఠశాలను ఆకస్మికం గా సందర్శించిన సత్యనారా యణరెడ్డి విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. పాఠశాల నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో ముచ్చటి ంచి పాఠశాల నిర్వహణ తీరును ఆరా తీశారు. ఆయన వెంటన డీఈవో వాసంతి, ఏఎంవో శ్రీనివాస్, ఎంఈవో కె.రమేష్‌బాబు, హెడ్మాస్టర్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాల్మీకి మహర్షి నవరాత్రోత్సవాలు


పూజలు చేస్తున్న జంగా రాఘవరెడ్డి

మడికొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని వాల్మీకి ఆలయ ప్రాంగణంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉత్సవాలలో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీనుగు పద్మ-రాంచందర్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు బోగి లింగమూర్తి, కార్యదర్శి పేర్ల సురేష్, డివిజన్ అధ్యక్షులు కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చెందిన జీపీల ఎంపికను త్వరితగతిన చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, అధికారులు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యో తి): కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో అభివృద్ధి చెందిన రెండు గ్రామ పంచాయితీల ఎంపికను కేంద్ర ప్రభుత్వ నిర్దేశానుసారం త్వరితగతిన ఎంపిక చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద సంబంధిత అధికా రులను ఆదేశించారు. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి వి.శ్రీనివాస్ కలెక్టర్లతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఆమె అధికారులతో కలిసి పాల్గొన్నారు. 2025లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించనున్న ఉత్తమ సర్పంచ్‌ల ఆహ్వానం కోసం ప్రతిపాదనలు పంపించాలని ఆయన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతో అభివృద్ధి సాధించిన రెండు గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి నవంబరు 30లోగా నివేదికలు పంపించాలని ఆయన సూచించారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సత్యశారద జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సూచనలకు అనుగు ణంగా నిర్ణీత గడువులోగా ప్రతిపాద నలు పంపించాలని జిల్లా పంచాయతీ అధికారి కల్ప నను ఆదేశించారు. అదనపు కలెక్టర్ జి. సం ధ్యారాణి, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

వడ్డెపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ఐదేళ్లలో నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని స్నేహనగర్, ఇందిరానగర్, కేయూ ఎంప్లాయిస్ కాలనీలలో రూ.66లక్షలతో నిర్మించే అంతర్గత రోడ్లు, సైడ్ డ్రెయిన్, కల్వర్టు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, 59వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవి కిరణ్, ఇన్‌చార్జి కేతిడి దీపక్‌రెడ్డి, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తేళ్ల సుగుణకిశోర్, కేయూ ఎంప్లాయిస్ కాలనీ అధ్యక్షుడు ప్రొఫెసర్ సాయిలు పాల్గొన్నారు. అలాగే గ్రేటర్ వరంగల్ 49వ డివిజన్ సాయి కాలనీలో రూ. 6 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్‌తో కలిసి గురువారం భూమి పూజ చేశారు.

మోదీ పాలనలోనే మహిళలకు సముచిత గౌరవం

బీజేపీ రాష్ట్ర నాయకుడు నందీశ్వర్ గౌడ్


హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో బీజేపీ సభ్యత్వ క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

గిర్మాజిపేట, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక స్వావలంబనతో పాటు సముచితగౌరవం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలోనే లభిస్తోందనే విశ్వాసంతోనే మహిళలు బీజేపీ సభ్యత్వం స్వీకరిస్తున్నారని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందీశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం వరంగల్ నగరంలోని హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కాసు శిల్ప, బీజేపీ మోర్చాల సభ్యత్వ నమోదు రాష్ట్ర నాయకుడు డాక్టర్ వన్నాల వెంకట రమణ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కుసుమ సతీష్, జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్, సరిత, కల్పన, సుమతి, సుజాత, దేవిక, అపర్ణ, శర్య, జిల్లా ఉపాధ్యక్షుడు కె.రంజిత్ పాల్గొన్నారు.

బీజేపీతో మమేకం కావాలి

మిల్స్‌కాలనీ(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ప్రజలంతా భారతీయ జనతా పార్టీతో మమేకం కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ కోరారు. మహిళా మోర్చా అధ్యక్షురాలు కాసు శిల్ప ఆధ్వర్యంలో గురువారం వరంగల్ చౌరస్తా, పోస్టాఫీస్, స్టేషన్‌రోడ్ తదితర ప్రాంతాల్లోని వ్యాపారస్తులకు సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంట మాట్లాడుతూ.. తెలంగాణాలో బీజేపీని బలోపేతం చేసే సంకల్పంతో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందీశ్వర్‌యాదవ్, వన్నాల వెంకటరమణ, కుసుమ సతీష్, శ్రీనివాస్ ముదిరాజ్, భరత్‌వీర్, నాగరాజు, రాజు, అరుణ్, నాగరాజు, వెంకటేశ్వర్లు, సంగీత్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులతో పాటు ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని డీఈవో దౌలాగర్ వాసంతి సూచించారు. గురువారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ... ఉపాధ్యాయులంతా విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులకు అకడమిక్ విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాస్, ఎంఈవో కె.రమేష్‌బాబు, డీఎస్‌వో శ్రీనివాస్‌స్వామి, హెడ్మాస్టర్ జగన్నాథం, రిసోర్సు పర్సన్లు సంపతి, సునిత, కృష్ణవేణి, రమేష్, శశికళాధర్, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన పాలకుర్తి ఎస్ఐ

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి పోలీసుస్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన డి.పవన్‌కుమార్ గురువారం వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝాను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందచేశారు.


సీపీకి మొక్కను ఇస్తున్న ఎస్ఐ పవన్ కుమార్

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నగరంలోని రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి గురువారం తెలిపారు. కేయూసి సబ్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌పురలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని వినాయకనగర్ , భవానినగర్ గోకుల్‌నగర్, అశోక్‌కాలనీ, రాంనగర్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, బాలసముద్రం, నక్కలగుట్ట ఏరియాలో ఉదయం 9.30గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ సాంబరెడ్డి తెలిపారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి

వడ్డెపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండకు చెందిన బాలికపై అత్యాచార యత్నం చేసిన సీఐ రవికుమార్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ పోలీసు అధికారుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి వీరారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధారపు సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారి బాలికపై అత్యాచారయత్నానికి ఒడిగట్టి పోలీసు వ్యవస్థకే మచ్చ తీసుకొచ్చారని వారు పేర్కొన్నారు. సీఐ రవికుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసి చట్టబద్ధంగా విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని వారు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సీపీ అంబర్ కిశోర్ ఝాకు విజ్ఞప్తి చేశారు.

నలుగురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరైన ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్ కొరడా ఝులిపించారు. గురువారం వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈవో జ్ఞానేశ్వర్ పలు విషయాలను గమనించారు. ఎస్ఏ-1 పరీక్షలు జరుగుతున్న వేళ ముందస్తు అనుమతులు పొందకుండా పలువురు ఉపాధ్యాయులు పాఠశాలకు గైర్హాజరైన విషయాన్ని ఆయన గమనించారు. ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఎఫ్ఏసీ హెడ్మాస్టర్ పి.రమణారావు (మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్), కె.ధనలక్ష్మి(బయో సైన్స్ స్కూల్ అసిస్టెంట్), కె.రోహిణిదేవి (తెలుగు స్కూల్ అసిస్టెంట్), ఎల్.వంశీమోహన్ (ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్)లను సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

పలువురు వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పలువురు వాహనదారులకు న్యాయమూర్తి విద్యాసాగర్ జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. వాహనాల తనిఖీల్లో మద్యం తాగి 22 మంది, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా 9 మంది పట్టుబడగా, గురువారం కోర్టులో హాజరు పరచమన్నారు. 22మందిలో 21మందికి రూ.29,800 జరిమానా విధించగా, ఆరెపలికి చెందిన ఆటోడ్రైవర్ సర్ధార్‌కు 2రోజుల కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్షను విధిస్తూ తీర్పును ఇచ్చారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 9 మందికి రూ.7,500 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి : డీడబ్ల్యూవో

ఆటోనగర్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని డీడబ్ల్యూవో బి.రాజమణి అన్నారు. గురువారం వరంగల్ డీడబ్ల్యూవో కార్యాలయాన్ని రాజమణి సందర్శించారు. ఈ సందర్భంగా నవతెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.అజీమ్, సంఘ వ్యవస్థాపకుడు అంబటి రాజేందర్, జిల్లా అధ్యక్షుడు బండి చక్రపాణిలు రాజమణిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా రాజమణి మాట్లాడుతూ జిల్లాలోని వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. నవతెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు సతీష్, రాజు, సునీత, సాయి పాల్గొన్నారు.

వైభవంగా లలిత సహస్ర పారాయణం

వరంగల్ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రామన్నపేట మణిద్వీప్ గార్డెన్‌లో లోకకల్యాణార్థం వంశీకృష్ణ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న సహస్ర చండీయాగంలో భాగంగా గురువారం లలిత సహస్ర పారాయణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా రుత్వికులు జరిపించారు. సుమారు 500 మందితో పడిశాల సుజాత ఆధ్వర్యంలో లలిత సహస్ర పారాయణం నాలుగో రోజు నేత్ర పర్వంగా నిర్వహించారు. 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల సునిల్‌కుమార్, అనిల్‌కుమార్, 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనితరంజిత్‌కుమార్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలి

శంభునిపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : చిరువ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలని బల్దియా సూపర్‌వైజర్ భాస్కర్ తెలిపారు. ట్రేడ్ లైసెన్స్‌ల ఆవశ్యకత, పునరుద్ధరణపై గురువారం శంభునిపేట జంక్షన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా 41, 42, 43 డివిజన్‌ల పరిధిలోని మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్స్, వాన్‌లు, సిబ్బందితో పాటు పలువురు వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించినా, గడువు ముగిసిన లైసెన్స్‌లను రెన్యూవల్ చేపించకుండా వ్యాపారాలు నిర్వహించినా జరిమానాలు విధించడం జరుగుతుందని భాస్కర్ అన్నారు. సకాలంలో రెన్యూవల్ చేస్తూ బల్దియా సిబ్బందికి సహకరించాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మడికొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం అమ్మవారిపేటలో అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గురువారం టాస్క్‌ఫోర్స్ బృందం, పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బియ్యం నిలువ చేస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం మడికొండ పోలీసులతో కలిసి అమ్మవారిపేటలోని శ్రీమహాలక్ష్మి పౌల్ట్రీ ఫారంలో తనిఖీ చేయగా 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించినట్టు తెలిపారు. విచారించగా కోళ్లఫారం యజ మాని పరిసర గ్రామాల నుంచి కొనుగోలు చేసి నిలువ ఉంచినట్లు తెలిసిం దన్నా రు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని మడికొండ పోలీసులకు అప్పగిం చారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.45వేలు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపా రు. టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ బాబులాల్, మడికొండ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు, టాస్క్‌ఫోర్స్ బృందం పాల్గొన్నారు.

సొసైటీ కాలనీ నూతన కమిటీ

కాశిబుగ్గ, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గ కోఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా వెంకటస్వామి, కోశాధికారి నాగిరెడ్డి, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

పోలియో రహిత సమాజానికి కృషి చేయాలి

కరీమాబాద్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ప్రెసిడెంట్ కురవెల్ల రాజగోపాల్‌రావు అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా గురువారం రోటర్లీ క్లబ్ ఆధ్వర్యంలో ఒక కిలోమీటర్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఫోర్ట్‌రోడ్ రోటరీక్లబ్ నుంచి నిర్వహించిన ఈ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న రాజగోపాల్ రావు మాట్లాడారు. పోలియో నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పెయింటింగ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ గంట వేణుగోపాల్, కృష్ణమోహన్, క్రాంతి కుమార్, వైద్యనాథ్, నాగరాజు, రమేష్‌బాబు, సుధాకర్, మదన్, హరి రమాదేవి, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, శివప్రసాద్, సురేష్, రవీందర్ పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు

మడికొండ, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : మడికొండలోని మెట్టుగుట్టపై గల సీతారామచంద్రస్వామివారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పరాశరం విష్ణువర్ధనాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం శ్రీరామ మూలమంత్ర హోమం చేశారు. మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వయంభూ శివలింగానికి పంచామృతాలతో అభిషేకం జరిపారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు బైరి రాజు కుటుంబ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

కేయూ వీసీకి అభినందనల వెల్లువ

కేయూ క్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని గురువారం కేయూ పరిపాలన భవనంలో ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, బొక్క మొగిలి, జూల సత్య, ఎమ్మార్పీఎస్ బాధ్యులు డాక్టర్ వడ్డెపల్లి మధు, బొచ్చు తిరుపతి, మంద భాస్కర్, నాగేశ్వర్‌రావు, రవీందర్ తదిత రులు పాల్గొన్నారు. వీసీ ప్రతాప్‌రెడ్డిని కేయూ దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం ఉద్యోగులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే వీసీ ప్రతాప్‌రెడ్డిని కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్ నేతృత్వంలో పలువురు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం హనుమకొండ అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం. భాస్కర్, సభ్యులు రవీంద్రనాథ్, బుట్టి శ్యాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ నేతృత్వంలో వీసీ ప్రతాప్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో బెట్టి రాజేందర్, మాచర్ల శరత్‌చంద్ర తదతరులు పాల్గొన్నారు. రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు డాక్టర్ నాగేశ్వర్‌రావు, గిడియన్, నరసింహమూర్తి, సారయ్య, అమీన్, అక్తర్ తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు. కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగళి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి నేతృత్వంలో అధ్యాపకులు కేయూ వీసీ ప్రొఫె సర్ కె.ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ సురేశ్‌బాబు, డాక్టర్ ఎం.అరుణ, మధు, ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, రాజు, రాంరెడ్డి, సారంగపాణి, డాక్టర్ లకన్‌సింగ్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.


వీసీ ప్రతాప్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న సుందర్‌రాజ్‌యాదవ్


అభినందనలు తెలుపుతున్న భాస్కర్

సామాజిక అంశాలే ఇతివృత్తాలుగా..


లఘుచిత్రంలో ఓ సన్నివేశం

- 'సీసీసీ' పేరుతో యూట్యూబ్ చానల్ ఏర్పాటు
- విభిన్న కథలతో ప్రజల్లోకి కొత్త, పాత తరం నటులు

లఘుచిత్రాలతో ఆలోచింపజేస్తున్న జనగామ కళాకారులు

కళ

జనగామ కల్చరల్, అక్టోబరు 24: సామాజిక అంశాలనే ఇతివృత్తాలుగా చేసుకొని తమ లఘుచిత్రాలతో ప్రజలను ఆలోచింపజేస్తున్నారు జనగామ కళాకారులు కవులు, కళాకారులకు నెలవైన.. పోరాటాలకు పురిటిగడ్డ, చైతన్యానికి మారుపేరు అయిన జనగామ ప్రాంతానికి చెందిన సామాజిక వేత్త, ప్రముఖ వైద్యుడు, రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి ఆలోచనలకు ప్రజా కళాకారుడు, సామాజిక విమర్శకుడు, కవి జి.కృష్ణ పురుడు పోశారు. కల్చరల్ క్రియేటివ్ చానల్ (సీసీసీ) యూట్యూబ్ చానల్‌ను 2023 సెప్టెంబరులో ప్రారంభించారు. ఈ చానల్ ద్వారా ప్రముఖ కవి, కళాకారుడు అయిలా సోమనర్సింహాచారి, లగిశెట్టి ప్రభాకర్, చిలుమోజు సాయికిరణ్, పెట్లోజు సోమేశ్వరాచారి సహాయ సహకారాలతో అనేక కార్యక్రమాలు రూపొందించి ఆ చానల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. 'రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి', 'కలి అన్నం చేపల పులుసు' లఘుచిత్రంతో ప్రస్థానం మొదలైంది. దివంగత కవి జి.వై.గిరి రచించిన 'ఓ వయసు పోరగా' పాట, చిలుమోజు సాయికిరణ్ రాసిన 'మారాలి బహుజన పాట', జనగామ కవులు కళాకారులతో 'జనగామ కలం గళం' లాంటి పలు కార్యక్రమాలు ప్రేక్షకుల మనసులకు చేరువయ్యాయి. ఇటీవలి కాలంలో అందచందాలు, సౌందర్యం కన్నా గుణం ముఖ్యమంటూ తెలిపే సరదా సన్నివేశాలతో నటుడు కల్ల శ్రీనివాస్ రూపొందించిన 'ముదురు మొగుడు - ముద్దుల పెళ్లాం' లఘుచిత్రం ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. అలాగే వృద్ధాప్యం ఒక శాపం కాదు, అది పెద్దలకు సేవ చేసుకునే భాగ్యంగా పిల్లలు భావించాలని, వృద్ధులైన తల్లిదండ్రులను ప్రేమతో ఆదరించాలనే గొప్ప సందేశాన్ని అందించే లగిశెట్టి ప్రభాకర్ రాసిన కథకు స్వీయ దర్శకత్వం వహించి 'తనదాక వస్తే' లఘుచిత్రం తక్కువ సమయంలో ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువైంది. అలాగే ఓటు ప్రాధాన్యత తెలిపి ఓటర్లను చైతన్యపరిచే ఇతివృత్తంతో కవి, కళాకారులు అయిలా సోమనర్సింహాచారి కథనం, దర్శకత్వంలో 'ఎవరు మారాలి' అనే లఘుచిత్రాన్ని జనగామ పరిసర ప్రాంతాలలో నిర్మించారు. పవర్ ఫుల్ మీడియా వెండి తెర, ప్రసార మాధ్యమాలు బుల్లితెర సరసన చేరిన యూట్యూబ్ చానల్‌లో సామాజిక అంశాలను కథావస్తువుగా చేసుకొని ఆలోచింపజేస్తున్న ఈ లఘుచిత్రాల వల్ల కొత్త, పాత తరం నటులు వెలుగులోకి వస్తున్నారు. కార్యక్రమాల నిర్వహణలో నటీనట, సాంకేతికవర్గం చిలుమోజు సాయికిరణ్, నేనావత్ దశరథ నాయక్, పన్నీరు విజయం, శ్రీకాంత్ నాయక్, యూట్యూబ్ ఫేం కల్ల శ్రీనివాస్, ప్రియాశర్మ, లత, కొట్టె శ్రీలత, దక్షిణామూర్తి, గొలుసుల ఎల్లయ్య సహకరిస్తున్నారు.

ఒక వేదిక ఏర్పాటు చేయాలనేదే సంకల్పం

డాక్టర్ మాచర్ల భిక్షపతి, రిటైర్డ్ కల్నల్



బమ్మెర పోతన, పాలకుర్తి, సోమనాథుడు, వాల్మీకి నడయాడిన నేల జనగామ. చుక్క సత్తయ్య, గడ్డం సమ్మయ్య, జీవై గిరి లాంటి ఎందరో కవి పుంగవులు జన్మించిన పోరాటాల పురిటిగడ్డ జనగామ. కళలు, సాహిత్య రంగాల్లో నిత్యం భాసిల్లుతున్న జనగామ కేంద్రంగా యూట్యూబ్ ఛానల్‌కు ఒక వేదిక ఏర్పాటు చేయాలనే బలమైన కోరిక ఉండేది. ఈ ఛానల్ ద్వారా ఆ ఆశ నెరవేరింది.

ప్రతిభ కలిగిన కళాకారులకు గుర్తింపు

అయిలా సోమనర్సింహాచారి, కళాకారుడు



ప్రస్తుతం సోషల్ మీడియా ప్రపంచంలో యూట్యూబ్ ద్వారా ఎందరో ఔత్సాహిక కళాకారులు తమ ప్రతిభ కనబరుస్తూ గుర్తింపు పొందుతున్నారు. తద్వారా టీవీ, సినిమా రంగాల్లో అవకాశాలు కూడా వస్తున్నాయి. ఔత్సాహికులకు ఇది ఒక మంచి వేదికగా నిలుస్తోంది. విభిన్నమైన ఇతివృత్తాలతో తీస్తున్న లఘుచిత్రాలను ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులకు మా ధన్యవాదాలు.

కవులు, కళాకారులకు అవకాశాలు కల్పిస్తాం

జి.కృష్ణ, సామాజిక కళాకారుడు



జానపద కళలు, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయం, సామాజిక స్పృహ, ఆరోగ్యంపై ప్రజలను చైతన్య పరచడానికి కల్చరల్ క్రియేటివ్ ఛానెల్‌ను ప్రారంభించాం. ఆసక్తి కలిగిన కవులకు, కళాకారులకు అవకాశాలు కల్పిస్తాం. నిగూఢంగా దాగివున్న కళా నైపుణ్యాన్ని వెలికి తీయటానికి కృషి కొనసాగిస్తాం. సమాజాన్ని జాగృతం చేస్తాం.

ఓ వైపు టీచర్.. మరో వైపు స్టూడెంట్..

- ద్విపాత్రాభినయం చేస్తున్న సుమయ్య ఫిర్దోస్


ఫిర్దోస్‌ను సత్కరిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ప్రతిభ

శంభునిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిగా ఉండగానే ఉపాధ్యాయురాలిగా మారింది. ఒకే ఆవరణలో ఒక వైపు స్టూడెంట్‌గా, మరోవైపు టీచర్‌గా ద్విపాత్రాభినయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ మేరకు ఉపాధ్యాయురాలిని కళాశాల అధ్యాపకులు సత్కరించారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండి.మసూద్ అలీ - రెహనా బేగంల కూతురు సుమయ్య ఫిర్దోస్ స్థానిక రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఎంపీసీఎస్ చివరి సంవత్సరం చదువుతోంది. అయితే ఆమె ఇంటర్ చేసిన తర్వాత డైట్ అభ్యసించింది. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగం సాధించింది. శంభునిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే కొలువు సాధించింది. అయితే తాను చదివే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉద్యోగం సాధించిన ప్రభుత్వ పాఠశాల ఒకే ప్రాంగణంలో ఉండటం గమనార్హం.

సత్కారం

ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంతో రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సుమయ్య ఫిర్దోస్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్‌తో పాటు అధ్యాపకులు ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చని ప్రిన్సిపాల్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, స్టాఫ్ సెక్రెటరీ డాక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు డాక్టర్ పీఎల్ఎన్ మూర్తి, శ్రీధర్, భగీరథ్, రమేష్, చారి, సుస్మిత, శైలజ, డాక్టర్ రాజన్న, గీత, షరీఫ్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు

- ఈనెల 25న కేఎంసీలో ప్రారంభం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి

వరంగల్ మెడికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్' పేరుతో ఈనెల 25, 26 తేదీల్లో వైద్య విద్యార్థుల కోసం పలు రకాల పోటీలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కాకతీయ మెడికల్ కాలేజీ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఈనెల 25, 26 తేదీల్లో మెడికల్ ఎగ్జిబిషన్, ఈనెల 25న రూ.6లక్షల ప్రైజ్ మనీతో మెడ్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్‌ఐ అల్యూమిని, కాకతీయ మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో 9రకాల పోటీలు ఉంటాయన్నారు. అదే విధంగా వైద్య విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, సింపోజియంలను కూడా నిర్వహిస్తామన్నారు. ఈనెల 25న ఉదయం కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ కరుణాకరరెడ్డి ఈ పోటీలను ప్రారంభిస్తారని చెప్పారు.

ఈ పోటీల కన్వీనర్ డాక్టర్ సుజిత్ ఆర్ పున్నం మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే కేఎంసీని అగ్రగామిగా నిలిపేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. వైద్య విద్యను పటిష్టం చేసే ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన వెయ్యికిపైగా వైద్య విద్యార్థులు, వైద్యులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, ఐఎంఏ తెలంగాణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కాశీప్రసాద్, ఏపీఐ అధ్యక్షుడు సతీష్ పాల్గొంటారని వివరించారు.

వారి గానామృతానికి 60ఏళ్లు

- భక్తి భజనలతో అలరిస్తున్న శివరామకృష్ణ భజనమండలి
- నేటి తరంలోనూ భక్తిభావం పెంచేలా ప్రదర్శనలు


తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన చేస్తున్న భజనమండలి సభ్యులు (ఫైల్)

ఆధ్యాత్మికం

బచ్చన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తమ భజనలు, భక్తి గానంతో ఆహుతులను భక్తిపారవశ్యంలో మునిగిపోయేలా చేయడం శివరామకృష్ణ భజనమండలి ప్రత్యేకం. అలాంటి వారి గానామృతానికి 60ఏళ్లు నిండాయి. దేవాలయాల్లో భజనల ఉనికి కరువైపోతున్న ప్రస్తుత రోజుల్లో జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూరు గ్రామానికి చెందిన శివరామకృష్ణ భజన మండలి సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలిస్తూ హిందుత్వం, దైవచింతన, ఆధ్యాత్మికతకు ప్రాణం పోస్తున్నారు. 1964లో బెజుగాం నారాయణ నేతృత్వంలో ఈ భజన మండలిని స్థాపించగా.. తొలిరోజుల్లో సుమారు 350 మంది సభ్యులుగా ఉండేవారు. రానురాను సంఖ్య తగ్గినా.. ఉనికికి ఉపద్రవం రాకుండా చింతల బాలయ్య, ముర్రోజు బుచ్చయాచారి నేతృత్వంలో కొత్త బృందాలు రూపుదిద్దుకున్నాయి. ఏటా తిరుమల తిరుపతి దేవస్థానం ఆహ్వానం మేరకు అఖండ హరినామ సంకీర్తనలో పాలుపంచుకుంటూ రోజంతా తమ గానామృతంతో భక్తులను మైమరపింపజేస్తారు. జగిత్యాల, విజయవాడ, సిద్దిపేట, జనగామ, యాదగిరిగుట్ట, వేములవాడ, బాసర తదితర పుణ్యక్షేత్రాలలో తమ భజనలతో ఓలలాడించారు. అనేక పోటీల్లో పాల్గొని పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు పొందారు. శివరామకృష్ణ భజనమండలిని జగిత్యాలకు చెందిన వేల్పుల పెద్ది రాజయ్య స్థాపించగా, దాని శాఖలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాయి. బచ్చన్నపేట మండల కేంద్రంతో పాటు పోచన్నపేట, నారాయణపూర్, కొడవటూరు, కొన్నె, నాగిరెడ్డిపల్లి, గంగాపూర్ గ్రామాల్లో భజన భక్తమండళ్లు ఉండేవి. ప్రస్తుతం కట్కూరులో సుమారు 40 మందితో కొనసాగుతోంది. యువత, బాలురు, బాలికలను ఇందులో భాగస్వామ్యుల్ని చేస్తూ భక్తి మార్గం వైపు నడిపిస్తున్నారు. ఈ నెల 20న వేములవాడలో శివరామకృష్ణ భజనమండలి 60వ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో రాష్ట్రంలోని 250 భజన బృందాలు పాల్గొనగా, కట్కూరు బృందానికి ప్రత్యేక ప్రశంసలు దక్కాయి.

పూర్వజన్మ సుకృతంగా భావిస్తాం..

- చింతల బాలయ్య, గాయకుడు



ఆలయాల్లో భజనలు చేసి భగవంతుడిని మెప్పించి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనుకుంటాం. అందుకే రాత్రి వేళల్లో మా శివాలయంలో భజన కార్యక్రమాలు కొనసాగిస్తుంటాం. కొత్త వారిని ప్రోత్సహిస్తున్నాం. భక్తిభావం కలిగి ఉంటే యువత సన్మార్గంలో వెళతారని నమ్ముతాం. దైవాన్ని స్మరించుకునేందుకు ప్రతీ ఒక్కరు కొంత సమయం కేటాయించాలి. ఎన్ని పనులున్నా, మమ్మల్ని ఆహ్వానిస్తే అక్కడ భక్తిభావం పెంపొందించాలనే ఆలోచనతో వెళుతుంటాం. ఆరు తరాలుగా కాపాడుకుంటూ వస్తున్నాం. మా తరువాతి తరం దీన్ని కొనసాగిస్తుందని ఆశిస్తున్నాం.


కట్కూరు శివరామకృష్ణ భజనమండలి సభ్యులు


మంచుపొరల్లో కేటీపీపీ వ్యూ

మంచు కురిసే వేళలో..

శీతాకాలం ఆరంభమైంది. తెల్లవారుజాము సమయంలో దట్టమైన మంచు కురుస్తోంది. దాంతో జనం, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదిలో ఇలా గురువారం ఉదయం భూపాలపల్లి పట్టణంలోని రహదారులను మంచుకమ్మేసింది. అయితే కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ) చిమ్నీల ద్వారా వస్తున్న దట్టమైన పొగకు మంచు తెరలు తోడై ఆ పరిసరాలన్నీ ఎదుటి వారు దగ్గరకు వచ్చే వరకు కనిపించనంతగా కమ్మేశాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా


భూపాలపల్లి పట్టణంలో కమ్ముకున్న మంచు

పత్తి రైతుకు సాంకేతిక సాయం

- యాప్‌లో కొనుగోలు కేంద్రాల సమాచారం



సూచన

మద్దతు ధరకు పత్తి విక్రయించడంలో రైతులకు ఇబ్బంది పడకుండా మార్కెటింగ్‌శాఖ సమాచారాన్ని అందించేందుకు సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. వాట్సాప్‌లో ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలు విధానాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేలా చర్యలు తీసుకుంది. దీంతో సీసీఐ కేంద్రానికి వచ్చిన సమయంలో పత్తి ఖరీదు, డబ్బుల చెల్లింపు ఏ స్థాయిలో ఉందనే సమాచారం తెలియనుంది. మార్కెటింగ్ శాఖ తాజా చర్యలతో రైతులు సీసీఐ కేంద్రాలున్న జిన్నింగ్ మిల్లుల్లో విక్రయానికి నిరీక్షించే అవసరం ఉండదు. ఏ కేంద్రంలో ఎంత పత్తి ఉంది? అక్కడ పత్తిని విక్రయించేందుకు ఎంత సమయం పడుతుందనే వివరాలను రైతులు ముందుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. సీసీఐకి పత్తి విక్రయించే రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు.

రైతులు ఏం చేయాలంటే..



- సీసీఐకి పత్తి విక్రయానికి సంబంధించిన సెల్ నంబర్ 88972 81111 ను సేవ్ చేసుకోవాలి.
- ఆ నంబర్ వాట్సాప్‌లో 'హెచ్ ఐ' అని టైప్ చేయాలి.
- వెంటనే వన్ సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో యాప్ ఓపెన్ అవుతుంది.
- ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషలు కనిపిస్తాయి.
- కావాల్సిన భాషను ఎంపిక చేసుకోవాలి.
- వెంటనే పత్తి విక్రయం, తక్‌పట్టి, కొనుగోలు కేంద్రంలో వేచి ఉండే సమయం వంటి వివరాలు కనిపిస్తాయి.
- రైతులు ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు.. ఎన్ని క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేయగలదు వంటి వివరాలు తెలుస్తాయి.

- వరంగల్ వ్యవసాయం (ఆంధ్రజ్యోతి):

పొలం బడి బాటన..

- కేసముద్రం మండలం ధర్మారం తండాలో 30ఏళ్లుగా అదే దారి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పట్టించుకోండి..


ధర్మారంతండా పాఠశాల నుంచి పొలం గట్టుపై నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు

కేసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధర్మారంతండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. ప్రస్తుతం ఈ బడిలో 13 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలకు రోడ్డు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పొలంగట్టుపై నుంచే నడుచుకుంటూ వెళ్లాల్సిందే. 30ఏళ్ల క్రితం పొలాల మధ్యలో నిర్మించిన ఈ పాఠశాలకు నేటికీ దారిని ఏర్పాటు చేయలేదు. ఈ తండాలోని సీసీ రోడ్డు నుంచి సుమారు 25 మీటర్ల దూరం పొలాల మధ్యనుంచే వరం (గట్టు)పై నుంచి విద్యార్థులతోపాటు అదే పాఠశాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీ చిన్నారులు, ఉపాధ్యాయులు కూడా నడుచుకుంటూ వెళుతున్నారు. ఈ గట్టుపై నుంచి వెళ్లే క్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పలుమార్లు జారి కిందపడిన ఘటనలున్నాయి. ఈ సమస్య గురించి కొన్నేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకునే వారేలేరని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'ఎక్స్'లో ప్రశ్నించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

ఈ సమస్య గురించి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ స్పందించారు. విద్యార్థులు పొలాల్లోంచి నడుచుకుంటూ వెళుతున్న వీడియోను పోస్టుచేస్తూ 'గిరిజన విద్యార్థులపై ఎందుకింత వివక్ష? పాఠశాల భవనాన్ని నిర్మించినప్పుడే రోడ్డుకు స్థలం ఎందుకు తీయలేదు? బడికి వెళ్లాలంటే మా గిరిజన విద్యార్థులు పొలం గట్టు నుంచే పోవాలా? బడికి బాట లేకపోతే గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు బాట లేనట్టే' అంటూ కామెంట్ చేశారు. ఇలా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు చేసిన ఎక్స్ పోస్టు చర్చనీయాంశమైంది. అలాగే ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

'ఐసెట్ నిధులు హాంఫట్' కలకలం

- 'ఆంధ్రజ్యోతి' ప్రతులను పంచిన విద్యార్థులు
- విచారణకు సిద్ధమైన విద్యామండలి

కేయూ క్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'ఐసెట్ నిధుల హాంఫట్'పై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం కాకతీయ యూనివర్సిటీలో గురువారం కలకలం రేపింది. విద్యార్థులు ఆంధ్రజ్యోతి కథనాన్ని జిరాక్స్‌లు తీసి లైబ్రరీ, పరిపాలన భవనంతో పాటు వర్సిటీలోని మొదటి, రెండో గేటు ప్రాంతాల్లో పంచారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఐసెట్ నిధుల దుర్వినియోగంపై వర్సిటీలో తీవ్ర చర్చ నడుస్తోంది. అడ్డగోలుగా నిధులను దోచుకుతిని వర్సిటీ పరువుతీశారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిసంఘాల నేతలు ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారులకు, కేయూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి నిధులను స్వాహా చేసిన ప్రొఫెసర్లపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, ఐసెట్ నిధుల గోల్‌మాల్‌పై రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆరా తీసినట్లు తెలిసింది. నిధుల దుర్వినియోగంపై వివరాలను వర్సిటీ ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒకటి, రెండు రోజుల్లో కమిటీ వేసి నిధుల వ్యయంపై సమగ్ర విచారణ జరుపుతారని అన్నట్లు సమాచారం.

దీపం జ్యోతిః పరబ్రహ్మ
దీపం సర్వ తమోపహమ్
దీపేన సాధ్యతే సర్వం
సంధ్యా దీపం నమోస్తుతే



ఆనందరవళి దీపావళి

దసరా సరదాల ఆనంద హేలకు పరాకాష్ఠ. ఆ తరువార 20 రోజులకు వచ్చే దీపావళి... ఆనందరవళి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వేడుక. "ఉపదేశ గ్రంథాలలో భగవద్గీతకు ఎంత ఖ్యాతి ఉందో పండుగలలో దీపావళికి అంతటి ఖ్యాతి ఉంది. భారతదేశంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పండుగకు ఒక్కో ప్రాధాన్యత ఉంటుంది. కానీ దీపావళిని మాత్రం అన్ని ప్రాంతాలవారు సంతోషంగా జరుపుకొంటారు" అని శ్రీ కంచి పరమాచార్యులు పేర్కొన్నారు. భారతదేశంలోని పశ్చిమ, ఉత్తర ప్రాంతాల ప్రజలు ఈ పండుగను... భాద్రపద మాసంలోని చివరి మూడు రోజులు... 'ధనత్రయోదశి', 'నరక చతుర్దశి', 'దీపావళి'గాను, ఆశ్వయుజ మాసంలోని తొలి రెండు రోజులు... 'బలి పాడ్యమి', 'భాతృ విదియ'గాను జరుపుకొంటారు. వీటిలో ప్రతిదానికీ పౌరాణికమైన, సంప్రదాయికమైన కథలు ఉన్నాయి. నరక చతుర్దశికి తమిళనాడులో ప్రత్యేక ప్రాముఖ్యత ఇస్తారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఆశ్వయుజ అమావాస్య నాడు దీపావళిని 'కాళీ పూజ'గా నిర్వహిస్తారు. 'దీపానాం ఆవళి' అనేది దీపావళికి వ్యుత్పత్తి. అంటే 'దీపాల వరుస' అని అర్థం. దీనికే 'కౌముదీ ఉత్సవం', 'దీపాలికా ఉత్సవం', 'దివ్వెల పండుగ' అనే పేర్లు ఉన్నాయి. చీకట్లను తొలగించి, చైతన్య దీప్తులను విరజిమ్మే ఆనందోత్సవమైన దీపావళిని పరబ్రహ్మ స్వరూపంగా భావన చేశారు ఋషులు.

'దీపం జ్యోతిః పరబ్రహ్మ దీపం సర్వ తమోపహమ్
దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీపం నమోస్తుతే'

అన్నారు. 'తమసోమా జ్యోతిర్గమయ' అన్నది వేదం. బాహ్యమైన చీకట్లనే కాకుండా... అంతర్గతంగా ఉన్న తమోగుణాన్ని (అవిద్యను, అజ్ఞానాన్ని) తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదించి, వెలుగుబాటలో ప్రసరించేదిగా దీపావళిని ప్రస్తుతించారు పూర్వులు. ఈ పండుగకు ఆధ్యాత్మిక, పురాణ, ఇతిహాస, సామాజిక ప్రాధాన్యత ఉంది. ఆది శంకరులు షణ్మతాలను ఏకతాటిపైకి తెచ్చి, పంచాయతన పూజా విధానాన్ని ఏర్పరిచారు. అందులో కాలాగ్ని స్వరూపుడైన స్కందుడికి చోటు కల్పించలేదు. అందుకు ప్రతీకగా జ్యోతి ప్రజ్వలనం అనే విధిని ప్రవేశపెట్టారు. అదే దీపారాధన. ఏ పూజ చేసినా జ్యోతి ప్రజ్వలనంతోనే ఆరంభమవుతుంది. పంచభూతాలలో ముఖ్యమైన అగ్నికి సంకేతం దీపారాధన. సూర్యుడిలో ఉండేది అగ్ని. అది లేకపోతే జగత్తు లేదు. సూర్యారాధనలో అగ్ని ఆరాధన అంతర్భాగం. అలాగే పంచభూత లింగాలలో అరుణాచలేశ్వరుడి (అగ్ని లింగం) ప్రాధాన్యం జగద్విదితం. దీపాన్ని అత్యున్నత గుణాలకు ప్రతీకగా కూడా పూర్వకవులు ఉదహరించిన సందర్భాలు అనేకం. శ్రీరాముణ్ణి 'రఘుకులాన్వయ రత్నదీపం'గా వర్ణించాడు వాల్మీకి. 'లోకైక దీపాంకురాం' అనేది 'శ్రీసూక్తం'లో మహాలక్ష్మీ వర్ణన.

తెలుగు ప్రాంతాల్లో, కర్ణాటకలో రెండు రోజులపాటు... నరక చతుర్దశిని, దీపావళిని జరుపుకొంటారు. తొలి రోజు నరక చతుర్దశి. నరకాసురుణ్ణి సత్యభామా సమేతుడై శ్రీకృష్ణుడు సంహరించిన కథ అందరికీ తెలిసినదే. ఆ రోజు ప్రతి ఇల్లు మంగళతోరణాలతో, రంగవల్లులతో కళకళలాతుడూ ఉంటుంది. అందరూ వేకువజామునే లేచి, అభ్యంగన స్నానాలు ఆచరిస్తారు. ఇష్ట దైవాన్ని పూజిస్తారు. సంధ్యా సమయంలో వీధి గుమ్మానికి ఇరువైపులా ప్రమిదలతో దీపాలను పెడతారు. వాటిని 'యమ దీపం' అంటారు. రెండవరోజు దీపావళి. భారతీయులందరూ జరుపుకొనే ముఖ్యమైన పర్వదినం. తొలినాటి మాదిరిగానే నువ్వుల నూనెతో అభ్యంగన స్నానం చేస్తారు. నువ్వుల నూనెలో లక్ష్మి, జలంలో గంగ ఉంటారనేది అనాది విశ్వాసం. నూతన వస్త్రాలను ధరించి, పూజా మందిరంలో, తులసికోట దగ్గర దీపాలను వెలిగిస్తారు. ఇష్టదేవతా ప్రార్థన చేస్తారు. సమీపంలోని ఆలయాలను సందర్శిస్తారు. పితృ దేవతలకు తర్పణాలు వదిలే సంప్రదాయం కూడా ఉంది. అనంతరం విందు భోజనాలు చేస్తారు. ప్రదోష సమయంలో ఇల్లు, వాకిలి చిమ్మి, కల్లాపు జల్లి, ముగ్గులు పెడతారు. పూజా మందిరంలో లక్ష్మీ ప్రతిమను ఆరాధించి, వివిధ నైవేద్యాలు పెడతారు. ప్రమిదలలో దీపాలు వెలిగిస్తారు. ఆ దీపాల వరుసలను ప్రతి గుమ్మం ముందు అలంకరిస్తారు. పెద్దలు, పిల్లలు ఆనందోత్సాహాలతో బాణాసంచా వెలిగిస్తారు. ఈ దీపోత్సవం... మహాలయ పక్షంలో భూలోకానికి వచ్చిన పితృ దేవతలు తిరిగి స్వర్గానికి వెళ్ళడానికి వెలుగు చూపించడానికేననే అభిప్రాయం కూడా ఉంది. రాత్రి ఇంటిని శుభ్రపరిచి, పేరుకున్న చెత్తా చెదారాన్ని ఊడ్చి, వీధిలో పడేస్తారు. దీన్ని ఇంటిలో ఉన్న 'అలక్ష్మి'ని ఇంటి నుంచి బయటకు పంపించే ప్రక్రియగా భావిస్తారు. ఆ మరునాటి నుంచి శివ కేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసం మొదలవుతుంది.

• ఆయపిళ్ళ రాజపాప

పర్వదినం

రోజుకో ప్రత్యేకత

దీపావళిని అయిదు రోజుల పాటు జరుపుకొనే ఆనవాయితీ... ప్రధానం గా ఉత్తర భారతదేశంలో ఉంది. వీటిలో ప్రతి రోజుకూ ఓ ప్రత్యేకత ఉంది. ఈ ఉత్సవాలు ఆశ్వయుజ బహుళ త్రయోదశితో ఆరంభం అవుతాయి. ఆ రోజును 'ధన త్రయోదశి' అంటారు. అమృతం కోసం దేవతలు, రాక్షసులు క్షీరసాగరాన్ని మధించారు. ఆ సాగర మధనంలో... ధనత్రయోదశి నాడు శ్రీమహాలక్ష్మీ దేవి ఉద్భవించింది. కాబట్టి ఈ రోజున లక్ష్మీదేవిని ఆరాధిస్తారు. అయుర్దాయాన్ని కోరుతూ యముణ్ణి, ఆరోగ్యాన్ని కోరుకుంటూ ధన్వంతరిని పూజిస్తారు. రెండో రోజైన ఆశ్వయుజ బహుళ చతుతుర్దశిని 'నరక చతుర్దశి' అంటారు. లోక కంటకుడైన నరకాసురుణ్ణి శ్రీకృష్ణుడు వధించిన రోజు ఇది. ఈ రోజున నరకాసురుడి బొమ్మలను దహనం చేసే ఆచారం కొన్ని ప్రాంతాల్లో ఉంది. నరక చతుర్దశి రోజున వెలిగించే దీపాలు పితృదేవతలకు స్వర్గలోక ప్రాప్తి కలిగిస్తాయని పలు గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఆ తదుపరి రోజు.. ఆశ్వయుజ అమావాస్యను 'దీపావళి'గా ఆసేతు హిమాచలం ప్రజలు జరుపుకొంటారు. ఈ రోజున లక్ష్మీపూజ ప్రధానం. లక్ష్మీదేవి దీపం రూపంలో ఉంటుందనీ, కాబట్టి దీపావళి నాడు దీపాలతో అలంకరించిన ఇళ్ళలో లక్ష్మీదేవి కొలువుతీరుతుందనీ భక్తుల విశ్వాసం. లక్ష్మీదేవిని పూజించిన తరువాత... పెద్దలూ పిన్నలు బాణాసంచా కాలుస్తారు. నాలుగో రోజైన కార్తిక శుద్ధ పాడ్యమిని 'బలి పాడ్యమి' అంటారు. బలి చక్రవర్తిని వామనావతారం ధరించిన శ్రీ మహావిష్ణువు పాతాళంలోకి అణగదొక్కాడు. ప్రతి ఏడాది ఈ రోజున... తను పాలించిన భూలోకానికి వచ్చి, ప్రజల యోగక్షేమాలను పరిశీలించడానికి అనుమతించాలని బలి చక్రవర్తి కోరాడు. మహావిష్ణువు ఆ వరాన్ని అనుగ్రహించాడు. బలి భూలోకానికి తిరిగి వచ్చే రోజు కాబట్టి దీనికి 'బలి పాడ్యమి' అనే పేరు వచ్చింది. చిత్రగుప్తుడి జయంతితోపాటు శ్రీకృష్ణుడు గోవర్ధన గిరి ఎత్తిన రోజు కూడా ఇదే. దానికి చిహ్నంగా కొన్ని ప్రాంతాల్లో గోవర్ధన పూజ జరుపుతారు. ఉత్తరప్రదేశ్‌లోని మధురలో గోవర్ధన గిరి పరిక్రమ నిర్వహిస్తారు. అయిదోరోజైన కార్తిక శుద్ధ విదియను 'యమద్వితీయ', 'యమ విదియ', 'భాతృవిదియ' అంటారు. యమ ధర్మరాజును ఆయ సోదరి యమున ఈ రోజున తన ఇంటికి ఆహ్వానించి, విందు భోజనం పెట్టిందనీ, సోదరీమణుల ఇంటిలో భోజనం చేసిన వారికి నరక బాధ ఉండదని, వారు అపమృత్యువు బారిన పడరనీ యముడు వరం ఇచ్చాడనీ పురాణ కథలు పేర్కొంటాయి. 'భాయ్ దూజ్'గా ఉత్తరాదిన దీన్ని పిలుస్తారు. 'భగినీ హస్తభోజనం'గానూ వ్యవహరిస్తారు.



గీతాసారం

మానవులకు పరమ శత్రువు

"ఓ కృష్ణా! మానవుడు తనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఎవరో బలవంతం చేసినట్టు... దేని ప్రభావానికి ప్రేరేపితుడై పాపాలు చేస్తూ ఉంటాడు?" అని అర్జునుడు అడిగాడు. అప్పుడు శ్రీకృష్ణుడు "రజోగుణం నుంచి ఉత్పన్నం అయ్యేదే కామం. అదే క్రోధంగా రూపుదాల్చుతుంది. అది భోగానుభవాలతో చల్లారేది కాదు. పైగా అంతులేని పాపకర్మలు చేయడానికి



ప్రేరేపించేది కూడా అదే. కాబట్టి దాన్ని పరమ శత్రువుగా భావించాలి" అని చెప్పాడు. ఇక్కడ శ్రీకృష్ణుడు 'కామం' అనే పదాన్ని ఉపయోగించాడు. కామం అంటే కోరిక తాలూకు తీవ్ర రూపం. కర్మతో అనుబంధం కలిగి ఉండడం అనేది రజో గుణానికి ముఖ్య లక్షణం.

కామం అంటే మన జీవితాల్లో సమతుల్యత కోల్పోవడం. మనం సుఖాన్ని పొందడానికి, ఏదైనా వస్తువును సొంతం చేసుకోవడానికి, ఎవరైనా వ్యక్తితో కలిసి ఉండడానికి, అధికారాన్ని, కీర్తిని పొందడానికి చాలా శక్తిని ఖర్చు చేస్తాం. ఈ కోరికలకు శక్తిని అందిస్తున్నప్పుడు... వాటి పర్యవసానాల గురించి మనకు పూర్తిగా అవగాహన ఉండదు. కోరికలు హద్దులు దాటినప్పుడు... వాటి మీద మనకు ఎలాంటి నియంత్రణ ఉండదు. నెరవేరని కోరిక వల్ల క్రోధం ఏర్పడుతుంది. అదే విధంగా... ప్రతి సుఖం వెనుకా ఒక దుఃఖం ఎల్లప్పుడూ దాగి ఉంటుంది. అలా వచ్చే దుఃఖమే క్రోధంగా వ్యక్తమవుతుంది. కోరికలు ఎన్నటికీ సంతృప్తి చెందవు. వాటిని సంతృప్తి పరచడానికి ఎంత ప్రయత్నిస్తే ఎంతగా పెరుగుతూ ఉంటాయి. ధనవంతుడు మరిన్ని సంపదలను కోరుకుంటాడు. శక్తిమంతుడు నిరంకుశమైన శక్తిని కోరుకుంటాడు. వాటిని అణచివేయడం లేదా సంతృప్తిపరచడం అనేవి దీనికి పరిష్కారం కాదు. మనం కామం లేదా భయం అనే కోరల్లో చిక్కుకుపోయినప్పుడు... వాటి పట్ల మరింత అవగాహన పెంచుకోవాలనీ, ఆ అవగాహనే వాటి పట్టు నుంచి మనల్ని విడిపిస్తుందని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సుభాషితం

పూర్వ జన్మ ఫలం

పురాకృత కర్మ ఫలం ఎంత విశిష్టమైనదో తన నీతిశతకంలోని...

భీమం వనం భవతి తస్య పురం ప్రధానం
సర్వో జనః సుజనతా ముపయాతి తస్య
కృత్స్నా చ భూర్భవతి సన్నిధి రత్నపూర్ణా
యస్యాస్తి పూర్వ సుకృతం విపులం నరస్య

అనే శ్లోకంలో భర్తృహరి వివరించాడు.

భువనమున బూర్వ సంభృత పుణ్యరాశి
యగుచు నుదయంబు గాంచిన సుగుణ నిధికి
వనము పురమగు బరులాత్మ జనములగుదు
రవని నిధిరత్న పరిపూర్ణ య్యి ఫలించు

అంటూ దాన్ని తెలుగువారికి అందించాడు ఏనుగు లక్ష్మణకవి.

భావం: పూర్వ జన్మలో చేసిన పుణ్యం మానవుణ్ణి పెన్నిధిలా కాపాడుతుంది. ఏనుగులు, పులులు, సింహాలు లాంటి భీకరమైన మృగాలతో నిండి ఉన్న కీకారణ్యం అతనికి సకల సౌకర్యాలతో నిండిన మహా నగరంలా మారుతుంది. శత్రువులు వారి విరోధాన్ని విడిచి స్నేహితులు అవుతారు. వారికి తామం ఉన్న చోటు సకల సంపదలతో... రత్నగర్భగా మారుతుంది. మరుసటి జన్మల్లో అటువంటి ఫలితాలు పొందాలంటే... ఈ జన్మలో ఎల్లప్పుడూ మంచి పనులు చేయాలి.





సద్బోధ

కనువిప్పు

స్వామి వివేకానంద వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ రాజస్థాన్ ప్రాంతంలోని అల్వార్ పట్టణానికి చేరుకున్నారు. వివేకానందుడి ఖ్యాతిని విన్న స్థానిక ప్రముఖులు ఆయన ప్రసంగాన్ని ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమానికి నాటి అల్వార్ రాజ్య దివాన్ కూడా హాజరయ్యాడు. ఆంగ్లంలో వివేకానందుడు చేసిన ప్రసంగం ఆయనను ఎంతో ఆకట్టుకుంది. "స్వామి! మీరు మా రాజమందిరానికి వచ్చి, మా మహారాజు మంగళ్‌సింగ్‌ను కలుసుకోవాలి" అని ఆహ్వానించాడు. వివేకానందుడు 'సరే' అన్నారు.



మరునాడు ఉదయం దివాన్‌తో కలిసి అల్వార్ రాజమందిరంలో వివేకానందుడు ప్రవేశించారు. రాజా మంగళ్‌సింగ్ విలాసాల్లో మునిగితేలే వ్యక్తి. అతనికి రాజుననే అహంకారం కూడా చాలా ఎక్కువ. దివాన్‌తో కలిసి తన మందిరానికి వచ్చిన వివేకానందుణ్ణి చూడగానే 'ఇతనెవడో కుర్ర సన్యాసి. ఇతనికి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే వయసు, అనుభవం ఎక్కడుంటాయి? అదీ ఇంగ్లీష్‌లో! ఇతనిదంతా ఉత్తుత్తి ప్రదర్శనేనని రుజువు చేస్తాను' అనుకున్నాడు. వివేకానందుడికి స్వాగతం చెప్పి, ఆసనంలో కూర్చోమన్నాడు. ఆ తరువాత స్వామీజీ! నాకు విగ్రహారాధన అంటే పరమ చిరాకు. అది వెనుకబాటుతనానికి నిదర్శనమని నా అభిప్రాయం. కుంకుమ, పసుపు, పూలతో ఒక బొమ్మను పూజిస్తూ, అదే దేవుడని భావించే వాళ్ళను చూస్తే నాకు జాలి కలుగుతూ ఉంటుంది. ఈ విషయంలో మీ అభిప్రాయమేమిటి? అని అడిగాడు.

ఆ ప్రశ్నకు వివేకానందుడు నేరుగా సమాధానం ఇవ్వలేదు. పక్కనే టేబుల్ మీద ఉన్న ఒక చిత్రపటాన్ని చూసి "దివాన్జీ! మీరు ఆ చిత్రపటం మీద ఉమ్మేయ్యగలరా?" అని అడిగాడు. ఆ మాట వినగానే దివాన్జీ దిగ్భ్రాంతి చెందాడు. రాజు ఏమంటాడోనని భయంభయంగా చూశాడు. వివేకానందుడి మాటలు వినగానే రాజుకు ఆగ్రహం కలిగింది. దివాన్జీవైపు కోపంగా చూశాడు.

రాజు కోపాన్ని అర్థం చేసుకున్న దివాన్జీ "స్వామీ! మీరేం మాట్లాడుతున్నారు? ఆ చిత్రపటం ఎవరిదో తెలుసా? మా రాజావారి దివంగతులైన తండ్రిగారిది. ఆయన మాకు దైవంతో సమానం" అన్నాడు.

అప్పుడు వివేకానందుడు "రాజా! అది కేవలం ఒక వస్త్రం లేదా కాగితం. దాని మీద పెద్ద రాజావారి బొమ్మ గీశారు. దానికి రంగులు వేశారు. అంతేకదా! ఆ బొమ్మకి ఎముకలు లేవు, రక్త మాంసాలు లేవు, ఆత్మ లేదు. కానీ దాన్ని మీరు దాన్ని మీ తండ్రిగారి ప్రతిరూపంగా భావించుకుంటున్నారు. అది కేవలం రంగులతో వేసిన ఒక చిత్రంగా భావించుకోవడం మీ దృష్టిలోనూ, మీ పరివారం దృష్టిలోనూ అవివేకం. అదే విధంగా దైవ విగ్రహాన్ని దేవుడు కాదని అనడం కూడా అవివేకమే. ఆరాధించే భక్తులకు ఆ విగ్రహం స్వయానా దేవుడు కాదనే సంగతి తెలుసు. కానీ నిర్గుణంగా అంటే రూపం లేకుండా దేవుణ్ణి ఆరాధించడం అనేది సామాన్యమైన మానవులకు చాలా కష్టం. సగుణోపాసన అంటే ఒక రూపంలో దేవుణ్ణి ఆరాధించడం భక్తికి, ఆధ్యాత్మికతకు తొలి మెట్టు. ఈ మార్గంలో ఎంతో సాధన చేసిన తరువాత... దేవుడు నిర్గుణుడని, నిరాకారుడని వారు గ్రహించగలుగుతారు. అప్పటివరకూ ఈ మార్గాన్ని అనుసరించక తప్పదు. అందులో ఎలాంటి తప్పూ లేదు. అది వెనుకబాటుతనం కాదు. మూర్ఖత్వం అంతకన్నా కాదు" అని బదులిచ్చారు.

ఆ మాటలతో రాజా మంగళ్‌సింగ్ కళ్ళు తెరుచుకున్నాయి. తన ముందు ఉన్నది సామాన్యుడైన వ్యక్తి కాదనీ, వయసును మించి జ్ఞానం సంపాదించిన మహనీయుడని గ్రహించాడు. చేతులు జోడించి వివేకానందుడికి నమస్కరించాడు.

లక్ష్మీ కటాక్షం పొందాలంటే...

దీపావళి నాడు లక్ష్మీదేవిని పూజించడం సంప్రదాయం. లక్ష్మీతత్త్వాన్ని గురించి తెలుసుకుంటే... ఈ పండుగలోని అంతరార్థం మనకు తెలుస్తుంది. ఈ సృష్టి పరిణామక్రమానికి ప్రతీక 'లక్ష్మీదేవి' అని గ్రహించాలి. ఆమె శక్తి ద్వారానే మనం పరిణామ దశల్లో అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేరుకుంటాం. ఇది లక్ష్మీతత్త్వంతో మొదలవుతుంది. అమృతం కోసం సాగిన

> మనకు ఉన్నదానిలోనే ఇతరులకు సాయపడే గుణం ఉంటేనే లక్ష్మీదేవి ఆశీస్సులు మనకు లభిస్తాయి. మానవులలో లక్ష్మీతత్త్వం పెంపొందాలంటే... సంతృప్తి, దాతృత్వం, ధర్మ నిరతి, సమతుల్యత తదితర సద్గుణాలు ఉండాలి. వాటిలో లోపం ఉంటే లక్ష్మీకటాక్షం ఉండదు.

అద్భుతమైన మధనంలో... లోకుల అన్వేషణకు ప్రతీకగా సముద్రం నుంచి శ్రీలక్ష్మీదేవి ఆవిర్భవించింది. జీవుల సృష్టి సముద్రం నుంచే ఆరంభమయింది. వాటికి శక్తి సముద్రం నుంచే రావలసి ఉంది. ఆ విధంగా జీవులలో లక్ష్మీతత్త్వ సారం అంతర్గతంగా నెలకొని ఉంటుంది. మనల్ని పోషించేదీ, రక్షించేదీ, భద్రత కల్పించేదీ అదే. ఆటవిక దశ నుంచి ఒక స్థిరత్వాన్ని మానవులకు ఈ తత్త్వమే కలిగించింది. ఇక్కడ లక్ష్మీదేవి గృహలక్ష్మిగా తన పాత్ర పోషిస్తోంది. ఇంటిని, కుటుంబాన్ని, వ్యక్తిగత జీవితాన్ని ఏర్పరచుకోవడానికి అదే ప్రేరణ కలిగించింది. ఆ తరువాత మనిషి సంఘ జీవిగా రూపుదిద్దుకున్నాడు. రాజ్యం ఏర్పడింది. దీనికి మూలం రాజ్యలక్ష్మీ తత్త్వం.

ఏ ఇంట్లో మహిళలు 'గృహలక్ష్మి'గా గౌరవం పొందుతారో... ఆ ఇంట శ్రీలక్ష్మీదేవి సిరులు కురిపిస్తుంది. అందుకే... 'యత్రనార్యస్తు పూజ్యంతే, రమంతే తత్రదేవతాః' అన్నారు పూర్వులు. ఎక్కడ స్త్రీలను దేవతలుగా బావించి పూజిస్తారో... అక్కడ లక్ష్మీదేవి స్థిరంగా నిలుస్తుంది. 'యాదేవీ సర్వ భూతేషు శాంతి రూపేణ సంస్థితా...' అంటే ఆ శాంతి దేవతే గృహ లక్ష్మి రూపంలో స్థిరపడింది. గృహిణులు తమ ప్రాధాన్యతను గ్రహించినప్పుడు, సహన శక్తి, క్షమాశక్తితో కుటుంబంలో సంబంధ బాంధవ్యాలను మెరుగుపరిచే శక్తి సాధించినప్పుడే... ఆ ఇంట్లో శాంతి సాధ్యపడుతుంది. అలా కానప్పుడు కుటుంబ వ్యవస్థ గాడి తప్పుతుంది.



జీవ పరిణామ దశలో మనం అత్యున్నతమైన మానవులుగా ఉన్నాం. అనుక్షణం భగవంతుడి సంరక్షణలో ఉన్నాం. మనకు సంపదలు సమకూరినప్పుడు... లక్ష్మీ కటాక్షం కలిగిందని భావిస్తాం. మన సూక్ష్మ శరీర వ్యవస్థలో... నాభీ చక్రంలో



సహజయోగ

లక్ష్మీదేవి, మనలోని కుండలిని ప్రయాణించే సుషుమ్న నాడిలో మహాలక్ష్మీదేవి అధిష్ఠాన దేవతలుగా ఉంటారు. లక్ష్మీదేవి మనకు ధనాన్ని ప్రసాదిస్తే, మహాలక్ష్మీ దేవి దాతృత్వ స్వభావాన్ని ప్రసాదిస్తుంది. ఇంటిలో గాలి రావడానికి, గాలి పోవడానికి రెండు ద్వారాలు ఉంటాయి. అలాగే జీవితంలో సమతుల్యత కోసం... ధనం రావడానికి, బయటకు వెళ్ళడానికి రెండు దారులు ఉంటాయి. అంటే ధన సంపాదన ఉండాలి. దానితోపాటే ఇతరులకు చేతనైనంత సాయం చేసే స్వభావం కూడా ఉండాలి. పిసినారితనం లేకుండా, మనకు ఉన్నదానిలోనే ఇతరులకు సాయపడే గుణం ఉంటేనే లక్ష్మీదేవి ఆశీస్సులు మనకు లభిస్తాయి. మానవులలో లక్ష్మీతత్త్వం పెంపొందాలంటే.. సంతృప్తి, దాతృత్వం, ధర్మ నిరతి, సమతుల్యత తదితర సద్గుణాలు ఉండాలి. వాటిలో లోపం ఉంటే లక్ష్మీకటాక్షం ఉండదు. మద్యపానం, జూదం లాంటి దుర్వ్యసనాలు, ఉన్నదానితో సంతృప్తి చెందకుండా అత్యాశకు పోవడం, మోసపూరితంగా, అధర్మ మార్గంలో ధనం సంపాదించాలనే దురాశ... ఇవన్నీ లక్ష్మీదేవికి వ్యతిరేకమైన గుణాలు. చాలామంది ధనసంపాదనే అన్ని సమస్యలకు పరిష్కారంగా భావిస్తారు. ధనం కోసం తాపత్రయపడి, రాత్రి-పగలు కష్టపడతారు. ఈ పోటీ ప్రపంచంలో ఇతరుల పిల్లలకన్నా తమ పిల్లలు ఉన్నతస్థాయిలో జీవించాలని కలలుకంటారు. ఈ తాపత్రయంలో పడి... మానవులందరి సంక్షేమం చూసేది ఆ భగవంతుడే అనే విషయాన్ని మరచిపోతారు. అప్పుడు వారి చిత్తం భగవంతుడి నుంచి దూరమవుతుంది. తమ వారసుల కోసం కూడబెట్టాలనుకుంటున్న ధనం మీదకు మరలిపోతుంది. దీనితో భగవంతుడి శక్తిని మరచిపోతారు. అలాకాకుండా ఉండాలంటే... మనం ధర్మబద్ధంగా ఎంత సంపాదించగలమో అంతే సంపాదించి, మన సంక్షేమాన్ని భగవంతుడికి విడిచిపెట్టాలి. ఎల్లప్పుడూ ధనం కోసం ఆందోళన చెందుతూ ఉండకూడదు.

"...యోగక్షేమం వహామ్యహం" అన్నాడు 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు. అంటే "నాతో (భగవంతుడితో) యోగం (కలయిక) పొందినట్టయితే, మీ క్షేమాన్ని నేను చూసుకుంటాను" అని అర్థం.

లక్ష్మీదేవి పద్మంలో నిలబడి ఉంటుంది. ఎటూ ఒరిగిపోకుండా సమతుల్యతను కలిగి ఉంటుంది. అదే విధంగా లక్ష్మీతత్త్వాన్ని కలిగి ఉన్న వ్యక్తి సమతుల్యతతో ఉంటాడు. అంటే ఎక్కడా అతి చెయ్యకుండా ఉంటాడు. లక్ష్మీదేవి నాలుగు చేతులలో ఒక చెయ్యి దానం చేసేదిగా, మరో చెయ్యి అభయం ఇచ్చేదిగా ఉంటుంది. మనలోని లక్ష్మీతత్త్వాన్ని స్థిరీకరించుకోవడం కోసం ఉదారంగా ఉండాలి, దానాలు చెయ్యాలి. మన దగ్గర పని చేసేవారికి, మనల్ని నమ్ముకున్నవారికి రక్షణ కల్పించాలి. లక్ష్మీదేవి చేతిలోని కలువపువ్వు... మన హృదయం కమలంలా ఉండాలని సూచిస్తుంది. తామరపువ్వు తనలోని మకరందాన్ని తీసుకోవడానికి వచ్చిన కీటకాన్ని సైతం ఎలా సేదదీర్చుతుందో... మన ఇంటికి వచ్చిన అతిథులను కూడా ఆ విధంగానే ఆదరించాలి. లక్ష్మీదేవి కృప మనమీద ప్రసరించాలంటే... ప్రేమపూరితమైన స్వభావం కలిగి ఉండాలి. ఎదుటి వ్యక్తి నుంచి ఎలాంటి ప్రయోజనాన్నీ ఆశించకూడదు. అటువంటి ప్రేమ జ్యోతిని... అంటే మన ఆత్మజ్యోతిని వెలిగించుకుందాం. ఈ దీపావళికి మనలోపల, బయట ఉన్న అంధకారాన్ని పటాపంచలు చేద్దాం. మనం లక్ష్మీతత్త్వాన్ని పొందాలంటే... మనలో ఆ తల్లి గుణగణాలు ప్రతిఫలించాలి. మన చిత్తం సదా భగవంతుడిపైనే ఉండాలి. దానికి ఆత్మసాక్షాత్కారం పొంది, సహజయోగ సాధన చేయడమే ఉత్తమమైన మార్గం.



డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ







ఒకరోజు ముందుగానే వస్తున్న పుష్ప2





సుకుమార్ దర్శకత్వంలో అల్లుఅర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రానికి మొదట అనుకున్న విడుదల తేదీ డిసెంబర్ 6. అయితే ఒక రోజు ముందుగా.. అంటే.. డిసెంబరు 5నే థియేటర్లలో సందడి చేయనుంది. నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ విషయాన్ని ఓ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా నవీన్ యెర్నేని మాట్లాడుతూ "ఈ సినిమా యూఎస్ ప్రీమియర్స్ డిసెంబరు 4న ప్రారంభమవుతాయి. లాంగ్ వీకెండ్ కలిసొస్తుందనే ఉద్దేశంతో ఇండియాలోనూ డిసెంబరు 5, గురువారం విడుదల చేస్తున్నాం. అందరి అంచనాలకు మించేలా సినిమా ఉండనుంది" అని చెప్పారు. "అల్లు అర్జున్ ఈ సినిమా కోసం.. తన వంద శాతం ఎఫర్ట్ పెడుతున్నారు. ఆయన బెస్ట్ పర్ఫార్మెన్స్‌ను ఈ చిత్రంలో చూస్తారు. ఈ సినిమాను కొన్న డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ మంచి లాభాలు రావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో జాతర ఎపిసోడ్ థియేటర్లో పూనకాలు తెప్పిస్తుంది" అని వై.రవిశంకర్ అన్నారు.

ప్రీ రిలీజ్ బిజినెస్ ఇదీ

● 'పుష్ప2' ప్రీ రిలీజ్ బిజినెస్ సుమారు రూ.1000 కోట్లు. ఇందులో ఇప్పటి వరకు అయిన నాన్ థియేట్రికల్ బిజినెస్ రూ.420 కోట్లు

● థియేట్రికల్ రైట్స్ ద్వారా ఏపీ, తెలంగాణ - రూ.220 కోట్లు, నార్త్ ఇండియా - రూ.200 కోట్లు, తమిళనాడు-రూ.30 కోట్లు, కర్ణాటక - రూ.30 కోట్లు, కేరళ- రూ.20 కోట్లు, విదేశీ మార్కెట్-140 కోట్లు బిజినెస్ అయ్యింది.

ఎన్ని థియేటర్లలో..

● విదేశాల్లో అన్ని భారతీయ భాషల్లో కలిపి 3000 లోకేషన్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు.

● కర్ణాటకలో 500 థియేటర్లలో విడుదలకు ప్లాన్ చేస్తున్నారు. కేజీఎఫ్-2 350 సింగిల్ స్క్రీన్స్, 80 మల్టీప్లెక్స్ థియేటర్లలో రిలీజ్ అయ్యింది. కర్ణాటకలో ఇప్పటి వరకు కేజీఎఫ్, కేజీఎఫ్-2 రూ.90 కోట్లు వసూలు చేసి రికార్డులు సృష్టించాయి. ఇక్కడ తెలుగు సినిమాల్లో బాహుబలి-1 దాదాపు రూ.30 కోట్లు, బాహుబలి-2 రూ.70 కోట్లు, పుష్ప-1 సుమారు రూ.20 కోట్లు వసూళ్లు చేశాయి. అయితే పుష్ప-2 రూ.80 నుంచి 100 కోట్ల వరకు వసూలు చేస్తుందన్న నమ్మకాన్ని కర్ణాటక డిస్ట్రిబ్యూటర్ లక్ష్మీకాంత్ వ్యక్తం చేశారు.

● తమిళనాడులో సాధారణంగా రజనీకాంత్, విజయ్, అజిత్ సినిమాలకు మాత్రమే ఓపెనింగ్ రోజు డబుల్ డిజిట్ కలెక్షన్లు వస్తుంటాయి. తాజా చిత్రం 'గోట్'ని 800 స్క్రీన్లలో రిలీజ్ చేశారు. పుష్ప-2ను 539 లోకేషన్లలో 806 స్క్రీన్లలో విడుదల చేయడానికి డిస్ట్రిబ్యూటర్ మాలి ప్లాన్ చేశారు.

● కేరళలో 24 గంటలూ ఏకధాటిగా షోలు వేయాలని కోరుతున్నామని, తద్వారా విజయ్ సినిమా లియో రికార్డులను బ్రేక్ చేసే అవకాశం ఉంటుందని కేరళ డిస్ట్రిబ్యూటర్ ముకేశ్ మెహతా తెలిపారు. లియో ఓపెనింగ్ డే రికార్డు రూ.12 కోట్లు. దీన్ని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

● నార్త్ ఇండియాతోపాటు పశ్చిమ బెంగాల్‌లో కూడా సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ రెండు ప్రాంతాల్లో కలిపి సుమారు రూ.450 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు వసూళ్లు వచ్చే అవకాశమున్నదని డిస్ట్రిబ్యూటర్ అనిల్ తడాని ఆశాభావం వ్యక్తం చేశారు.

ధర్మం కోసం పోరాడే యోధుడు



తమిళ హీరో సూర్య నటించిన పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌ను శివ దర్శకత్వంలో కేఈ.జ్ఞానవేల్, వంశీ, ప్రమోద్ నిర్మించారు. నవంబర్ 14న దాదాపు పది భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోన్న సందర్భంగా గురువారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శివ మాట్లాడుతూ "దాదాపు వెయ్యేళ్ల క్రితం ఐదు తెగల మధ్య జరిగిన పోరాటమే ఈ సినిమా కథాంశం. సూర్యకు ఈ కథ చెప్పగానే విపరీతంగా నచ్చేసింది. సినిమా గొప్ప విజయం సాధిస్తుంది" అని చెప్పారు. "మీరు నాపై చూపిస్తున్న ప్రేమ ఎంతో ఆనందాన్నిస్తోంది. తను నమ్మిన ధర్మం కోసం పోరాడే యోధుడి కథ ఇది. టీమ్ ఎఫర్ట్ వల్లే సినిమా అనుకున్న దానికంటే అద్భుతంగా వచ్చింది" అని సూర్య చెప్పారు.

జానీ మాస్టర్‌కు బెయిల్



లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషాకు హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. కొరియోగ్రాఫర్ జానీ ఇదే కేసులో కొన్ని వారాలుగా జైల్లో ఉంటున్నారు. తాను మైనర్‌నని, జానీ మాస్టర్ తనపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆయన వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్న యువతి చేసిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు జానీపై పోక్సో కేసు నమోదు చేశారు. అయితే, తప్పుడు ఫిర్యాదు ఆధారంగా తనపై కేసు పెట్టారని, తనకు ఎలాంటి సంబంధం లేదని, ఈ కేసులో బెయిల్ ఇవ్వాలని కోరుతూ జానీ మాస్టర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సీ ప్రతాప్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఫిర్యాదుదారు మేజర్ అని, నాలుగేళ్లుగా వారు కలిసి తిరిగినట్లు సాక్షులు పేర్కొంటున్నారని తెలిపారు. ఏడాదిగా దూరంగా ఉన్న తర్వాత చాలా ఆలస్యంగా, జాతీయ ఉత్తమ కొరియోగ్రాఫర్ అవార్డు స్వీకరించే ముందు దురుద్దేశంతో కేసు పెట్టారని ఆరోపించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పిటిషనర్ కానీ, ఆయన కుటుంబ సభ్యులు గానీ.. కేసు దర్యాప్తు, ఫిర్యాదుదారు విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోవద్దని షరతులు విధిస్తూ బెయిల్ మంజూరు చేసింది.



రెట్రో బీట్స్‌తో తస్సాదియ్యా...!

కరుణ కుమార్ దర్శకత్వంలో వరుణ్ తేజ్, నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మట్కా'. విజయేందర్ రెడ్డి, రజని తాళ్లూరి నిర్మాతలు. నవంబరు 14న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సెకండ్ సింగిల్ రెట్రో బీట్స్ కలిగిన 'తస్సాదియ్యా' సాంగ్ రిలీజ్ చేశారు మేకర్స్ ఇప్పటికే ఫస్ట్ సింగిల్ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. వరుణ్ తేజ్ ఈ పాటలో ఎనర్జిటిక్‌గా కనిపించారు. స్టాట్-ఆన్ స్టయిలింగ్‌తో అదరగొట్టారు. వరుణ్ తేజ్ డ్యాన్స్ మూమెంట్స్ కన్నుల విందుగా ఉన్నాయి. నోస్టాల్జియా అండ్ రిఫ్రెష్ వైబ్‌తో పాట అదిరిపోయింది. జీ.వి. ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం ఈ చిత్రానికి మేజర్ హైలెట్.

నిర్మాత బూరుగుపల్లి మరోసారి అరెస్టు



హైదరాబాద్ రాయదుర్గం పరిధిలోని సర్వే నంబర్ 46లో 83 ఎకరాల ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసిన కేసులో ఈ నెల 17న అరెస్టు అయ్యి అనారోగ్య కారణాలతో విడుదలయిన నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణను గురువారం ఓయూ పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. వివరాలలోకి వెళితే తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 83 ఎకరాల భూమిని శివరామకృష్ణ కబ్జా చేశారని ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జరీనా పర్వీన్ ఈ ఏడాది ఆగస్టులో సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు భూ కబ్జా కేసు కావడంతో దానిని ఓయూ పీఎస్‌కు బదిలీ చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు శివరామకృష్ణను దోషిగా తేల్చడంతో ఈ నెల 17న ఓయూ పోలీసులు ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే అనారోగ్య కారణాలతో శివరామకృష్ణకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో విడుదలయ్యారు. కాగా పోలీసులు మరోసారి ప్రభుత్వం తరుఫున న్యాయస్థానంలో వాదనలు వినిపించి శివరామకృష్ణ మంజూరయిన బెయిల్‌ను కొట్టివేయించారు. ఓయూ పోలీసులు గురువారం అయననను మరోసారి అరెస్టు చేశారు.

చేతిలో చెయ్యేసి...



ఇటీవలే విడుదలై సూపర్ సక్సెస్ సాధించిన 'దేవర' సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు బాలీవుడ్ నటి జాన్వీ కపూర్. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో 'ఆర్‌సీ16'.. వరుణ్ ధావన్‌తో 'సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారీ' చిత్రాలలో నటిస్తున్నారీ బ్యూటీ. రీసెంట్‌గా బాలీవుడ్ డిజైనర్ మనీశ్ మల్హోత్రా దీపావళి పార్టీని ముంబైలో ఏర్పాటు చేశారు. ఈ విందులో జాన్వీ తన బాయ్‌ఫ్రెండ్ శిఖర్ పహీరియాతో కలసి సందడి చేశారు. శిఖర్‌తో, జాన్వీ చేతిలో చెయ్యేసి తీసుకున్న ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పార్టీలో షాహిద్ కపూర్, కార్తీక్ ఆర్యన్, ఆలియా భట్, కాజోల్, త్రిప్తి దిమ్రితో పాటు నాగచైతన్యకు కాబోయే సతీమణి శోభితా ధూళిపాళ్ళ కూడా తళుక్కున మెరిశారు.

అప్‌డేట్స్

ఆసక్తికరమైన కంటెంట్



చంద్రశేఖర్ రాథోడ్ లీడ్ రోల్ పోషించి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. కాశ్వీ కాంచన్ హీరోయిన్. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకాశ్‌పూరి మాట్లాడుతూ "ఈ సినిమా ట్రైలర్, కంటెంట్ ఆసక్తికరంగా ఉన్నాయి. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే చిత్రమిది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది" అని దర్శకుడు చంద్రశేఖర్ రాథోడ్ అన్నారు.

జగ్జీవన్ రామ్ జీవన చిత్రం



మిలిటరీ ప్రసాద్ ప్రధాన పాత్రలో దిలీప్ రాజా దర్శకత్వంలో చందోలు నాగేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం 'జగ్జీవన్ రామ్'. మీరాకుమార్ పాత్రలో తాళ్లూరి రామేశ్వరి నటిస్తున్నారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ విడుదల చేశారు. దర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ 'వంద సంవత్సరాల క్రితం జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా నిర్మిస్తున్నాం. జలియన్‌వాలా బాగ్‌లో భారతీయులను అతి కిరాతకంగా చంపిన జనరల్ డయ్యర్‌ను భారత వీరుడు సర్దార్ ఉద్ధమ్ సింగ్ కాల్చి చంపే సన్నివేశం, నాటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని జగ్జీవన్‌రామ్ విభేదించే దృశ్యాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తున్నాం" అని తెలిపారు.

ఆస్తులపైనే మీ ప్రేమ!



(మొదటిపేజీ తరువాయి)

కోసమే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసులని, బెయిల్ రద్దు అవుతుందని జగన్ రకరకాల సాకులు చెబుతున్నారన్నారు. ఆయన చెప్పినవేవీ నిజాలు కావని స్పష్టం చేశారు. "సరస్వతీ పవర్‌లో నాకు వాటాలు ఇవ్వడంవల్ల బెయిల్ రద్దవుతుందంటూ జగన్ బీద ఏడుపు ఏడుస్తున్నారు. ఇది ఈ శతాబ్దపు జోక్. చట్ట విరుద్ధమని తెలిసినా ప్రేమతో నాకు షేర్లు బదిలీ చేశారనేది పచ్చి అబద్ధం" అని షర్మిల పేర్కొన్నారు. 2016లో ఈడీ అటాచ్ చేసినందున షేర్లు బదిలీ చేయకూడదన్న జగన్ వాదనను తోసిపుచ్చారు. "సరస్వతీ కంపెనీ షేర్లను ఈడీ అటాచ్ చేయలేదు. రూ.32 కోట్ల విలువైన కంపెనీ భూమిని మాత్రమే అటాచ్ చేసింది. షేర్లను ఏ సమయంలోనైనా బదిలీ చేసుకోవచ్చు. స్టాక్ మార్కెట్లలో ఉన్న చాలా కంపెనీల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. అయినా వాటి ట్రేడింగ్ జరుగుతోంది కదా!" అని షర్మిల ప్రశ్నించారు. సరస్వతీ పవర్ షేర్లను 100 శాతం తనకు బదిలీ చేస్తామని 2019లోనే జగన్ ఎంఓయూపై సంతకం చేశారని షర్మిల తెలిపారు. అప్పుడు బెయిల్ సంగతి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. "2021లో క్లాసిక్ రియల్టీ, సండూర్ పవర్‌లో ఉన్న కంపెనీ షేర్లను రూ.42 కోట్లకు కొనుగోలు చేసేందుకు తల్లి వైఎస్ విజయమ్మకు ఎలా అనుమతి ఇచ్చారు? 2021లో జగన్, ఆయన సతీమణి కలిసి విజయమ్మకు గిఫ్ట్ డీడ్ ఇవ్వలేదా? అప్పుడు బెయిల్ రద్దు గుర్తుకురాలేదా?" అని ప్రశ్నించారు.

"ఆస్తుల కోసం గొడవలు పెట్టుకోవాలన్న ఉద్దేశం నాకు లేదు. సామరస్యంగా పరిష్కరించుకోవాలని, నాలుగు గోడల మధ్య మాట్లాడుకోవాలని నాకూ తెలుసు. కానీ... కుటుంబ విషయాలను జగన్ రోడ్డు మీదకు తీసుకొచ్చారు. ఇప్పుడు కోర్టు వరకూ తీసుకువెళ్లారు. తల్లినీ, చెల్లినీ కోర్టుకు ఈడ్చడం సాధారణ విషయం కాదు జగన్ సార్!"

- మీడియాతో షర్మిల

ఇదీ అసలు విషయం...

మొన్నటి ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోయాక జగన్ మనసు మారిందని.. ఈ ప్రాజెక్టులను వదులుకోవడానికి ఇష్టపడటం లేదని షర్మిల చెప్పారు. అసలు విషయం ఇదే అన్నారు. "సరస్వతీ పవర్‌ను కూడా భారతీ సిమెంట్స్ కంపెనీ కింద నిర్వహించాలనుకుంటున్నారు. అందుకే ఈడీ అటాచ్‌మెంట్ అంశాన్ని లేవనెత్తారు. షేర్లను బదిలీ చేయలేమని అవాస్తవాలు చెబుతున్నారు" అని షర్మిల మండిపడ్డారు.

ఎందుకంత 'పగ'... అంటే!



'జన్మతః మన మధ్య సంక్రమించిన బాంధవ్యం, చిన్నతనం నుంచీ పంచుకున్న అనుభూతులు, ప్రశాంతమైన జ్ఞాపకాలన్నీ.. మారిన నీ వైఖరితో గతంగా మారాయి. సోదరుడినన్న ప్రేమ, ఆప్యాయతలు లేకుండా నువ్వు చేస్తున్న చర్యలతో నా హృదయం తీవ్రంగా గాయపడింది. నాపై పదేపదే అసత్యాలు చెప్పావు. తప్పుడు ప్రచారం చేశావు. రాజకీయంగా నాతో విభేదించడమే కాకుండా వ్యక్తిగతంగా నా ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యవహరించావు. ఇంత చేశాక నీ మీద ప్రేమ, ఆప్యాయతలు ఎందుకు ఉండాలి. మన మధ్య సఖ్యత, సుహృద్భావ పరిస్థితులు లేవన్న దాంట్లో రహస్యమేమీ లేదు. మారిన పరిస్థితుల నేపథ్యంలో... ఆస్తుల్లో వాటాలకు సంబంధించిన ఒరిజినల్ ఎంవోయూ అమలు చేసేందుకు సిద్ధంగా లేను. సరస్వతీ పవర్‌లో వాటాలను ఇస్తూ చేసిన డిక్లరేషన్‌ను రద్దు చేసుకుంటున్నాను. న్యాయస్థానంలో కేసులు తేలాక, నీ వైఖరి మారితే... అప్పుడు అన్నా చెల్లెళ్ల బంధం మళ్లీ చిగురించే అవకాశం ఉంది!"

- ఆగస్టు 27వ తేదీన షర్మిలకు రాసిన లేఖలో వైఎస్ జగన్

కుటుంబ కలహాలు మామూలే!

- గొడవలు ఏ ఇంట్లో ఉండవు?
- నేను గుర్లకు వస్తున్నాననే మా తగాదాలు తెరపైకి తెచ్చారు
- షర్మిలతో వివాదాలపై జగన్ వ్యాఖ్యలు

విజయనగరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తల్లీ చెల్లితో ఆస్తి వివాదాలను 'సాధారణమైన అంశం'గా వైఎస్ జగన్ తేల్చేశారు. వారిద్దరిపై ట్రైబ్యునల్‌లో కేసు వేయడాన్ని కూడా 'మామూలు విషయం'గానే లెక్కకట్టారు. తాను డయేరియా బాధితులను పరామర్శించేందుకు వస్తున్నానని.. జనం దృష్టిని మళ్లించేందుకే 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని ఆరోపించారు. మీడియాలో తనపైనా, తన కుటుంబ సభ్యులపైనా వార్తలు రాయిస్తున్నారని ఆక్రోశించారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ గురువారం విజయనగరం జిల్లాలో డయేరియా ప్రభావిత గ్రామమైన గుర్లలో పర్యటించారు. బాధితులను పరామర్శించిన అనంతరం "రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. వాటర్ ట్యాంకులు సకాలంలో శుభ్రం చేయించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. డయేరియా ఘటన నుంచి ప్రజలను మభ్యపెట్టేందుకు అనుకూల పత్రికలు, మీడియాలో నాకు, నా కుటుంబ సభ్యుల మధ్య ఉన్న ఆస్తి తగాదాను తెరపైకి తెచ్చారు. కుటుంబ కలహాలు ఏ ఇంట్లో ఉండవు? అవి మామూలే" అని జగన్ వ్యాఖ్యానించారు.

సీఎం చొరవచూపి కొల్లాపూర్‌లో రాజకీయ దాడులు ఆపాలి

- జూపల్లిని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలి: బీఆర్ఎస్ నేతలు
- పని మనిషి ఆత్మహత్య కేసులో గద్వాల ఎమ్మెల్యే అరెస్టుకు డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ నియోజకవర్గంలో శాంతిభద్రతలు క్షీణించాయని, మంత్రి జూపల్లి కృష్ణారావు తమ పార్టీ నేతలపై కేసులు పెట్టి వేధిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవచూపి అక్కడ రాజకీయ దాడులు ఆపాలని బీఆర్ఎస్ నేతలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, రంగినేని అభిలాష్, కురువ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. శ్రీధర్ రెడ్డి హత్య జరిగి ఆరునెలలైనా.. ఇప్పటివరకు నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. జూపల్లికి రాజకీయ విలువలు లేవని విమర్శించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తమ్ముడు రాజశేఖర్ రెడ్డి ఇంట్లో పనిచేసే బాలికను చిత్రహింసలు పెడితే.. ఆమె ఆత్మహత్య చేసుకుందని ఈ కేసును పక్కదారి పట్టించేలా మంత్రి పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఆయన తమ్ముడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, రాజకీయ దాడులకు పాల్పడుతున్న జూపల్లిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఆయన మంత్రి అయ్యాక బెల్టుషాపులు పెరిగాయని, కొల్లాపూర్ పరిధిలో భూ యజమానులకు తెలియకుండా పట్టాలు మారుస్తున్నారని ఆరోపించారు.

నవజాత శిశువు తల్లికి ఎలాంటి అసౌకర్యం కల్గించలేదు

- చెట్టు కింద వేచి ఉందని తెలిసి పాలు పట్టే గదిలో ఉండేందుకు ఏర్పాట్లు చేశాం
- ఆంధ్రజ్యోతి కథనానికి ఎంజీఎం సూపరింటెండెంట్ వివరణ

వరంగల్ మెడికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువు తల్లికి ఎటువంటి అసౌకర్యం కలిగించలేదని వరంగల్ ఎంజీఎం సూపరింటెండెంట్ వివరణ ఇచ్చారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'తల్లడిల్లిన బాలింత' శీర్షికతో వచ్చిన వార్తపై ఆయన స్పందించారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ములకలపల్లి గ్రామానికి చెందిన మౌనికకు మంగళవారం రాత్రి వాజేడు మండలం పేరూరు పీహెచ్‌సీలో సాధారణ ప్రసవమైందని, పుట్టిన బిడ్డ తక్కువ బరువు ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తీసుకొచ్చారని చెప్పారు. పరిశీలించిన వైద్యులు శిశువును పిల్లల వార్డులో అడ్మిట్ చేసి, ఇంక్యుబేటర్‌లో ఉంచారని తెలిపారు. నవజాత శిశువు తల్లి వార్డు బయట చెట్టు కింద వేచి ఉందని ఆమెను తీసుకొచ్చిన అంబులెన్స్ డ్రైవర్లు చెప్పిన వెంటనే ఆమెకు తల్లిపాలు పట్టే గదిలో ఉండేందుకు సౌకర్యం కల్పించామని చెప్పారు. ఆమెకు ఎలాంటి అసౌకర్యం కలిగించలేదని తెలిపారు. నవజాత శిశువుకు వైద్యుల పర్యవేక్షణలో వైద్య సహాయం అందించామని సూపరింటెండెంట్ వివరించారు.

వీడియో కాల్ చేసి మాట్లాడు

- నిన్ను చూస్తూ మాట్లాడాలనిపిస్తోంది
- మహిళా ఉద్యోగులకు ఎంపీడీవో వేధింపులు
- అర్వపల్లిలో ఆఫీసు ముందు బాధితుల ఆందోళన

అర్వపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): "వీడియో కాల్ చేసి మాట్లాడు. నిన్ను చూస్తూ మాట్లాడాలనిపిస్తోంది. వీడియో కాల్ చేయకపోతే షోకాజ్ నోటీస్ ఇస్తా" అని సూర్యాపేట జిల్లా అర్వపల్లి ఎంపీడీవో పవన్ కుమార్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని మహిళా ఉద్యోగులు ఆరోపించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం చింతలపాలెం నుంచి బదిలీపై వచ్చిన పవన్ కుమార్ తమతో ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సమయపాలన లేకుండా ఒంటరిగా మహిళా ఉద్యోగులను క్షేత్ర స్థాయి పరిశీలనకు రావాలని వేధిస్తున్నారని ఆరోపించారు. మహిళా పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్న కార్యాలయానికి తనిఖీలకు వెళ్లి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. వ్యక్తిగత సమస్యలు చెప్పాలని అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న సమయంలో వితంతువులు ఎదురుగా రావొద్దని అంటున్నారని తెలిపారు. ఆందోళన విషయం తెలుసుకున్న జడ్పీ డిప్యూటీ సీఈవో శిరీష అర్వపల్లి ఎంపీడీవో ఆఫీసుకు వెళ్లారు. ఆ సమయంలో ఎంపీడీవో పవన్ క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. ఉద్యోగులు డిప్యూటీ సీఈవోకు వినతిపత్రం అందజేయగా, ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్, ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో పవన్ కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఉద్యోగులను మందలించడంతో తనపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. తాను ఎవరి పట్ల కూడా అసభ్యంగా ప్రవర్తించలేదని చెప్పారు.

రూ.300 కోట్లతో 'షూఆల్స్' ప్లాంట్!

750 ఎకరాల్లో ఏర్పాటు చేస్తాం.. 87 వేల మందికి ఉద్యోగావకాశాలు.. తెలంగాణలో భారీ పెట్టుబడులకు సిద్ధం

- మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీలో షూఆల్స్ చైర్మన్ లీ
- 5 వేల ఎకరాలు కేటాయిస్తే స్మార్ట్ హెల్త్ సిటీ ఏర్పాటు చేస్తామన్న కొరియా బృందం



తాము తయారు చేసిన మెడికల్ చిప్ షూను మంత్రి శ్రీధర్‌బాబుకు చూపిస్తున్న షూఆల్స్ చైర్మన్ చెవోంగ్ లీ, కంపెనీ ప్రతినిధులు

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని కొరియా కంపెనీ షూఆల్స్ ప్రకటించింది. ఈ కంపెనీ.. మెడికల్, స్మార్ట్ బూట్ల ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. 750 ఎకరాలు కేటాయిస్తే రూ.300 కోట్లతో అత్యాధునిక బూట్ల ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పుతామని కంపెనీ చైర్మన్ చెవోంగ్ లీ ప్రతిపాదించారు. ఆయన నేతృత్వంలోని కొరియన్ పారిశ్రామికవేత్తల బృందం గురువారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. తాము ఏర్పాటు చేయాలనుకుంటున్న ఫ్యాక్టరీతో 87 వేల మందికి ఉద్యోగావకాశాలు దక్కుతాయని లీ తెలిపారు. అడుగు భాగాన (సోల్) మెడికల్ చిప్ ఉండే బూట్లు, పది వేల అడుగులు వేస్తే గంటకు 25 వాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసే షూతో పాటు డయాబెటిస్, ఆర్థరైటిస్ ఉన్న వారికి ఉపశమనం, స్వస్థత కలిగించే పలు రకాల ఉత్పత్తులు తయారు చేస్తామని.. ఇందుకోసం 750 ఎకరాల భూమి అవసరమవుతుందని చెప్పారు. భారీ కర్మాగారం నెలకొల్పి ఇక్కడి నుంచే దేశీయ అవసరాలతోపాటు అమెరికా సహా ప్రపంచ మార్కెట్లకు బూట్లు సరఫరా చేస్తామని కంపెనీ ప్రతిపాదించినట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రపంచ మార్కెట్లకు తెలంగాణ హబ్‌గా మారుతుందన్నారు. అడుగు భాగాన జీపీఎస్ ఉండే బూట్ల వల్ల పిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా ట్రాక్ చేయొచ్చని అన్నారు. షూఆల్స్ అభ్యర్థనను అత్యంత ప్రాధాన్యమైనదిగా భావించి, నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అమెరికాలోని జాన్ హాప్కిన్స్ లాంటి ప్రఖ్యాత హాస్పిటళ్లను తీసుకురావడంతో పాటు పరిశోధన కేంద్రాలు, బయో మెడికల్ సెంటర్లు, యాన్సిలరీ పరిశ్రమల కోసం 5 వేల ఎకరాలు కేటాయిస్తే ఆసియాలో ఎక్కడా లేని విధంగా స్మార్ట్ హెల్త్ సిటీని నెలకొల్పే ప్రతిపాదన కూడా కొరియా బృందం చేసిందని శ్రీధర్‌బాబు తెలిపారు. స్మార్ట్ హెల్త్ సిటీ ఏర్పాటుతో లక్షల సంఖ్యలో ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటు చేసే పక్షంలో ఈ ప్రతిపాదనను పరిశీలిస్తామని మంత్రి తెలిపారు.

పెట్టుబడులకు రైన్లాండ్ ఆసక్తి: శ్రీధర్‌బాబు

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు జర్మనీలోని రైన్లాండ్ రాష్ట్రం ఆసక్తి కనబర్చిందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. రైన్లాండ్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ఆ రాష్ట్ర మంత్రి ష్మిట్ ఆధ్వర్యంలో శ్రీధర్‌బాబుతో భేటీ అయింది. ఈ సందర్భంగా రసాయనాలు, ఫార్మా, బయోటెక్నాలజీ, వ్యాక్సిన్లు, ప్యాకేజింగ్, పౌల్ట్రీ, వ్యవసాయం, ఆటోమొబైల్స్, లాజిస్టిక్స్ వంటి విభాగాల్లో భాగస్వాములవడం, పెట్టుబడులు పెట్టే అవకాశాలపై చర్చ జరిగింది. సులభతర వాణిజ్య విధానాలు, తక్షణ అనుమతుల జారీలో తెలంగాణ అగ్రగామిగా ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా పెట్టుబడులకు తెలంగాణ ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలుస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగే బయో ఏషియా-2025 సదస్సుకు రావాలని శ్రీధర్‌బాబు కోరారు. రైన్లాండ్, తెలంగాణ రాష్ట్రాలు ఇకపై 'సిస్టర్ స్టేట్' సహకార సంబంధాలు కలిగి ఉండాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. రైన్లాండ్‌ను సందర్శించాలని ష్మిట్ బృందం మంత్రిని ఆహ్వానించింది.

రాయదుర్గంలో టైమ్స్ స్క్వేర్!

హైదరాబాద్ రాయదుర్గం కూడలిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఐకానిక్ టైమ్స్ స్క్వేర్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్లను మంత్రి శ్రీధర్ బాబు సమీక్షించి పలు సూచనలు చేశారు. దీనిపై పలు సంస్థలు డిజైన్ చేసిన నిర్మాణాల ప్రెజెంటేషన్లను గురువారం మంత్రి సమక్షంలో ప్రదర్శించాయి. న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ తరహాలో 24 గంటలూ సందర్శకులను ఆకట్టుకునేలా టీ స్క్వేర్ రూపొందించాలని శ్రీధర్‌బాబు చెప్పారు. భారీ ఎలక్ట్రానిక్ డిస్ప్లేలు, డిజిటల్ ప్రకటనలతో ఆ ప్రాంతమంతా వెలుగులు విరజిమ్మాలని అభిప్రాయపడ్డారు. వ్యాపారం, వినోదం, పర్యాటకంతో సందర్శకులు ఉల్లాసంగా గడిపేలా ఉండాలని సూచించారు. 24 గంటలూ తెరిచి ఉండేలా యాంఫీ థియేటర్లు, ఓపెన్ రెస్టారెంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రత్యేక థీమ్‌తో కూడిన షాపింగ్ మాల్స్ ఉండాలన్నారు.

దక్షిణ మధ్య రైల్వేలో రూ.33 వేల కోట్లతో అభివృద్ధి పనులు

- అమృత్ భారత్‌లో రూ.2,635 కోట్లతో 40 రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నాం
- ఎంపీల భేటీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్/అడ్డగుట్ట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ.33 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. రూ.83 వేల కోట్లతో చేపట్టనున్న 15 ప్రాజెక్టుల 'ఫైనల్ లోకేషన్ సర్వే' జరుగుతోందని చెప్పారు. రూ.430 కోట్లతో అభివృద్ధి చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.720 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తవుతాయన్నారు. గురువారం రైల్ నిలయంలో రైల్వే ఉన్నతాధికారులు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఎంపీలతో జరిగిన సమీక్ష సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో, అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో రూ.650 కోట్లతో రైలు తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని, వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 40 స్టేషన్లను రూ.2,635 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ పొడగించాలని నిర్ణయించామని, పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేకుండానే వచ్చే రెండేళ్లలో ఎంఎంటీఎస్‌ను యాదాద్రి వరకు పొడగిస్తామన్నారు. దీంతో జంట నగరాల నుంచి యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ఎంఎంటీఎస్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.800 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం ట్రాక్ విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. గత ఆర్థిక సంవత్సరం జోన్ పరిధిలో 415 కి.మీ. అదనపు ట్రాక్‌ను జోడించినట్టు వివరించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ తెలంగాణలో గత పదేళ్లలో 67 కొత్త రైళ్లను ప్రవేశపెట్టామన్నారు. వీటిలో 5 వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు కూడా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 268 రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యూబీలు), 40 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్వోబీలు) నిర్మించామన్నారు.

రైల్వే పనుల్లో జాప్యంపై పలువురు ఎంపీల అసంతృప్తి

ఈ సమావేశంలో ఎంపీలు తమ నియోజకవర్గాల్లో చేపట్టిన రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. ప్రధానంగా కొత్త రైల్వే లైన్లు, బ్రిడ్జిల నిర్మాణం, రైళ్లకు అదనపు స్టాపేజీలతో పాటు ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపర్చాలని సూచించారు. కొల్లూరు ఈదులపల్లి సమీపంలో రైల్వే బ్రిడ్జి నిర్మించాలని 2016 నుంచి కోరుతున్నామని మెదక్ ఎంపీ రఘునందన్ తెలిపారు. హైదరాబాద్ సమీపంలోని ఈదుల నాగులపల్లి రైల్వే స్టేషన్‌ను చర్లపల్లి తరహాలో అభివృద్ధి చేయాలన్నారు. ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి ఇంకా పూర్తి కాలేదని, చాలావరకు ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని రైల్వే ప్రాజెక్టులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రాజ్యసభ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. హంద్రీ ఎక్స్‌ప్రెస్‌ను మళ్లీ నడపాలని కోరారు. లోకల్ రైళ్ల వేళలపై దృష్టి పెట్టాలని, ఏ రైలు ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి ఉందని రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి తెలిపారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు పెంచాలని ఎంపీ కడియం కావ్య, గరీబ్ రథ్‌తో పాటు ముఖ్యమైన రైళ్లను ఖమ్మంలో ఆపాలని ఎంపీ రఘురాంరెడ్డి కోరారు.

అమరావతికి రైలు మార్గం

ఎర్రుపాలెం-నంబూరు మధ్య 57కి.మీ మార్గం.. 2,245కోట్లతో ఆమోదించిన కేంద్రం

న్యూఢిల్లీ, గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అమరావతి 2.0. ఆరంభంలోనే కేంద్రం శుభవార్త చెప్పింది. రాజధాని అమరావతి రైలుమార్గానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం రూ. 2,245 కోట్లు మంజూరు చేసింది. గురువారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. అనంతరం రైల్వే నిలయంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్...కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌తో కలిసి తెలుగు మీడియాతో మాట్లాడారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, లావు శ్రీకృష్ణదేవరాయలతో మాట్లాడారు. రాబోయే నాలుగేళ్లలో అమరావతి రైలు మార్గాన్ని పూర్తిచేస్తామని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. "అమరావతి రాజధాని నిర్మాణం అనేది ఏపీ ప్రజల కలల ప్రాజెక్టు. అందుకే.. ఈ నగరాన్ని రైల్వేతో అనుసంధానం చేయాలని నిర్ణయం తీసుకున్నాం. నవ్యాంధ్ర తొలి సీఎంగా అప్పట్లోనే చంద్రబాబు.. అమరావతికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అది ఇప్పుడు, కూటమి ప్రభుత్వంలో సాకారం అవుతోంది" అని పేర్కొన్నారు. ఈ రైలుమార్గం నిర్మాణంతో అమరావతికి దేశంలోని అన్ని రాష్ట్రాలతో కనెక్టివిటీ వస్తుందని పేర్కొన్నారు. వాస్తవానికి, రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులను పురోగతిలోకి తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే పలు సమీక్షలు నిర్వహించారు. కేంద్ర రైల్వేమంత్రితో అనేక దఫాలు చర్చించారు. వీటన్నింటి ఫలితంగా అమరావతి మీదుగా ఎర్రుపాలెం - నంబూరు మధ్య నూతన రైలుమార్గాన్ని కేంద్ర కేబినెట్ ఎకనామిక్ ఎఫైర్స్ కమిటీ ఆమోదం తెలిపింది. 57 కిలోమీటర్ల పొడవున ఈ రైలుమార్గం నిర్మాణం జరగనుంది. దీని వలన 19 లక్షల మానవ పనిదినాలు జనరేట్ అవుతాయని, ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి తెలిపారు.

కొండపల్లికి మినహాయింపు

ఖమ్మం జిల్లా మధిరలోని ఎర్రుపాలెం - నంబూరు (అమరావతి) రైలుమార్గంలో కొండపల్లి రిజర్వు అటవీ ప్రాంతం కలవకుండా జాగ్రత్తలు తీసుకొన్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. పరిటాల వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్ నిర్మిస్తామని, దీని వల్ల సరుకు రవాణాకు అదొక హబ్‌గా మారుతుందన్నారు. పర్యావరణహితంగా ఈ రైలుమార్గం నిర్మాణం చేస్తారు.

కృష్ణానదిపై వంతెన నిర్మాణం

అమరావతి రైలుమార్గంలో 3.2 కిలోమీటర్ల పొడవున కృష్ణానదిపై వంతెన నిర్మిస్తారు. కొత్తపల్లి - వడ్డమాను గ్రామాల మధ్య దీనిని ఏర్పాటు చేస్తారు. హౌరా - చెన్నై మార్గంలో ఇప్పటికే ఉన్న బ్రిడ్జికి సమాంతరంగా మరొక బ్రిడ్జి అందుబాటులోకి వస్తుంది. ఇది ఎంతో క్లిష్టమైన పని అయినప్పటికీ రైలుమార్గంతో పాటే బ్రిడ్జీ నిర్మాణాన్ని కూడా చేపట్టనున్నట్లు రైల్వే మంత్రి పేర్కొన్నారు.

ఇతర రైలుమార్గాలతో సంధానం..

హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా వంటి పెద్ద నగరాలతో అనుసంధానిస్తూ అమరావతి రైల్వే ప్రాజెక్టును చేపట్టనున్నారు. మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులను కలుపుతూ రైల్వే లైను నిర్మాణం చేయనున్నారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మరింత ప్రయాణ సౌకర్యం కలగడంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. నంబూరు రైల్వేస్టేషన్ విజయవాడ - గుంటూరు/న్యూగుంటూరు సెక్షన్‌లో ఉన్నది. అలానే ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ విజయవాడ - ఖమ్మం సెక్షన్‌లో ఉంది. విజయవాడ - ఖమ్మం సెక్షన్ నుంచి బలార్ష, ఇటార్సీ, నాగ్‌పూర్, భోపాల్, ఢిల్లీకి కొత్త రైల్వే లైన్ అనుసంధానం అయి ఉంటుంది. అంతేకాకుండా అటు గుజరాత్ వైపునకు, ఇటు ఉత్తర్‌ప్రదేశ్‌కు కూడా ఈ మార్గంతో కనెక్టివిటీ ఉంది. నంబూరు రైల్వేస్టేషన్ నుంచి గుంటూరు మీదగా సికింద్రాబాద్, బెంగళూరుకు కనెక్టివిటీ ఉంది. న్యూగుంటూరు మీదగా తెనాలి నుంచి చెన్నై, బెంగళూరు, తిరువనంతపురం, కన్యాకుమారికి కూడా కనెక్టివిటీ ఉంది. దక్షిణ, మధ్య, ఉత్తర భారత్‌తో అనుసంధానం మరింత సులువు కానుంది. అమరావతిలో పరిశ్రమలు నెలకొల్పడానికి, ప్రజల రవాణాకు దోహదపడుతుందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

బాబు సాధించే వరకు ఊరుకోరు:అశ్వనీ వైష్ణవ్

అమరావతికి చల్లని కబురు చెప్పడానికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ చివరిలో నేతల మధ్య సరదా సంభాషణ సాగింది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అశ్వినీ వైష్ణవ్ రైల్వే మంత్రిగానే కాకుండా.. ఐటీ మంత్రిగా కూడా తనను తాను నిరూపించుకున్నారని, అందుకే వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారని చమత్కరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ... ఒరిజినల్ ఐటీ మ్యాన్ చంద్రబాబు నాయుడని కొనియాడారు. విజనరీ ఉన్న వ్యక్తిగా బాబును అభివర్ణించారు. "రైల్వే ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయాలని చంద్రబాబు అన్నారు కదా? సాధ్యమేనా" అని అశ్వినీ వైష్ణవ్‌ను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. చంద్రబాబు అనుకుంటే సాధించే వరకు ఊరుకోరని నవ్వుతూ సమాధానమిచ్చారు.

నాలుగు జిల్లాల్లో 500 నకిలీ పాస్‌పుస్తకాల విక్రయం!

- ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పేరిట అక్రమ దందా
- నలుగురు నిందితుల అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు
- 9 నకిలీ పాసుపుస్తకాలను స్వాధీనం చేసుకున్నాం
- ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్

ములుగు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఆర్వోఎఫ్ఆర్ పట్టాల తయారీ ఉదంతంపై విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఆరుగురు సభ్యులున్న ముఠా నాలుగు జిల్లాల్లో ఈ దందాను కొనసాగించినట్టు వెల్లడైంది. సుమారు 500కుపైగా నకిలీ పట్టాలను ఇప్పటికే విక్రయించినట్లు తెలుస్తోంది. ముఠాలోని నలుగురు సభ్యులను అరెస్టు చేసినట్లు గురువారం ములుగు డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మీడియాకు వివరాలను వెల్లడించారు. నకిలీ పాసుపుస్తకాల తయారీలో వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన చందావత్ భద్రు ప్రధాన సూత్రధారి అని చెప్పారు. వరంగల్‌లోని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు తాటిపాముల రాజు, మహబూబాబాద్ జిల్లా నెక్కొండకు చెందిన కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడు భూక్యా వెంకన్న, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లికి చెందిన అటవీ హక్కుల కమిటీ చైర్మన్ జాటోతు రాజ్‌కుమార్ అక్రమ దందాలో పాలుపంచుకున్నారని పేర్కొన్నారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని అటవీ గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్న చందావత్ భద్రు.. రైతుబంధు, పంట రుణాలను ఆశచూపి అమాయక రైతుల నుంచి రూ.50వేల చొప్పున వసూలు చేసి.. నకిలీ పాస్‌పుస్తకాలు ఇచ్చాడన్నారు. రైతుల ఫొటోలు, వివరాలను వాట్సాప్ ద్వారా పంపిస్తే వరంగల్‌లోని గణేష్ ప్రింటర్స్‌లో దాని యజమాని రాజు ఫొటోషాప్, పేజ్‌మేకర్‌లో పాస్‌బుక్కులను తయారుచేసి ముద్రించి విక్రయించారన్నారు. ఆయా జిల్లాలకు చెందిన కలెక్టర్లు, డీఎఫ్‌వోలు, ఐటీడీఏ పీవోల సంతకాలు, అక్షాంశ రేఖాంశాల వివరాలను ఒరిజినల్ పాస్‌పుస్తకాల నుంచి సేకరించి ఫేక్ పుస్తకాలపై ప్రింట్ చేశారని వివరించారు. కంప్యూటర్‌ను సీజ్ చేశామని, హోలోగ్రామ్‌లు, నకిలీ సిఫారసు లెటర్లు తయారుచేసిన బానోతు హరికిషన్, ధారావత్ కిషన్, మధ్యవర్తులు పరారీలో ఉన్నారని, వారినీ త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు. నకిలీ పట్టాలతో ఆయా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోందని, పోలీసుల సహకారంతో దర్యాప్తును ముమ్మరం చేశామని చెప్పారు. ఇప్పటి వరకు తొమ్మిది నకిలీ పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నామని డీఎఫ్‌వో తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే కిశోర్ భూ దందాలపై విచారణ జరపాలి

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ గ్యాంగ్‌స్టర్ నయీంతో కలిసి చేసిన భూ దందాలపై విచారణ జరపాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ డిమాండ్ చేశారు. కిశోర్ కథలన్నీ బయటకు తీస్తే ఆయన జైలుకు పోవడం ఖాయమని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సీఎల్‌పీ కార్యాలయంలో సామేల్ విలేకరులతో మాట్లాడారు. కిశోర్ తన స్థాయిని మించి మాట్లాడుతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి ఆయనకు లేదని అన్నారు. మరోసారి ఇష్టానుసారంగా మాట్లాడితే ఆయన నాలుక కోస్తామని హెచ్చరించారు. అలాగే కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిపైన మాట్లాడే అర్హత కిశోర్‌కు లేదని, కోమటిరెడ్డి తలుచుకుంటే ఆయన నల్లగొండలో అడుగుపెట్టలేరని అన్నారు. కిశోర్‌కు ఇచ్చిన డాక్టరేట్ పైన విచారణ జరపాలని, అక్రమ ఇసుక దందాలో ఆయనకు డాక్టరేట్ ఇచ్చి ఉండొచ్చని ఎద్దేవా చేశారు. ఎవరు అడ్డుపడినా మూసీ ప్రక్షాళన ఆగదని, ఆ విషయం గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్, హరీశ్‌రావుకు లేదని అన్నారు. ధర్నాచౌక్ ఎత్తేసిన వారు ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని సామేల్ మండిపడ్డారు.

భద్రాద్రి నుంచి హైదరాబాద్‌కు మాలల మహాపాదయాత్ర

- 38 రోజులు, 1000 కి.మీ, 16 జిల్లాలు, 35 నియోజకవర్గాల్లో యాత్ర
- నేడు భద్రాచలంలో ప్రారంభించనున్న మాజీ ఎంపీ హర్షకుమార్
- డిసెంబరు ఒకటో తేదీన హైదరాబాద్‌లో ముగియనున్న పాదయాత్ర
- యాత్ర ముగింపు రోజున మాలల మహా సంగ్రామసభ

భద్రాచలం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం మాలల మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు సాగే ఈ పాదయాత్రను శుక్రవారం భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద మాజీ ఎంపీ హర్షకుమార్ ప్రారంభిస్తారు. మొత్తం 38 రోజుల్లో 1,000 కి.మీ మేర, 16 జిల్లాలు, 35 నియోజకవర్గాల్లో ఈ పాదయాత్ర సాగనుంది. డిసెంబరు ఒకటో తేదీన యాత్ర ముగియనుంది. ఆఖరు రోజున హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి రవీంద్రభారతిలోని సభా స్థలి వరకు పాదయాత్ర చేపట్టనున్నారు. యాత్ర ముగింపును పురస్కరించుకొని మాలల మహా సంగ్రామసభ నిర్వహిస్తారు.

'బేర్' పట్టులో స్టాక్ మార్కెట్!

ఎఫ్‌పీఐల అమ్మకాల హోరు.. రూ.లక్ష కోట్లు వెనక్కి

సెన్సెక్స్, నిఫ్టీ మరింత పతనం?

ఇప్పటికే మదుపరుల సంపద రూ.29 లక్షల కోట్లు హాంఫట్



దేశీయ స్టాక్ మార్కెట్ 'బేర్'మంటోంది. ఈ నెల ఇప్పటి వరకు సెన్సెక్స్, నిఫ్టీ ఐదు శాతం వరకు నష్టపోయాయి. దీంతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల షేర్ల మార్కెట్ విలువ (మార్కెట్ క్యాప్) ఏకంగా రూ.29 లక్షల కోట్ల మేర తుడిచి పెట్టుకుపోయింది. స్వల్పమధ్య కాలంలో నిఫ్టీ 50 మరో 1,000 పాయింట్ల మేర నష్టపోయి 23,300 పాయింట్లకు చేరే ప్రమాదం ఉందన్న టెక్నికల్ అనలిస్టుల అంచనాలు, దేశీయ స్టాక్ మార్కెట్‌ను మరింత భయపెడుతున్నాయి.

అన్ని మద్దతు స్థాయిలు బ్రేక్

ప్రస్తుతం నిఫ్టీ 50 సూచీ అన్ని స్వల్ప, మధ్యకాలిక మద్దతు స్థాయిలను బ్రేక్ చేసింది. వంద రోజులు సగటు చలన స్థాయి (డీఎంఏ) అయిన 24,565 పాయింట్ల దిగువకు కూడా పడిపోవడం విశేషం. నిఫ్టీ 50 జీవితకాల గరిష్ఠ స్థాయి 26,277 పాయింట్ల నుంచి.. ఇప్పటి వరకు ఏడు శాతం (1,899 పాయింట్లు) నష్టపోయింది.

మార్కెట్ పతనానికి కారణాలు

ఎఫ్‌పీఐల గుడ్‌బై

నిన్న మొన్నటి వరకు విదేశీ పోర్టుఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ)కు దేశీయ స్టాక్ మార్కెట్ లాభాల గని. గత 11 నెలలుగా కొనసాగిన ర్యాలీతో ఈ సంస్థలు పెద్ద మొత్తంలో లాభాలు ఆర్జించాయి. తాజాగా ఈ సంస్థలకు భారత మార్కెట్ కంటే చైనా ఆకర్షణీయంగా కనిపిస్తోంది. దీంతో గత 20 రోజుల్లోనే ఎఫ్‌పీఐలు దేశీయ స్టాక్ మార్కెట్ నుంచి దాదాపు రూ.లక్ష పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. కొవిడ్ సమయంలో కూడా ఈ సంస్థలు ఇంత పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగలేదు. మార్కెట్ పతనానికి ఇదే ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఐపీఓల వెల్లువ

సెకండరీ మార్కెట్ ర్యాలీతో ఈ సంవత్సరం ప్రైమరీ మార్కెట్ కూడా ఊపందుకుంది. ప్రతి వారం ఎంతలేదన్నా సగటున నాలుగైదు పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) నిధుల సమీకరణ కోసం మార్కెట్‌కు వస్తున్నాయి. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఐపీఓల ద్వారా కంపెనీలు సమీకరించిన మొత్తం రూ.లక్ష కోట్లు మించింది. 2021 తర్వాత ఐపీఓ మార్కెట్‌కు ఇదే గోల్డెన్ పీరియడ్ అని చెప్పాలి. ఆ సంవత్సరం దేశీయ కంపెనీలు ఐపీఓల ద్వారా రికార్డు స్థాయిలో రూ.1.19 లక్షల కోట్లు సమీకరించాయి. లిస్టింగ్ లాభాలు అధికంగా ఉండడంతో రిటైల్ మదుపరులతో పాటు సంస్థాగత మదుపరులు సెకండరీ మార్కెట్లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరిపి ఆ మొత్తాన్ని ఐపీఓల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు.

నాలుగో రోజూ నష్టాలే

దేశీయ స్టాక్ మార్కెట్‌కు గురువారం కూడా పెద్దగా కలిసి రాలేదు. సెన్సెక్స్ 16.82 పాయింట్ల నష్టంతో 80,065.16 వద్ద, నిఫ్టీ 36.10 పాయింట్ల నష్టంతో 24,399.40 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ నిఫ్టీ నష్టాలతో ముగియడం వరుసగా ఇది నాలుగో రోజు. ఆరంభంలో కొద్దిపాటి లాభాలతో ప్రారంభమైనా మధ్యాహ్నం నుంచి ఆటో, ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు నష్టపోక తప్పలేదు.

పేలవమైన ఆర్థిక ఫలితాలు

లిస్టెడ్ కంపెనీలు ప్రకటిస్తున్న సెప్టెంబరు త్రైమాసిక (క్యూ2) ఆర్థిక ఫలితాలు ఏ మాత్రం ఆశాజనకంగా లేవు. ఆర్థిక పునాదులు ఎంత పటిష్ఠంగా ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరం కంపెనీల ఆదాయాలు సగటున 10 శాతానికి మించి పెరిగే అవకాశం లేదన్న అంచనాలు, మార్కెట్‌ను కుంగదీస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 16 శాతం తక్కువ.

అధిక వాల్యుయేషన్స్

గత 11 నెలలుగా కొనసాగిన ర్యాలీతో మంచి కంపెనీల షేర్లతో పాటు కొన్ని చిన్నా చితక కంపెనీల షేర్లూ వాటి స్థాయికి మించి పెరిగాయి. ముఖ్యంగా ఐపీఓ మార్కెట్లో ప్రత్యేకించి ఎస్ఎంఈ కంపెనీల షేర్ల లిస్టింగ్‌లో ఇది స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు ఈ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపిస్తోంది. మార్కెట్ పతనానికి ఇది కూడా ఒక కారణం.



రిలయన్స్‌తో ఎన్‌విడియా జట్టు

భారత్‌లో ఏఐ కంప్యూటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి

టాటా కమ్యూనికేషన్‌తోనూ అమెరికన్ టెక్ దిగ్గజం డీల్

ముంబై: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)తో అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం ఎన్‌విడియా కార్పొరేషన్ జట్టు కట్టింది. ఈ భాగస్వామ్యం ద్వారా భారత్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కంప్యూటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు ఇన్నోవేషన్ సెంటర్‌ను నిర్మించనున్నట్లు ఎన్‌విడియా కార్ప్ సీఈఓ జెన్సన్ హువాంగ్ వెల్లడించారు. అలాగే, ఎన్‌విడియా తన ఏఐ చిప్‌లను ఆర్ఐఎల్ సహా పలు భారత కంపెనీలకు సరఫరా చేయనుంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఒక గిగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్ కోసం రిలయన్స్.. ఎన్‌విడియాకు చెందిన అత్యాధునిక బ్లాక్‌వెల్ ఏఐ చిప్‌లను ఉపయోగించనుంది. అంతేకాదు, ఈ భాగస్వామ్యంలో భాగంగా రిలయన్స్ పలు అప్లికేషన్లను అభివృద్ధి చేసి, కస్టమర్లకు విక్రయించనుందని ముంబైలో గురువారం ప్రారంభమైన "ఎన్‌విడియా ఏఐ సదస్సు 2024"లో పాల్గొన్న సందర్భంగా హువాంగ్ తెలిపారు. ఈ సదస్సు మూడు రోజుల పాటు జరగనుంది.

ఎన్‌విడియా ఇప్పటికే హైదరాబాద్, బెంగళూరు, పుణె సహా భారత్‌లోని ఆరు ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. ఈ టెక్ దిగ్గజం పలు వ్యాపార సంస్థలు, క్లౌడ్ ప్రొవైడర్లు, స్టార్టప్‌తో కలిసి.. వేలాది అత్యాధునిక జీపీయూలు, హై పెర్ఫార్మెన్స్ నెట్‌వర్కింగ్ అండ్ ఏఐ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్స్ అండ్ టూల్స్‌తో కూడిన యాక్సిలరేటెడ్ కంప్యూటింగ్ స్టాక్ ద్వారా దేశంలో ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించనుంది. రిలయన్స్‌తో పాటు టాటా కమ్యూనికేషన్స్, హీరానందానీ గ్రూప్‌నకు చెందిన యోట్ట డేటా సర్వీసెస్‌తోనూ ఎన్‌విడియా డీల్ కుదుర్చుకుంది. ఈ రెండు కంపెనీల డేటా సెంటర్ల నిర్మాణం కోసం ఎన్‌విడియా హోపర్ ఏఐ చిప్‌లను సరఫరా చేయనుంది.

హిందీ ఏఐ మోడల్ విడుదల: ఎన్‌విడియా హిందీ భాషలో ఏఐ మోడల్‌ను ప్రవేశపెట్టింది. దేశీయ ఐటీ కంపెనీ టెక్ మహీంద్రా ఈ మోడల్‌ను తొలుత వినియోగించుకుందని, దీని సాయంతో ఇండస్ 2.0 అప్లికేషన్‌ను అభివృద్ధి చేసినట్లు ఎన్‌విడియా వెల్లడించింది.

ఏఐ ఎగుమతుల దేశంగా భారత్: అంబానీ

ఎన్‌విడియా ఏఐ సదస్సులో హువాంగ్, అంబానీతో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత్ ఏఐ పరివర్తన సామర్థ్యం, ఈ రంగంలో మన పాత్రపై చర్చ జరిగింది. ఎన్‌విడియా-రిలయన్స్ భాగస్వామ్యంలో ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధితో దేశీయ ఏఐ సామర్థ్యం పెరగడంతో పాటు ప్రపంచ మేధో విపణిలో భారత్‌ను కీలక దేశంగా నిలబెట్టనుందని అంబానీ అన్నారు. త్వరలోనే భారత్ అతిపెద్ద మేధో విపణిగా అవతరించనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అంతేకాదు, ప్రస్తుతం భారత్ ప్రపంచ దేశాలకు సాఫ్ట్‌వేర్, అంతర్జాతీయ కంపెనీలకు సారథులను (సీఈఓ) ఎగుమతి చేస్తోందని.. త్వరలోనే ఏఐ సేవల ఎగుమతుల దేశంగానూ అవతరించనుందన్నారు.

ఈ ఏడాదిలో 20 రెట్లు పెరగనున్న భారత్ కంప్యూటింగ్ సామర్థ్యం: హువాంగ్

ప్రపంచ కంప్యూటర్ పరిశ్రమకు భారత్ అత్యంత ప్రియమైన దేశమని.. ఐటీ ఇండస్ట్రీకి మూల కేంద్రమని హువాంగ్ అభివర్ణించారు. ఈ ఏడాదిలో భారత కంప్యూటింగ్ సామర్థ్యం 20 రెట్లు పెరగనుందన్నారు. ఏఐ సాంకేతికత వేగంగా పురోగతి చెందుతున్న నేపథ్యంలో ఇండస్ట్రీ అంతర్గత మార్పులకు లోనవుతోందన్నారు. ఇప్పటివరకు సాఫ్ట్‌వేర్ ఎగుమతుల హబ్‌గా ఉన్న భారత్.. ఏఐ ఎగుమతుల్లో అగ్రగామిగా నిలవనుందన్నారు.

టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోతోనూ భాగస్వామ్యం: దేశీయ ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోతోనూ ఎన్‌విడియా జత కట్టింది. టీసీఎస్ తన కస్టమర్లు ఏఐ సాంకేతికతను వేగంగా, విస్తృతంగా వినియోగించుకునేందుకు వీలుగా ఎన్‌విడియా భాగస్వామ్యం ద్వారా ఇండస్ట్రీ ఆధారిత పరిష్కారాలు, ఆఫరింగ్స్‌ను విడుదల చేసింది.

46% తగ్గిన లారస్ ల్యాబ్స్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లారస్ ల్యాబ్స్. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం ఏకంగా 46 శాతం క్షీణించి రూ.20 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.37 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం యథాతథంగా రూ.1,224 కోట్లుగా ఉంది.

పెరిగిన జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ నష్టాలు

సెప్టెంబరు త్రైమాసికంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్) నష్టాలు మరింతగా పెరిగాయి. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నష్టాలు రూ.190 కోట్ల నుంచి రూ.429 కోట్లకు పెరిగాయి. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.2,162 కోట్ల నుంచి రూ.2,598 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో కంపెనీ వడ్డీ, ఫైనాన్స్ చార్జీలు రూ.673 కోట్ల నుంచి రూ.1,031 కోట్లకు పెరగటం ప్రభావం చూపించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,470 ▼	72,850 ▼	1,10,000 ▼
ముంబై	78,246 ▼	71,673 ▼	97,493 ▼

కోరమాండల్ ఇంటర్నేషనల్ రూ.800 కోట్ల పెట్టుబడులు

కాకినాడ, అంకలేశ్వర్‌లో కొత్త ప్లాంట్ల ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. రూ.800 కోట్ల పెట్టుబడితో పెద్ద ఎత్తున విస్తరణ కార్యకలాపాలు చేపడుతున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, కాకినాడలో గ్రాన్యులేషన్ ప్లాంట్‌ను నెలకొల్పటంతో పాటు గుజరాత్‌లోని అంకలేశ్వర్‌లో పెస్టిసైడ్స్ కోసం ప్రత్యేక ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. విస్తరణలో భాగంగా కాకినాడలోని కాంప్లెక్స్ ప్రత్యేక ఎరువుల తయారీ ప్లాంట్‌లో కొత్తగా ఏటా 7.5 లక్షల టన్నుల సామర్థ్యంతో గ్రాన్యులేషన్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఈ కొత్త లైన్‌తో కాకినాడ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం మొత్తం 30 లక్షల టన్నులకు చేరుకుంటుందని పేర్కొంది. అలాగే సెనెగల్‌లోని బావోబాబ్ మైనింగ్ కెమికల్ కార్పొరేషన్ (బీఎంసీసీ)లో పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది.

క్యూ2 లాభం రూ.696 కోట్లు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికం (క్యూ2)లో కంపెనీ స్టాండ్అలోన్ ప్రాతిపదికన రూ.7,509 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.696 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.7,031 కోట్లుగా ఉండగా లాభం రూ.762 కోట్లుగా ఉంది.

సైయెంట్ లాభంలో స్వల్ప వృద్ధి

సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో సైయెంట్ లిమిటెడ్ రూ.177 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం స్వల్పంగా 2.3 శాతం పెరిగింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రెవెన్యూ మాత్రం 1.8 శాతం క్షీణించి రూ.1,450 కోట్లుగా నమోదైంది. కరెన్సీలో హెచ్చుతగ్గుల కారణంగా రెవెన్యూ స్వల్పంగా తగ్గిందని కంపెనీ పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	540
వరంగల్	517	గోదావరి	535
చిత్తూరు	578	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	128
కరీంనగర్	120	ఒంగోలు	128
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	126
కర్నూలు	120	నెల్లూరు	126
విశాఖపట్నం	115	అనంతపురం	126
గోదావరి	130		

రాబోయే 20 ఏళ్లలో 4,000 కొత్త విమానాలు కావాలి

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ: భారత విమానయాన పరిశ్రమకు అపార వృద్ధి అవకాశాలున్నాయని, రాబోయే 20 ఏళ్లలో దేశంలోని విమానయాన సంస్థలకు అదనంగా 4,000 విమానాలు అవసరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. అదే కాలంలో దేశంలో కొత్తగా 200 విమానాశ్రయాలను అభివృద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం వివిధ విమానయాన సంస్థల వద్ద 800 విమానాలుండగా 1,200 విమానాలకు ఆర్డర్లున్నాయి. గత 10 ఏళ్లలో విమానాశ్రయాల సంఖ్య రెట్టింపై 157కి చేరింది. రాబోయే ఐదేళ్లలో మరో 50 విమానాశ్రయాలు అందుబాటులోకి రానున్నాయి. భారత్ ప్రపంచంలోనే త్వరితగతిన వృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్ అని.. ఈ రంగ అభివృద్ధితో కొత్త ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయన్నారు.

స్పోర్ట్స్



రాధా యాదవ్ (3/35)

అదరగొట్టిన అమ్మాయిలు

- పడగొట్టిన రాధ, సైమా
- తొలి వన్డేలో భారత్ గెలుపు
- 59 పరుగులతో కివీస్ ఓటమి

భారత్: 44.3 ఓవర్లలో 227 ఆలౌట్ (తేజల్ 42, దీప్తి 41; అమేలియా 4/42, జెస్ 3/49). **కివీస్:** 40.4 ఓవర్లలో 168 ఆలౌట్ (బ్రూక్ 39, గ్రీన్ 31; రాధ 3/35)

అహ్మదాబాద్: బౌలర్లు, ఫీల్డర్లు రాణించడంతో.. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భారత మహిళల జట్టు బోణీ చేసింది. తేజల్ హసాబ్నిస్ (42), దీప్తి శర్మ (41) బ్యాట్‌తో ఆదుకోగా.. రాధా యాదవ్ (3/35), సైమా ఠాకూర్ (2/26) ప్రత్యర్థిని కట్టడి చేశారు. దీంతో గురువారం జరిగిన మొదటి మ్యాచ్‌లో భారత్ 59 పరుగుల తేడాతో కివీస్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 44.3 ఓవర్లలో 227 పరుగులకు ఆలౌటైంది. కెర్ సిస్టర్స్ అమేలియా 4 వికెట్లు, జెస్ 3 వికెట్లు పడగొట్టారు. తాత్కాలిక కెప్టెన్ స్మృతి మంధాన (5), షఫాలీ వర్మ (33), హేమలత (3), యాస్తిక (37) అవుట్ కావడంతో.. భారత్ 91/4తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో తొలి మ్యాచ్ ఆడుతున్న తేజల్, జెమీమా రోడ్రిగ్స్ (35) ఐదో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అనంతరం ఛేదనలో న్యూజిలాండ్ 40.4 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. బ్రూక్ (39), మ్యాడీ గ్రీన్ (31) ఐదో వికెట్‌కు 49 పరుగులు జోడించారు. ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన సైమా.. తాను వేసిన మూడో బంతికే సుజి బేట్స్ (1)ను క్యాచవుట్ చేసింది.

హాకీకి రాణి వీడ్కోలు



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు మాజీ కెప్టెన్ రాణీ రాంపాల్ (29) సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. హరియాణాలోని కుగ్రామానికి చెందిన ఓ రిక్షా కార్మికుడి కూతురైన రాణి.. హాకీలో అత్యున్నత స్థాయికి చేరుకొని ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. గాయాల కారణంగా ఆటకు దూరమైన రాంపాల్ ఆ తర్వాత జట్టులో సుస్థిర స్థానాన్ని సాధించలేక పోయింది. ఈ క్రమంలో 16 ఏళ్ల కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ఆమె ప్రకటించింది. 2021 టోక్యో విశ్వ క్రీడల్లో రాణి సారథ్యంలోని భారత్ నాలుగో స్థానంతో అత్యుత్తమ ప్రదర్శన చేసింది. రాంపాల్ గౌరవార్థం ఆమె ధరించిన '28' నెంబర్ జెర్సీకి కూడా రిటైర్మెంట్ ఇస్తున్నట్టు హాకీ ఇండియా తెలిపింది. బహుమతిగా ఆమెకు రూ.10 లక్షల నజరానాను అందజేసింది. 14 ఏళ్ల పిన్నవయసులో 2008లో అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. 254 మ్యాచ్‌ల్లో 205 గోల్స్ సాధించింది. 2020లో ప్రభుత్వం ఖేల్‌రత్న అవార్డుతోపాటు పద్మశ్రీతో సత్కరించింది.

ధ్యాన్‌చంద్‌కాదు..'అర్జున లైఫ్‌టైమ్' పురస్కారం

న్యూఢిల్లీ: ధ్యాన్‌చంద్ పేరిట క్రీడాకారులకు ఇస్తున్న జీవన సాఫల్య పురస్కారం పేరును మారుస్తున్నట్టు కేంద్ర క్రీడాశాఖ గురువారం ప్రకటించింది. ఈ ఏడాదినుంచి ధ్యాన్‌చంద్ అవార్డును అర్జున జీవన సాఫల్య పురస్కారంగా అందజేయనున్నట్టు తెలిపింది. క్రీడా అవార్డుల హేతుబద్ధీకరణలో భాగంగా ఈ మార్పు చేసినట్టు వివరించింది.

వచ్చాడు.. పడగొట్టాడు

7 వికెట్లతో దెబ్బతీసిన సుందర్

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 259

రచిన్, కాన్వే అర్ధసెంచరీలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 16/1

కివీస్‌తో సిరీస్ కోసం ప్రకటించిన భారత జట్టులో మొదట అతడికి చోటే దక్కలేదు.. తొలి టెస్టు ఓటమి తర్వాత అనూహ్యంగా జట్టులోకి వచ్చాడు..అంతేకాదు.. ఏకంగా కుల్దీప్ స్థానంలోనే బెర్త్ దక్కించుకున్నాడు వాషింగ్టన్ సుందర్. అయినా అతడి ఎంపికపై ఉదయం నుంచి విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. వీటన్నింటినీ పటాపంచలు చేస్తూ యాజమాన్యం తనపై పెట్టుకున్న అంచనాలను వమ్ము చేయకుండా చెలరేగాడు. కీలక రచిన్ సహా చివరి ఏడుగురు బ్యాటర్లు అతడి స్పిన్ ఉచ్చుకు చిక్కడంతో తొలి రోజే వారి ఆటకు చెక్ పడింది.



సుందర్ (7/59)

పుణె: ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ (7/59) తన ఎంపికకు న్యాయం చేశాడు. మూడున్నరేళ్ల తర్వాత టెస్టు మ్యాచ్ ఆడుతున్నప్పటికీ సుడులు తిరిగే బంతులతో పటిష్ఠంగా కనిపిస్తున్న న్యూజిలాండ్‌ను కట్టడి చేశాడు. తద్వారా అతడి దెబ్బకు మొదటి రోజు గురువారం కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులకు ఆలౌటైంది. కాన్వే (76), రచిన్ రవీంద్ర (65) అర్ధసెంచరీలు సాధించారు. చివర్లో శాంట్నర్ (33) పోరాడే ప్రయత్నం చేశాడు. అశ్విన్ మిగతా 3 వికెట్లు తీశాడు. ఆ తర్వాత బరిలోకి దిగిన భారత్‌ను సైతం కివీస్ బౌలర్లు ఇబ్బందిపెట్టారు. ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లలో 16/1 పరుగులు మాత్రమే చేసింది. క్రీజులో యశస్వీ జైస్వాల్ (6 బ్యాటింగ్), గిల్ (10 బ్యాటింగ్) ఉన్నారు. ఆదిలోనే రోహిత్ డకౌటయ్యాడు. పేసర్ సౌథీ ఓవర్‌లో డిఫెన్స్ ఆడే ప్రయత్నం చేయగా.. బంతి ప్యాడ్‌ను తాకుతూ బెయిల్స్‌ను గిరాటేసింది. తొలి రోజు ఆటలో పేసర్‌కు దక్కిన ఏకైక వికెట్ ఇదే.

కాన్వే-రచిన్ నిలకడ: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఆరంభంలో మెరుగ్గానే ఆడింది. భారత పిచ్‌లపై ఇబ్బందిపడని ఓపెనర్ కాన్వేతో పాటు రచిన్ రవీంద్ర మరోసారి అర్ధసెంచరీతో కీలకంగా నిలిచారు. ఈ ఇద్దరూ క్రీజులో ఉన్నంతసేపు జట్టు పటిష్ఠంగానే కనిపించింది. కానీ స్పిన్నర్లు అశ్విన్, సుందర్ కివీస్ వికెట్లను పంచేసుకున్నారు. తొలి మూడు వికెట్లతో అశ్విన్ కివీస్ పతనానికి ద్వారాలు తీయగా.. ఇక సుందర్ సుడులు తిరిగే బంతులకు మిగతా బ్యాటర్లంతా పెవిలియన్ బాట పట్టారు. కాన్వే తొలివికెట్‌కు లాథమ్ (15)తో కలిసి 32, రెండోవికెట్‌కు యంగ్ (18)తో కలిసి 44 రన్స్ జోడించాడు.

1 — ఓ ఇన్నింగ్స్‌లో ఎక్కువ మంది (5)ని బౌల్డ్ చేసిన ఐదో భారత బౌలర్‌గా సుందర్. గతంలో జాసూభాయ్ పటేల్, బాపు నాదకర్ణి, కుంబ్లే, జడేజా ఈ ఘనత సాధించారు. టెస్టు కెరీర్‌లో 5+ వికెట్లు తీయడం సుందర్‌కిదే మొదటిసారి.

సుందర్ దెబ్బతో..: రెండో సెషన్‌లో కాన్వే-రచిన్ భారత బౌలర్లపై ఆధిపత్యం చూపారు. మూడో వికెట్‌కు 62 పరుగులు జత చేరాక కాన్వేను అశ్విన్ అవుట్‌చేశాడు. అయితే రచిన్ మాత్రం మిచెల్ (18)తో కలిసి ఎదురుదాడికి దిగాడు. అప్పటికే 13 ఓవర్లు వేసినా వికెట్ తీయలేని సుందర్.. ఓ అద్భుత రిప్పర్ బాల్‌తో రచిన్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆఫ్‌సైడ్‌లో వేసిన బంతి అవుట్‌సైడ్ ఎడ్జ్ తీసుకుంటూ అతడి వికెట్లను పడగొట్టిన తీరు వహ్వా అనిపించింది. అంతే.. అక్కడి నుంచి అంతా సుందర్‌దే హవా. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్‌ను అతనే వెనక్కిపంపాడు. మరోవైపు శాంట్నర్ ఒంటరి పోరాటం చేస్తూ ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు. సుందర్ 7 వికెట్లలో ఐదుగురు బౌల్డ్ కావడం విశేషం.

చరిత్ర సృష్టించిన అర్జున్

2800 ఎలో రేటింగ్ సాధించిన రెండో ఆటగాడిగా రికార్డు



న్యూఢిల్లీ: తెలుగుతేజం అర్జున్ ఇరిగేసి చరిత్ర సృష్టించాడు. చెస్‌లో 2800 ఎలో రేటింగ్ పాయింట్లు సాధించిన పిన్నవయస్కుడైన భారతీయుడిగా రికార్డు పుటల్లోకెక్కాడు. ఇంతకుముందు విశ్వనాథన్ ఆనంద్ మాత్రమే ఈ రేటింగ్ పాయింట్లను సాధించాడు. సెర్బియాలో జరుగుతున్న యూరోపియన్ చెస్ క్లబ్ కప్‌లో ఆల్కలాయిడ్ జట్టుకు ఆడుతున్న అర్జున్ గురువారం ఐదో రౌండ్‌లో దిమిత్రీ ఆండ్రీకిన్ (రష్యా)ను ఓడించడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. ప్రపంచ చెస్‌లో 2800 పాయింట్ల మైలురాయిని చేరిన 16వ ఆటగాడు అర్జున్. కాగా ప్రస్తుతం అర్జున్ ఖాతాలో 2802.1 పాయింట్లున్నాయి.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) అశ్విన్ 15; కాన్వే (సి) పంత్ (బి) అశ్విన్ 76; యంగ్ (సి) పంత్ (బి) అశ్విన్ 18; రవీంద్ర (బి) సుందర్ 65; మిచెల్ (ఎల్బీ) సుందర్ 18; బ్లండెల్ (బి) సుందర్ 3; ఫిలిప్స్ (సి) అశ్విన్ (బి) సుందర్ 9; శాంట్నర్ (బి) సుందర్ 33; సౌథీ (బి) సుందర్ 5; ఎజాజ్ (బి) సుందర్ 4; ఓరోర్క్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 79.1 ఓవర్లలో 259 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-32, 2-76, 3-138, 4-197, 5-201, 6-204, 7-236, 8-242, 9-252, 10-259; **బౌలింగ్:** బుమ్రా 8-2-32-0; ఆకాశ్ 6-0-41-0; అశ్విన్ 24-2-64-3; సుందర్ 23.1-4-59-7; జడేజా 18-0-53-0

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 6; రోహిత్ (బి) సౌథీ 0; గిల్ (బ్యాటింగ్) 10; **ఎక్స్‌ట్రాలు:0, మొత్తం:11 ఓవర్లలో16/1. వికెట్ పతనం:**1-1. **బౌలింగ్:** సౌథీ 3-1-4-1; ఓరోర్క్ 3-2-5-0;ఎజాజ్ 3-1-5-0; శాంట్నర్ 2-0-2-0.

3 — కివీస్‌తో జరిగిన టెస్టుల్లో ఉత్తమ గణాంకాలు (7/59) నమోదు చేసిన మూడో బౌలర్‌గా అశ్విన్‌తో సమంగా నిలిచిన సుందర్. వెంకట్రాఘవన్ (8/72), ప్రసన్న (8/76) ముందున్నారు.

6 — భారత్‌లో జరిగిన టెస్టుల్లో తొలి రోజు ఇన్నింగ్స్‌లో స్పిన్నర్లు 10 వికెట్లు తీయడం ఇది ఆరోసారి.

విరాట్‌ను కాదని..

కివీస్ తొలి ఇన్నింగ్స్ 25వ ఓవర్ (జడేజా బౌలింగ్)లో ఓపెనర్ కాన్వే ఎల్బీపై భారత్ అప్పీల్ చేసినా అంపైర్ స్పందించలేదు. దీంతో కెప్టెన్ రోహిత్ డీఆర్ఎస్‌కు వెళ్దామనుకున్నాడు. అయితే అదే సమయంలో అక్కడి వచ్చిన విరాట్ రిప్లేకి వెళ్లవద్దంటూ చెప్పబోయేంతలోనే రోహిత్ డీఆర్ఎస్‌కు సిగ్నల్ ఇచ్చేశాడు. దీంతో కోహ్లీ సైలెంట్ అయిపోయాడు. తీరా రీప్లేలో బంతి లెగ్ స్టంప్‌ను మిస్ అవుతూ నాటౌట్‌గా తేలింది.

మనోళ్లు గెలిచారుకానీ..

షూటౌట్‌లో పరాజయం — జర్మనీదే హాకీ సిరీస్



న్యూఢిల్లీ: హర్మన్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్ చెరో రెండేసి గోల్స్‌తో అదరగొట్టిన వేళ..జర్మనీతో గురువారం ఇక్కడ జరిగిన రెండో హాకీ టెస్ట్‌లో భారత్ 5-3తో విజయం సాధించింది. అయితే రెండు మ్యాచ్‌ల ద్వైపాక్షిక సిరీస్ విజేతను తేల్చేందుకు షూటౌట్ నిర్వహించాల్సి వచ్చింది. షూటౌట్‌లో..వరల్డ్ చాంపియన్ జర్మనీ 3-1తో నెగ్గి ట్రోఫీ దక్కించుకుంది. తొలి టెస్ట్‌లో భారత్ ఓడిన విషయం తెలిసిందే. ఇక మజ్కోర్ (7, 57ని.) చేసిన గోల్స్‌తో మొదట జర్మనీ ఆధిక్యం ప్రదర్శించింది. ఆపై హెన్రిక్ (60) మరో గోల్ చేశాడు. రెండో అర్ధ భాగంలో సుఖ్‌జీత్ (34, 48), హర్మన్ (42, 43), అభిషేక్ (45) గోల్స్ సాధించడంతో భారత్ విజయాన్నందుకుంది. అయితే షూటౌట్‌లో మనోళ్లు 1-3తో చిత్తయ్యారు. హర్మన్, అభిషేక్, రాహీల్ విఫలంకాగా, ఆదిత్య మాత్రమే గోల్ చేయగలిగాడు.

బెంగాల్ శుభారంభం

హైదరాబాద్ : ప్రో కబడ్డీ లీగ్ సీజన్ 11లో బెంగాల్ వారియర్స్ శుభారంభం చేసింది. గురువారం ఇక్కడి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తమ తొలిమ్యాచ్‌లో బెంగాల్ 32-29తో యూపీ యోధాస్‌పై గెలిచింది. హ్యాట్రిక్ విజయంపై కన్నేసి బరిలోకి దిగిన యోధాస్‌ను మూడు పాయింట్ల తేడాతో బెంగాల్ ఓడించింది. బెంగాల్ రైడర్లు మణిందర్ సింగ్ (8 పాయింట్లు), నితిన్ (7), సుశీల్ (7) సమష్టిగా రాణించి జట్టును గెలిపించారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 37-25 పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలుపొందింది.

దక్షిణాఫ్రికా.. దశాబ్దం తర్వాత..!

- బంగ్లాపై 7 వికెట్లతో విజయం

చెలరేగిన రబాడ

మిర్పూర్: పేసర్ రబాడ (6/46) చెలరేగడంతో.. బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో సౌతాఫ్రికా 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ క్రమంలో దశాబ్దం తర్వాత ఆసియాలో తొలి విజయాన్ని నమోదు చేసింది. ఆటకు నాలుగో రోజైన గురువారం ఓవర్‌నైట్ స్కోరు 283/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 307 పరుగులకు ఆలౌటై దక్షిణాఫ్రికా ఎదుట 106 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 22 ఓవర్లలో 106/3 స్కోరు చేసి గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 106 రన్స్ చేయగా.. దక్షిణాఫ్రికా 308 పరుగులు సాధించింది.

'ఆరే'సిన సాజిద్

ఇంగ్లండ్ 267 ఆలౌట్

రావల్పిండి: ఆఫ్ స్పిన్నర్ సాజిద్ ఖాన్ (6/128) మరోసారి చెలరేగి ఆరు వికెట్లు పడగొట్టడంతో పాకిస్థాన్‌తో గురువారం మొదలైన మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 267 పరుగులకే ఆలౌటైంది. సాజిద్, మరో స్పిన్నర్ నోమన్ ధాటికి పర్యాటక జట్టు ఓ దశలో 118/6 స్కోరుతో కష్టాల్లో పడింది. అయితే కీపర్ జేమీ స్మిత్ (89), అట్కిన్సన్ (39) ఏడో వికెట్‌కు 105 పరుగులు జోడించడంతో ఇంగ్లండ్ కోలుకుంది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన పాకిస్థాన్ తొలి రోజు ఆఖరికి 73/3 స్కోరుతో నిలిచింది. కాగా పాకిస్థాన్ జట్టు తమ పేసర్ ఆమెర్ జమాల్‌తో ఒక్క ఓవర్‌కూడా బౌలింగ్ చేయించలేదు. ఓ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో పేస్ బౌలర్‌తో బౌలింగ్ వేయించకపోవడం టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇది రెండోసారి మాత్రమే. మొదటిసారి 1882లో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా ఇలాగే చేసింది.

నేడు సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

» ఒక్కో కార్మికునికి రూ.93,750 చెల్లింపు

కొత్తగూడెం/హైదరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా పీఎల్ఆర్ఎస్ (ప్రొడక్షన్ లింక్డ్ రివార్డు స్కీం) బోనస్‌ను శుక్రవారం సింగరేణి కార్మికులకు చెల్లించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రూ.358 కోట్లను విడుదల చేయాలని సింరేణి సీఎండీ బలరాంను ఆదేశించారు. గురువారం ఆయన సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ప్రస్తుతం ప్రకటించిన మొత్తం రూ.50కోట్లు అధికం కావడం విశేషం. బోనస్ కింద ఒక్కో కార్మికుడు రూ.93,750 అందుకోనున్నారు. సింగరేణిలో పనిచేస్తున్న 40వేల మంది కార్మికులు లబ్ధి పొందనున్నారు. కాగా, ఇటీవల సింగరేణి ఉద్యోగులందరికీ 33% లాభాల వాటా కింద రూ.796కోట్లను కంపెనీ చెల్లించిన విషయం తెలిసిందే. ఒక్కో కార్మికుడికి సగటున రూ.1.90లక్షలు అందాయి. పండుగ అడ్వాన్స్ కింద ఒక్కో కార్మికుడికి రూ.25వేల చొప్పున మరో రూ.90 కోట్లను చెల్లించారు. లాభాల వాటా, పండుగ అడ్వాన్స్, దీపావళి బోనస్ కలిపి నెల వ్యవధిలో కార్మికులకు సంస్థ రూ.1250కోట్లను చెల్లించింది. సగటున ఒక్కో ఉద్యోగి రూ.3లక్షల వరకు ప్రయోజనం పొందినట్లు సీఎండీ బలరాం తెలిపారు.



సీఎంఆర్ఎఫ్‌కు రూ.కోటి విరాళం

» అందించిన బ్యాంక్ ఆఫ్ బరోడా

హైదరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి సహాయనిధికి బ్యాంక్ ఆఫ్ బరోడా తరఫున రూ.కోటి విరాళం ప్రకటించారు. సంబంధిత చెక్కును బ్యాంకు జనరల్ మేనేజర్ రితేష్‌కుమార్, డీజీఎం సుధాకర్ గురువారం జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అందజేశారు.

రాష్ట్రంలోనే సొంతంగా సీడ్ గార్డెన్: తుమ్మల



మలేషియాలోని సీడ్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సొంతంగా సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని, అందుకు ఎఫ్‌జీవీ కంపెనీ సహకారం కూడా కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. మలేషియా పర్యటనలో ఉన్న మంత్రి గురువారం ఎఫ్‌జీవీ కంపెనీ నిర్వహిస్తున్న సీడ్ గార్డెన్, నర్సరీలతో పాటు అధునాతన పద్ధతుల్లో నిర్వహిస్తున్న విత్తన కేంద్రాన్ని సందర్శించి, ఆ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. ఇప్పటికే ఎఫ్‌జీవీ కంపెనీ నుంచి తెలంగాణకు సీడ్ లింగ్స్‌ను తెప్పించామని, భవిష్యత్తులో రాష్ట్రంలోనే సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటు చేస్తామని, అందుకు సహకారం కావాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కంపెనీ ప్రతినిధులు సీడ్‌గార్డెన్ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

రాష్ట్రంలో 5 క్యాన్సర్ చికిత్స కేంద్రాల ఏర్పాటు

» షుగర్, బీపీ, క్యాన్సర్ నియంత్రణకు పాలసీ: దామోదర

» వైద్య విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాలి: కొండా సురేఖ

మెదక్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం ఐదు చోట్ల చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. గురువారం మెదక్‌లో నూతన ప్రభుత్వ వైద్య కళాశాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీపీ, షుగర్, హార్ట్, కాన్సర్ వ్యాధిగ్రస్తులు నానాటికీ పెరుగుతున్నట్లు అధ్యయనాలు తెలుపుతున్నాయని, వీటి నియంత్రణకు ప్రత్యేక పాలసీ రూపొందిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లోని ఎంఎంజే ఆస్పత్రిని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల వెంట 74 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. మంత్రి కొండాసురేఖ మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని అలవర్చుకోవాలని, చిన్న చిన్న విషయాలకే మనస్తాపం చెందొద్దని సూచించారు.

40% వైకల్యమున్నా బ్యాటరీ వీల్ చైర్లు

» ప్రతి నెలా రెండు సార్లు గ్రీవెన్స్: కార్పొరేషన్ చైర్మన్

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గతంలో 75%పైబడి వైకల్యం ఉన్నవారికి మాత్రమే అందించే ప్రయోజనాలను ఇకపై 40% వైకల్యమున్న వారికి కూడా అందించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్ బోర్డు సమావేశంలో చేసిన తీర్మానాలను ఆయన గురువారం మీడియాకు వెల్లడించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవన్‌లో ప్రతినెలా రెండు సార్లు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఉద్యోగులకు 2 డీఏలు!

(మొదటిపేజీ తరువాయి)

చూపేందుకు భట్టి నేతృత్వంలో మరో ఉప సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఇందులో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు సభ్యులుగా, ప్రత్యేక ఆహ్వానితుడిగా ప్రభుత్వ సలహాదారు కేశవరావు ఉంటారని చెప్పారు. ఈ కమిటీ దీపావళి తరువాత ఉద్యోగులతో శాఖల వారీగా సమావేశం అవుతుందని, ఆర్థికేతర అంశాలను వెంటనే పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. గురువారం ఆయన, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి రెండు బృందాలుగా వచ్చిన ఉద్యోగ సంఘాల నేతలతో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం సమావేశమయ్యారు. తొలి బృందంలో 45 మంది రాగా, రెండో బృందంలో 20 మంది వచ్చారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ప్రతిపాదించిన 50 డిమాండ్లపై ఆయా సంఘాల ప్రతినిధుల వాదనలు ఓపికగా విన్నారు. పదమూడేళ్ల తర్వాత తొలిసారిగా ముఖ్యమంత్రి సుదీర్ఘ సమయం ఉద్యోగ సంఘాల నేతలతో కూర్చొని చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ ఉద్యోగులు తీసుకొచ్చిన ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం పెంచేందుకే ఒకటో తేదీన వేతనాలు ఇస్తున్నామని ప్రస్తావించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ సమావేశం అందుకు తొలిమెట్టని చెప్పారు. ఐదు డీఏలు పెండింగులో ఉన్నాయని ఉద్యోగులు సీఎం దృష్టికి తెచ్చారు. నాలుగు ఇవ్వాలని కోరారు. తక్షణం మూడైనా ఇవ్వాలని పట్టుబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేదని, ఉద్యోగులు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రతి నెలా రూ.22 వేల కోట్ల ఖర్చులు ఉంటే ప్రభుత్వ రాబడి రూ.18 వేల కోట్లే ఉందని ప్రస్తావించారు. ఆదాయం తగ్గిందని, రూ.4 వేల కోట్ల లోటు ఉందని ఆర్థిక పరమైన ఇబ్బందులను ఉద్యోగులకు వివరించారు. నెలవారీ వేతనాలకు రూ.6,800 కోట్లు, అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు రూ.6,500 కోట్లు ఇవ్వాల్సి వస్తోందని గుర్తు చేశారు. కొత్తగా ఉద్యోగులు రావడం, జీఎస్టీ, ఎక్సైజ్ ఆదాయం ఆశించిన మేర పెరగక పోవడం, రైతుల రుణ మాఫీ చెల్లింపులు, ఇంకా కొన్ని హామీలు అమలు చేయాల్సి ఉండటం వంటివి ఉద్యోగుల దృష్టికి తీసుకొచ్చారు. వచ్చే ఏడాది మార్చి వరకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఉద్యోగులు చెబుతున్నారు. ఐకాస 50 డిమాండ్లలో ఆర్థికేతర అంశాలన్నీ పరిశీలించి ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. 317 జీవోకి సంబంధించి కూడా నివేదిక అందిందని, దానిపై ఉద్యోగ సంఘాల అభిప్రాయాలను తీసుకుంటామని చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం సీల్డ్ కవర్‌లో ఇచ్చిన నివేదిక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్ద ఉందని, ఉద్యోగులు కూడా ఆ నివేదికపై చర్చించి తమ అభిప్రాయాలు తెలపాలని కోరారు. 26న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సమావేశం ముగిసిన తర్వాత ఉద్యోగ సంఘాల నేతలు డీఏ ప్రకటన గురించి మరోసారి సీఎంను, భట్టిని అడిగారు. గరిష్ఠంగా రెండు డీఏల వరకు ప్రయత్నం చేయొచ్చని భట్టి సీఎంకు సూచించారు. రెండింటికైనా ప్రభుత్వం కట్టుబడాలని ఒకరిద్దరు నేతలు అన్నారు. అందుకు సీఎం, డిప్యూటీ సీఎం సుముఖంగానే కనిపించారని, శుక్రవారం ప్రకటనలో రెండు డీఏలు ఉంటాయని ఉద్యోగ సంఘాల నేతలు భావిస్తున్నారు.



సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ చైర్మన్ మారెం జగదీశ్వర్ తదితరులు

సీఎంను నవ్వించిన టీచర్ల సంఘం నేత

ఉపాధ్యాయ సంఘానికి చెందిన ఓ నాయకుడు ఉద్యోగులకు రైతు బంధు పథకాన్ని ఆపకుండా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సీఎం ఒక్కసారిగా గట్టిగా నవ్వారు. ఆయనతోపాటు సమావేశంలో ఉన్న ఉద్యోగ సంఘాల నేతలంతా నవ్వడం ప్రారంభించారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు మాట్లాడుతూ, ఉద్యోగులు ఎప్పుడూ వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తారే తప్ప ఒక్కసారి అయినా విద్యా వ్యవస్థ బలోపేతానికి, విద్యార్థులకు మెరుగైన బోధన అందించే అంశాల మీద ప్రభుత్వంతో చర్చించారా? అని చమత్కరించారు. దానికోసం ప్రభుత్వం ప్రత్యేక సమావేశం పెట్టాలని, తప్పకుండా వచ్చి తమవంతు పాత్ర పోషిస్తామని ఉద్యోగసంఘాల ప్రతినిధులు చెప్పారు.

కేసులు, అరెస్టులు ఉండవు

తమది ఉద్యోగుల అనుకూల ప్రభుత్వమని, డిమాండ్ల సాధనకోసం ఆందోళనలు చేసినా, ధర్నాలు చేపట్టినా ఎవరిని ఏమీ అనబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏ ఉద్యోగి మీద కేసులు పెట్టేది లేదని, అరెస్టు చేసేది లేదని అన్నారు. తమ హక్కుల సాధన కోసం ఉద్యోగులు నిరసన తెలపడంలో తప్పు లేదని, వారి ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఒత్తిడి, ఇబ్బంది ఉండబోదని అన్నారు. తొలి బృందంలో ఐకాస చైర్మన్ మారెం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావులు తమకు పోటీగా ఉన్న మరో ఐకాస నేత లచ్చిరెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన ఉద్యోగుల మధ్య గందరగోళం, విభేదాలు సృష్టించేలా ప్రకటనలు చేస్తున్నారన్నారు. గుర్తింపు లేని సంఘాలతో ఉద్యోగులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. సీఎం తనకు బంధువని, తన మాట వింటే పెండింగ్‌లో ఉన్న 5 డీఏలతోపాటు అన్ని డిమాండ్లను వెంటనే పరిష్కరిస్తానని లచ్చిరెడ్డి చెబుతున్నారని రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆయనతో తనకు ఎలాంటి బంధుత్వం లేదని, తన పేరు ఎవరైనా వాడుకుంటే వారి విషయం చూస్తానని రేవంత్ హామీ ఇచ్చారు. సాయంత్రం 7:30 గంటలకు రెండో ఐకాస చైర్మన్ వి.లచ్చిరెడ్డి బృందంతో సీఎం సమావేశమయ్యారు. రెండు బృందాల్లో సీఎంను కలిసిన వారిలో టీజీవో నాయకులు శ్యాం, సత్యనారాయణ, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, కార్యదర్శి గౌతమ్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ఇంటర్ ఐకాస చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావా రవి, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు. సీపీఎస్ రద్దు, పాత పింఛను విధానం పునరుద్ధరణ అంశాలను స్థితప్రజ్ఞ సీఎం దృష్టికి తెచ్చారు. ఇతర కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు అమలు చేశాయని, దాని వల్ల ఒక్క పైసా అదనపు భారం పడదని సీఎంకు వివరించారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారని ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. గౌతమ్ తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల మీద క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేయాలని అడిగారు.

డిసెంబరు 9 నుంచి వైద్య ఆరోగ్య పథకం

ప్రభుత్వ ఉద్యోగుల వైద్య పథకాన్ని వచ్చే డిసెంబరు 9న ప్రారంభించడానికి ప్రభుత్వం అంగీకరించిందని వి.లచ్చిరెడ్డి తెలిపారు. 3.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, మరో 3.50 లక్షల పింఛనుదారులు, 2 లక్షల మంది పొరుగు సేవల ఉద్యోగులు మూలవేతనం నుంచి ప్రతి నెలా ఒక శాతాన్ని ఈహెచ్ఎస్ పథకానికి జమ చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన సీఎంతో భేటీ సందర్భంగా చెప్పారు. సీపీఎస్ మీద చర్చించడానికి భట్టితో కమిటీ వేస్తామని సీఎం చెప్పారన్నారు.



సూర్యాపేట కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మహిళా సంఘాల స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్

అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి

» సూర్యాపేటలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

» ధాన్యం కొనుగోలుకు 20వేల కోట్లు: ఉత్తమ్

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ఫలాలు సమాజంలోని అందరికీ అందాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖీలో మంత్రి ఉత్తమ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ అధ్యక్షత వహించారు. గవర్నర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగుందని ప్రశంసించారు. ముఖ్యంగా 2021లో 73 శాతం ఉన్న రక్తహీనతను 2024 నాటికి 21 శాతానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని కొనియాడారు. అభివృద్ధి మహిళా సాధికారతపై ఆధారపడి ఉందని, వారి చేతుల్లో డబ్బులు ఉంటేనే ఆర్థిక సాధికారిత వస్తుందన్నారు. విద్యార్థులకు తరగతి గదుల్లో చదువుతో పాటు చేతి వృత్తులకు సంబంధించిన చిన్నపాటి వస్తువుల తయారీపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వం రూ.20 వేల కోట్లు వెచ్చించనుందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. సాగునీటి రంగానికి ప్రభుత్వం రూ.28వేల కోట్లు కేటాయించిందన్నారు. ఐదేళ్లలో 30 లక్షల ఆయకట్టు సాగులోకి వస్తుందన్నారు.

ఫిరాయింపులతో కాంగ్రెస్ కార్యకర్తలకు ఇబ్బందులు

» పార్టీలో నాకు గౌరవం లేదు: జీవన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉన్నప్పటికీ పార్టీ ఫిరాయింపుల వల్ల క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి చెప్పారు. అభివృద్ధి నెపంతో పార్టీలు ఫిరాయించడం పరిపాటిగా మారిందని విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన పోచారం శ్రీనివాసరెడ్డి ముఠా.. తన అనుచరుడు గంగారెడ్డిని సంతోష్ అనే వ్యక్తితో హత్య చేయించినట్టు ఆరోపించారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో తనకు గౌరవంలేదని, అవమానాలకు గురవుతున్నట్టు చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇటీవలి పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్నానంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ విషయమై ఏఐసీసీ అగ్రనేతలు ఖర్గే, సోనియా, రాహుల్, టీపీసీసీ చీఫ్ మహేశ్, సీఎం రేవంత్‌కు లేఖరాసినట్టు పేర్కొన్నారు.

చంగ్ ఏ చంగ్‌ను క్యాన్సర్ ఆఫ్ సిటీ అనేవారట!

సియోల్‌లోని ఆ నది పునరుజ్జీవనం తేలిగ్గా ఏం జరగలేదు

» ప్రక్షాళనకు స్థానిక వ్యాపారులు, నిర్వాసితుల నుంచి వ్యతిరేకత

» మ్యూజియాన్ని సందర్శించిన మంత్రులు, అధికారుల బృందం

» పునరుజ్జీవానికి ముందున్న చిత్రాల పరిశీలన.. ముగిసిన 4 రోజుల పర్యటన

(సియోల్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

స్వచ్ఛమైన నీటి గలగలతో అద్భుత పర్యాటక కేంద్రంగా అలరారుతున్న దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోని చంగ్ ఏ చంగ్ ఒకప్పుడు మురికి కూపంగా ఉండేదే! అయితే అది ఎంతంగా అంటే.. ఆ నదిని 'క్యాన్సర్ ఆఫ్ సిటీ' అని పిలిచేవారట! మూసీ పునరుజ్జీవం కోసం ఆదర్శంగా తీసుకుంటున్న చంగ్ ఏ చంగ్‌ను మునుపటి సహజ స్థితికి పునరుద్ధరించి.. సుందరీకరించడం అంత తేలిగ్గా ఏం జరగలేదని ఇక్కడి అధికారులు పేర్కొన్నారు. ఈ నదిని మూడురోజుల క్రితం రాష్ట్ర మంత్రులు పొంగులేటి, పొన్నం, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, మేయర్ విజయలక్ష్మి, రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల కమిషనర్ హనుమంతరావు తదితరుల బృందం సందర్శించింది. గురువారం ఈ బృందం నదిపై ఏర్పాటు చేసిన ప్రత్యేక మ్యూజియాన్ని సందర్శించింది. చంగ్ ఏ చంగ్ నది అంతకుముందు ఎలా ఉండేది? పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా తీసుకున్న చర్యలేమిటి? ఆ క్రమంలో ఎదుర్కొన్న సమస్యలు-నేడు చూస్తున్న ఫలితాలు తదితర అంశాలను బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా చంగ్ ఏ చంగ్ నదికి సంబంధించిన వివరాలను అక్కడి అధికారులు వివరించారు. మురికి కూపంగా ఉన్న చంగ్ ఏ చంగ్ ప్రక్షాళనకు నడుం కట్టినప్పుడు భిన్న వాదనలు వినిపించాయని పేర్కొన్నారు. ప్రజల్లో ఎక్కువమంది నది పునరుజ్జీవనం చేయాల్సిందేనని చెప్పారని, స్థానిక వ్యాపారులు, నిర్వాసితుల నుంచి మాత్రం కొంత నిరసన వచ్చిందని పేర్కొన్నారు. అయినప్పటికీ అన్నీ పరిష్కరించి ఈ నదిని పునరుజ్జీవింపచేశామన్నారు. సుమారు 11 కి.మీ పొడవున్న ఈ నది..20 మీటర్ల నుంచి 113మీటర్ల వరకు వెడల్పు ఉందని వివరించారు. పునరుజ్జీవనానికి ముందున్న పరిస్థితులు, ఆనాటి చిత్రాలు, చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక వివరాలు తదితరాలన్నింటినీ మంత్రుల బృందం పరిశీలించింది. వాటికి సంబంధించిన ప్రణాళికలు, వ్యయాల అంచనాలను పరిశీలించింది. మరోవైపు ఇంచియాన్ నగరంలోని మురుగుశుద్ధి కేంద్రాన్ని కూడా మంత్రులు, అధికారుల బృందం సందర్శించింది. మురుగుశుద్ధి కోసం వాడుతున్న సాంకేతికతను ఆ కేంద్రం టీమ్ లీడర్ కిం యాంగ్.. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సియోల్ నగరంలో మురుగును 50ఏళ్ల క్రితం వరకు హాన్ నదిలో కలిసే ఒక వాగులో వదిలేవారమని చెప్పారు. 1976నుంచి మురుగునీటి శుద్ధి మొదలుపెట్టామని వెల్లడించారు. అత్యాధునిక ఎంబీఆర్ సాంకేతికత పరిజ్ఞానంతో వీలైనంత ఎక్కువ శుద్ధి చేసిన నీటిని పొందవచ్చన్నారు. ఆ నీటిని ప్రవాహ సరాలకు, ల్యాండ్‌స్కేపింగ్ తదితర అవసరాలకు వాడతామని వివరించారు. మరోవైపు మంత్రులు, అధికారుల బృందం నాలుగు రోజుల సియోల్ పర్యటన ముగిసింది. చంగ్ ఎ చంగ్, హాన్ నదుల అభివృద్ధి ప్రాజెక్టులు, సియోల్ నగర వ్యర్థాల నుంచి విద్యుత్తు తయారీ ప్లాంటు, మురికినీటి శుద్ధి ప్లాంటు, చంగ్ ఏ చంగ్ ప్రాజెక్టుకు సంబంధించిన మ్యూజియం, ఇంచియాన్ స్మార్ట్‌సిటీ సందర్శన, కొరియా స్పోర్ట్స్ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకోవడానికి చర్చలు తదితర కార్యక్రమాలతో బృందం తీరిక లేకుండా గడిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎప్పటికప్పుడు ఇక్కడ పరిశీలించిన, అధ్యయనం చేసిన అంశాలను వివరించి రాష్ట్రంలో అవసరమైన మేరకు అనుసరించేందుకు తగిన కార్యాచరణపై చర్చలు చేసింది. గురువారం అర్ధరాత్రి తిరిగి హైదరాబాద్‌కు మంత్రులు, అధికారుల బృందం బయల్దేరింది.

నేరాల్లేని నగరం సియోల్!

ఏదైనా కేసు నమోదైతే అదే పెద్ద వార్త

» తుపాకుల వినియోగంపై కఠిన నిషేధం

» 65 ఏళ్లు దాటిన వృద్ధులకు భారీ రాయితీలు

» రిటైర్‌మెంట్ వయస్సు 75కి పెంచే యోచన

» పెళ్లిళ్లకు దూరంగా జీవించే వారే ఎక్కువ

» ఒంటరితనమే కొరియాలో పెద్ద సమస్య

» ఆత్మహత్యలను తగ్గించేందుకు చర్యలు

(సియోల్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

ప్రపంచంలోనే అత్యంత సురక్షిత దేశం. నేరాలు దాదాపు ఉండవు. తుపాకీ సంస్కృతిపై కఠినంగా నిషేధం.. ఇవి దక్షిణ కొరియా ప్రత్యేకతలు. ప్రపంచవ్యాప్తంగా నేరాలు, తుపాకీ సంస్కృతి విపరీతంగా పెరుగుతుంటే, ఇక్కడ మాత్రం తుపాకుల వినియోగాన్ని ప్రభుత్వం కఠినంగా నిషేధిస్తోంది. 2021లో ఓ అంతర్జాతీయ సంస్థ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే దక్షిణ కొరియాలో నేరాలు దాదాపు లేవనే చెప్పాలి. ఇతర నగరాల్లో చిన్నాచితకా నమోదవుతున్నా రాజధాని సియోల్‌తో పాటు ప్రముఖ నగరాలు బూసాన్, ఇంచియాన్‌లో పోలీసులకు పనే ఉండదు. అక్కడ కేసు నమోదు చేస్తే పెద్ద వార్త అవుతుంది. అందుకే, దక్షిణ కొరియాను అత్యంత సురక్షిత దేశంగా పేర్కొంటారు. నేరాలకు పాల్పడితే జైలుశిక్ష విధించడం చాలా అరుదు. నేరాలను బట్టి జరిమానాలు ఉంటాయి. 16 అతి క్రూరమైన నేరాలకు మరణ శిక్ష అమల్లో ఉన్నప్పటికీ 1998 నుంచి తాత్కాలిక నిషేధం అమల్లో ఉంది.

65కి రిటైర్‌మెంట్ వద్దంటున్న వృద్ధులు

వాహనాలు వినియోగించే వారు హారన్ కొట్టడమే ఉండదు. నగరంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడినా.. వాహనాల రద్దీ ఉన్నా.. వాహన వినియోగదారులు వేచి ఉంటారు తప్ప హారన్ కొట్టరు.. హారన్ కొట్టడం ఇక్కడి పౌరులు తప్పుగా భావిస్తారు. 65 ఏళ్ల దాటిన వృద్ధులను సీనియర్ సిటిజన్లుగా ప్రభుత్వం గుర్తిస్తుంది. వీరికి మెట్రోలో ఉచిత ప్రయాణంతో పాటు పెన్షన్, ఆరోగ్య బీమా లాంటి అనేక పథకాలు అమలు చేస్తోంది. వీరి సంక్షేమానికి ప్రభుత్వం ఏటా 30 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇక్కడ జననాల రేటు ప్రపంచంలోనే తక్కువ.. సగటు జీవిత వయస్సు 85 సంవత్సరాలు. కొత్త వారు లేకపోవడం.. ఉన్న వారు 65కి రిటైర్ అవుతుండటంతో పని చేసేందుకు సరిపడా కార్మిక శక్తి కొరత ఏర్పడుతుంది. దీని ప్రభావం ఆర్థిక వ్యవస్థ పైనా పడుతోంది. దీంతో రిటైర్‌మెంట్ వయస్సు 65ను ఏటా ఏడాది పెంచుకుంటూ పోతూ పదేళ్లకు 75 చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. పని చేస్తాం, రిటైర్‌మెంట్ వద్దు అనే వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతోంది. 75 వరకు తాము ఏ పనైనా చేసేందుకు సిద్ధమని అక్కడి వృద్ధులంటున్నారు. మెరుగైన జీవన విధానం, ఆరోగ్యం కారణంగా దేశంలో ఇప్పటికే సీనియర్ సిటిజన్ల సంఖ్య కోటికి చేరింది. 2050 నాటికి రెండు కోట్లకు పెరుగుతుందని అంచనా.

ఒంటరి పౌరులకు కాల్ సెంటర్.. 120

చాలామంది పౌరులు వివాహాలకు దూరం. ఒంటరిగానే ఉండేందుకు ఇష్టపడతారు. ఒంటితనమే వారికి శాపంగా మారుతోంది. ఆత్మహత్యలు చేసుకునే మధ్య వయస్కుల సంఖ్య పెరుగుతుండటంతో.. ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టింది. ఒంటరి పౌరులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు, వారి కష్ట సుఖాలను వినేందుకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది. 120 నంబరుకు డయల్ చేసి, సేవలు పొందవచ్చు. అలాగే ఆత్మహత్యల నివారణ లక్ష్యంగా రాజధాని సియోల్‌లో ప్రత్యేకంగా నాలుగు కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఒంటరితనంతో బాధ పడుతున్న మధ్య వయస్కులను ఆదుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏటా 329 మిలియన్ డాలర్లను ఖర్చు చేస్తోంది. అలాగే రాజధాని సియోల్‌లో మైండ్ కన్వీనియన్స్ స్టోర్స్ ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. ఇందులో ఒంటరితనంతో బాధ పడుతున్న ఎవరైనా రావచ్చు.. ఇక్కడి వారితో కలుసుకోవచ్చు. ఇక్కడ ఆహారం, ఇతరాలు పూర్తిగా ఉచితం. ఒంటరితనంతో బాధపడే వారికి వచ్చే ఐదేళ్లలో 451 బిలియన్ వాన్ (అక్కడి కరెన్సీ) ఖర్చు చేయాలని నిర్ణయించామని రాజధాని సియోల్ మెట్రోపాలిటన్ గవర్నమెంట్ తాజాగా ప్రకటించింది. ఒంటరితనం, ఏకాకిగా ఉండటం అనేది తమ ప్రభుత్వానికి అతి పెద్ద సవాలని, దీనిని సమాజంతో కలిసే పరిష్కరించాలని సియోల్ మేయర్ ఓహ్ సే హూన్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో అన్నారు.

మూసీ అభివృద్ధి సాధ్యమే!

కావాల్సింది గట్టి సంకల్పం, రాజకీయ నిబద్ధతే!.. నదుల అభివృద్ధి.. దక్షిణ కొరియా అభివృద్ధికి బాటలు వేసింది

» హైదరాబాద్‌లో స్కిల్ వర్సిటీ భేష్

» కొరియాలో షిప్పింగ్, సెమీ కండక్టర్స్ రంగాల్లో భారీ ఉద్యోగ అవకాశాలు

» దేశ తలసరి ఆదాయం రూ.25లక్షలు.. 12వ తరగతి దాకా ఉచిత విద్య

» దక్షిణ కొరియాలో భారత రాయబారి అమిత్.. మీడియాతో ఇష్టాగోష్టి

(సియోల్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)



మూసీ పునరుజ్జీవం, అభివృద్ధి ప్రాజెక్టు ఆచరణ సాధ్యమేనని.. అయితే ఇందుకు ప్రాజెక్టును అమలు చేయాలన్న గట్టి సంకల్పం, రాజకీయ నిబద్ధత అవసరం అని దక్షిణ కొరియాలో భారత రాయబారి అమిత్ కుమార్ పేర్కొన్నారు. నదుల అభివృద్ధి అనేది దక్షిణ కొరియా అభివృద్ధికి బాటలు పరిచిందని చెప్పారు. ఒకప్పుడు పేద దేశంగా ఉన్న దక్షిణ కొరియా కేవలం 30 ఏళ్లలో స్వశక్తితో అద్భుతమైన పురోగతి సాధించి, అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించిందని చెప్పారు. దక్షిణ కొరియా తలసరి ఆదాయం సుమారు రూ. 25లక్షలు (30వేల అమెరికన్ డాలర్లు) అని.. ఇక్కడ పత్రికా స్వేచ్ఛ బాగుందన్నారు. నైపుణ్యాల అభివృద్ధిలో దక్షిణ కొరియానే ఎప్పుడూ నంబర్ వన్‌గా ఉంటుందని, హైదరాబాద్‌లో స్కిల్ యూనివర్సిటీని పెట్టాలని సంకల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాన్ని ప్రారంభించడం మంచి ముందడుగు అని కితాబిచ్చారు. రేవంత్ రెడ్డి ఇటీవల సియోల్ వచ్చినప్పుడు ఇక్కడి స్కిల్ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన అధికారులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ అధికారులతో చర్చించారని.. సహకారం కోసం చర్చలు జరిగాయని, అవి ఫలప్రదమవుతున్నాయని పేర్కొన్నారు. సీఎం సందర్శన సందర్భంగా ఇక్కడి అధికారులతో చర్చించిన అంశాలను... మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం, పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేందుకు చేసిన చర్చలను ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి పెట్టామని వివరించారు. సియోల్ పర్యటన కు వచ్చిన పాత్రికేయ బృందంతో ఎంబసీలోని కార్యాలయంలో అమిత్ కుమార్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

షిప్పింగ్ రంగంలో భారతీయులకు అవకాశాలు

దక్షిణ కొరియాలో షిప్పింగ్ పరిశ్రమ, సెమీ కండక్టర్స్, ఆటోమొబైల్, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో రాబోయే రోజుల్లో భారీగా ఉద్యోగావకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. షిప్పింగ్ పరిశ్రమలో పనిచేసేందుకు భారత్ నుంచి 200 మందిని తీసుకొచ్చామని చెప్పారు. ఈ రంగంలో భారత్‌కు చెందినవారు పని చేయడానికి కొరియా వచ్చేందుకు రెండు దేశాల మధ్య ఉన్నతస్థాయిలో ఒప్పందం జరగాలని అభిప్రాయపడ్డారు. దక్షిణ కొరియాకు సంబంధించిన షిప్పింగ్ కంపెనీల్లో పనిచేస్తున్నవారిలో ఎక్కువమంది 60ఏళ్లకు సమీపంలోకి వచ్చేశారని... ఇంకో పదేళ్లలో వీరు పనిచేసే స్థితిలో ఉండరన్నారు. అందుకే ఈ రంగంలో భారతీయులకు అనేక అవకాశాలుంటాయన్నారు. ఈ దేశంలో 12వ తరగతి వరకు ఉచిత విద్య అందుతుందన్నారు. అక్షరాస్యత వంద శాతం అనడం కంటే దాదాపు అంతా గ్రాడ్యుయేషన్ చేసినవాళ్లే ఉంటారని చెప్పారు. భారత్-కొరియాల వాణిజ్య పరిమాణం ఏటా 25బిలియన్ డాలర్లన్నారు. దక్షిణ కొరియా నుంచి భారత్‌కు వచ్చే ఎగుమతులే ఇందులో ఎక్కువని... దీన్ని సమతూకం చేసేందుకు భారత్ ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. దక్షిణ కొరియాలో మొత్తం 15వేలమంది భారతీయులున్నారని వెల్లడించారు.

దక్షిణ కొరియాలో జననాల రేటు తగ్గుతోంది

దక్షిణ కొరియా ప్రధానంగా రెండు సమస్యలను ఎదుర్కొంటోందని అమిత్ తెలిపారు. ఈ దేశం చైనా దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోందని, అయితే క్రమంగా వాటిని తగ్గించుకునేందుకు ఇక్కడి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. దక్షిణ కొరియాలో జననాల రేటు తగ్గడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తాజా అంచనాల ప్రకారం జననాల రేటు 6.8శాతం మాత్రమే ఉందన్నారు. ఈ దేశంలో పరిశోధనలపై ఎక్కువగా ఖర్చుపెడతారని, పెద్ద కంపెనీలు భారీ మొత్తాల్లో సొమ్మును వెచ్చిస్తాయన్నారు. కార్ల తయారీ రంగంలో, హైడ్రోజన్ మొబిలిటీ దిశగా పరిశోధనల్లో మెరుగైన ఫలితాలు సాధించిందన్నారు. హ్యూందయ్ కంపెనీ ఐపీవోకు వెళ్లడం ఊహించలేదని, భారత్‌లోని తన వ్యాపార విస్తరణ లక్ష్యాల కోసమే ఈ పనిచేసి ఉంటుందని భావిస్తున్నామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు ఏటీఎంలా 'మూసీ పునరుజ్జీవం'

- పేదల ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గం:బండి సంజయ్
- నేడు ఇందిరా పార్కు వద్ద బీజేపీ మహాధర్నా



హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): "మూసీ పునరుజ్జీవం" ప్రాజెక్టును కాంగ్రెస్.. ఏటీఎంలా వినియోగించుకోవాలనుకుంటోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట ఎలా అడ్డగోలు దోపిడీకి పాల్పడిందో, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాగే చేస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే కాంగ్రెస్ సర్కారు తంటాలు పడుతోందని.. ఈ పరిస్థితుల్లో మరో రూ.లక్షన్నర కోట్లు అప్పు చేసి మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల ఇళ్లను కూల్చాలనుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. "నాబార్డ్ ఇచ్చిన ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సర్వే నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఒక్కో కుటుంబంపై సగటున రూ.1,29,599 అప్పు ఉంది. ఇది, జాతీయ సగటు కంటే రూ.40 వేలు ఎక్కువ. దేశంలోనే అత్యధికం. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదు. కానీ ప్రజలపై మోయలేని అప్పులు మోపి, పేదల ఇళ్లను కూల్చివేయడం సరికాదు"అని సంజయ్ పేర్కొన్నారు. మూసీ బాధితులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ శుక్రవారం ధర్నాచౌక్ వద్ద బీజేపీ నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సంజయ్ పిలుపునిచ్చారు.

'పాలమూరు-రంగారెడ్డి' లో అవకతవకలు

- సమగ్ర విచారణ జరిపించాలి: ఎఫ్‌జీజీ

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో అవకతవకలు చోటుచేసుకున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 2015లో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు మూడేళ్లలో పూర్తి కావాల్సి ఉందని, కానీ తొమ్మిదేళ్లవుతున్నా పూర్తికాలేదని తెలిపారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.32,200 కోట్ల నుంచి రూ.50 వేల కోట్లకు పెరిగిందని, కేంద్రం నుంచి తగిన అనుమతులు పొందని కారణంగా ప్రాజెక్టుపై రూ.920 కోట్ల జరిమానా విధించినట్టు చెప్పారు. ఇప్పటికే ప్రాజెక్టుపై రూ.31,850 కోట్లు ఖర్చు చేశారని, మరో నాలుగైదేళ్ల గడిచినా ప్రాజెక్టు పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదన్నారు. దీని కోసం పలు బ్యాంకుల నుంచి రూ.వేల కోట్ల అప్పులు తెచ్చారని, ప్రస్తుతం వడ్డీలు చెల్లించలేక ప్రభుత్వం సతమతమవుతోందని తెలిపారు. ఈ ప్రాజెక్టుపై విచారణ జరిపించి, బాధ్యులకు శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు.

211 రోజులుగా జైల్లో ఉంటున్నా.. బెయిలివ్వండి

- సుప్రీంలో ఫోన్‌ట్యాపింగ్ నిందితుడు తిరుపతన్న పిటిషన్

న్యూఢిల్లీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ఏఎస్పీ మేకల తిరుపతన్న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 211 రోజులుగా జైలులో ఉంటున్నానని, తనకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే, న్యాయవాది మోహిత్ రావు వాదనలు వినిపించారు. "ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ అదనపు ఎస్పీ తిరుపతన్న, భూపాలపల్లి అదనపు ఎస్పీ భుజంగరావును ఈఏడాది మార్చి 23న అరెస్టు చేశారు. అప్పటి నుంచి దాదాపు 211 రోజులుగా తిరుపతన్న జైలులోనే ఉన్నారు" అని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ధర్మాసనం జోక్యం చేసుకుని 211 రోజులుగా జైల్లో ఉంచడానికి నిందితుడు చేసిన నేరం ఏంటని ప్రశ్నించింది. న్యాయవాది మోహిత్ రావు సమాధానమిస్తూ.. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ ఏఎస్పీగా ఉన్న తిరుపతన్న అవసరాన్ని బట్టి ఫోన్ ట్యాపింగ్ చేసి ఆ సమాచారాన్ని ప్రభుత్వానికి అందజేసేవారని తెలిపారు. ధర్మాసనం మరోసారి కలుగజేసుకుని.. నిందితుడు చేసిన నేరమేమిటో తమకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. ఇందులో ప్రభుత్వ వాదనలు సైతం వినాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

ఎవరినీ వదలం..

- నంబర్ 1-8 వరకు అరెస్టులు!
- గత ప్రభుత్వంలో కీలక నేతలు జైలుకే
- కుంభకోణాల్లో ఏదో ఒకటి దీపావళిలోపే పేలుతుంది
- బీఆర్ఎస్ ప్రభుత్వ ముఖ్యుల అక్రమాలపై ఫైళ్లు సిద్ధం
- సాక్ష్యాల ధ్రువీకరణకే ఇప్పటివరకు ఆగాం
- మీడియా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి

(సియోల్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతల అరెస్టులు తప్పవని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గత సర్కారులో కీలక నేతలు నంబరు 1 నుంచి 8 వరకు అందరినీ అరెస్టు చేస్తామని ప్రకటించారు. త్వరలోనే బాంబులు పేలతాయని బుధవారం ప్రకటించిన పొంగులేటి.. గురువారం నాటి సియోల్ పర్యటనలోనూ ఈ అంశంపై మాట్లాడారు. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన ప్రముఖులకు సంబంధించిన ఫైళ్లు సిద్ధం అయ్యాయన్నారు. కుంభకోణాల్లో ఏదో ఒకటి దీపావళిలోపే టపాసులా పేలుతుందన్నారు. మీరు సియోల్ నుంచి హైదరాబాద్‌లో దిగేలోపే (26వ తేదీ ఉదయం) కొన్ని బాంబులు పడతాయని మీడియా ప్రతినిధులతో చెప్పారు. అన్నింటికీ పక్కా ఆధారాలున్నాయని, ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు జరిగాయన్నారు. ఫోన్‌ట్యాపింగ్, ధరణి, భూ అక్రమాలు, ఇతర నాలుగైదు కుంభకోణాలు చేశారని.. వీటిలో ఏదో ఒకటి దీపావళికి ముందే పేలుతుందని తెలిపారు. అక్రమార్కులను ఎలా శిక్షించాలన్నది చట్టం చూసుకుంటుందన్నారు. కుంభకోణాలు, అవినీతిలోని ఆస్తుల రికవరీని కూడా చట్టమే చూసుకుంటుందని చెప్పారు. ఇందులో తమ నిర్ణయం ఏమీ ఉండదన్నారు. తాతలు, తండ్రుల ఆస్తుల్లా చట్టాలను అతిక్రమించి సంపాదించారని ఆరోపించారు. మాజీ మంత్రులు, వారి తొత్తులు మూసీ వెంట కబ్జాలు చేశారని, అవి ఖాళీ చేయిస్తుంటే పెయిడ్ ఆర్టిస్టులను పెట్టుకుని నటిస్తున్నారని ధ్వజమెత్తారు. బావ, బావమరిది ఇద్దరూ పబ్లిసిటీతో పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. తప్పు చేస్తే ఉపేక్షించడం తమ ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. చట్టాలు ఉల్లంఘించి చేసిన పనుల రికార్డులను సిద్ధం చేశామని.. రెండు రోజుల్లో ఏం జరుగుతుందో మీరే చూస్తారని మంత్రి పేర్కొన్నారు. ఎవరూ తప్పించుకోకుండా పక్కా ఆధారాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు సాక్ష్యాల ధ్రువీకరణ కోసం ఆగామని.. అసలు సినిమా ముందుందని అన్నారు.

భూ అక్రమాల కేసేనా?

ఏ కేసులో రాష్ట్ర ప్రభుత్వం బాంబులు పేలుస్తుందన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ధరణి-భూముల అక్రమాలకు సంబంధించిన అంశాలనే వెలుగులోకి తెచ్చి కేసులు పెడతారని సమాచారం. ధరణి చట్టం వచ్చాక అనేక భూ లావాదేవీల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇదే అంశంలో సీసీఎల్ఏ స్థాయిలో క్లియర్ చేయాల్సిన కొన్ని భూములకు సంబంధించిన అంశాలను.. కలెక్టర్ల స్థాయిలోనే చేసేశారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ధరణి వ్యవహారాలను ఒక ప్రైవేటు సంస్థ టెరాసిస్‌కు ఇచ్చి, దాన్ని అడ్డుపెట్టుకుని కూడా కొన్ని లావాదేవీలు అక్రమంగా చేశారన్న సమాచారం ప్రభుత్వం వద్ద ఉన్నట్లు తెలుస్తోంది.

కేసీఆర్ ఆదేశాలతోనే

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించనుంది. ఉదయం 11:20 గంటల నుంచి సాయంత్రం 4:10 గంటల దాకా విచారణ కొనసాగింది.

కమిషన్: డీపీఆర్ ఉద్దేశం ఏంటి? దీనికోసం ఏ పరీక్షలు చేశారు? బ్యారేజీల నిర్మాణంపై నిర్ణయం ఎవరిది?

వెంకటేశ్వర్లు: ఒక ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర సాంకేతిక సమాచారం డీపీఆర్‌లో ఉంటుంది. జియోలాజికల్, జియోఫిజికల్ పరీక్షలు చేశాం. 2016 జనవరిలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్యారేజీల నిర్మాణంపై నిర్ణయం జరిగింది. వ్యాప్కోస్ సమర్పించిన డీపీఆర్ ఆధారంగా ప్రాజెక్టులోని వివిధ కాంపోనెంట్ల నిర్మాణ అంచనాలను సిద్ధం చేయాలని కేసీఆర్ ఆదేశించారు. సీఎం అధ్యక్షతన జరిగిన సమావేశంలోనే నిర్ణయాలన్నీ జరిగాయి. డీపీఆర్‌లోని అన్ని ప్రామాణికాలను సీఎం కేసీఆరే ఆమోదించి, సంతకాలు చేశారు.

డీపీఆర్‌ను ఎప్పుడు సమర్పించారు? డీపీఆర్ ప్రకారమే నిర్మాణం జరిగిందా?

కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతి కోసం 2016 మార్చిలో దరఖాస్తు చేశాం. డీపీఆర్ దాఖలు చేశాక నిర్మాణాలపై నిర్ణయం జరిగింది. లింక్-1లో మూడు బ్యారేజీల (మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల)తో పంప్‌హౌస్‌ల నిర్మాణం జరిగింది. డీపీఆర్‌లో అన్ని కాంపోనెంట్ల వివరాల్లేవు. గైడ్‌బండ్, ఫ్లడ్ బ్యాంకులు, డైవర్షన్ ఛానళ్లను తర్వాత చేర్చాం. నిర్మాణం చేసే క్రమంలో అక్కడి పరిస్థితుల ఆధారంగా మార్పులు చేశాం. గైడ్‌బండ్ ఇతర పనులను స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్‌సీ) నిర్ణయానికి అనుగుణంగా మార్చాం. స్థానిక పరిస్థితులు, అటవీ భూమి ముంపు వంటి అంశాల ఆధారంగా అన్నారం బ్యారేజీ ఎత్తును 119 మీటర్లకే కుదించాం.

అక్కడే బ్యారేజీలు కట్టాలని చెప్పిందెవరు? 'బెనిఫిట్ కాస్ట్ రేషియో' ఏంటి?

బ్యారేజీలు కట్టాలని వ్యాప్కోస్ చెప్పింది. స్థలాలను ప్రభుత్వమే ఎంపిక చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే వ్యాప్కోస్ నివేదిక ఉంది. ఒక ప్రాజెక్టుపై నిధులు వెచ్చిస్తుంటే ఏ మేరకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందనే విషయాన్ని బెనిఫిట్ కాస్ట్ రేషియో చెబుతుంది.

సీఈ/ఈఎన్‌సీగా మీ బాధ్యతలేంటి? మీ కాలంలో ఎస్ఈ, ఈఈలెవరు?



ఇతర రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకోవడం, డీపీఆర్ తయారీ కోసం వ్యాప్కోస్‌తో సంప్రదింపులు, ఇన్వెస్టిగేషన్లు చేయించడం, భూసేకరణ కోసం అధికారులతో సమన్వయం చేసుకోవడం, ప్రభుత్వ కార్యదర్శులతో జరిగిన సమావేశాలకు హాజరవడం వంటివి సీఈ/ఈఎన్‌సీ బాధ్యతలు. ఎస్ఈ, ఈఈల వివరాలు శుక్రవారం ఇస్తా.

బ్యారేజీల నిర్మాణ స్థలాలు మార్చారా? బ్యారేజీలు, ప్రాజెక్టులకు ఒకటే డీపీఆర్ ఉందా?

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఎంపిక స్థలాలను మార్చాం. గ్రావిటీ కెనాల్ పొడవు తగ్గించడం, నిల్వ సామర్థ్యం పెంచడం, అటవీ భూమి సేకరణ తగ్గించడం వంటి మూడు అంశాలను ప్రామాణికంగా చేసుకొని స్థలాలు మార్చాం.

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై 6156 కోట్లు వెచ్చించిన తర్వాత రీ ఇంజనీరింగ్ నిర్ణయం సరైనదేనా?

కాళేశ్వరం ప్రాజెక్టు కింద 18.83 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించాలని నిర్ణయం తీసుకున్నాం. ఎస్ఆర్ఎస్పీ రెండో దశ, ఫ్లడ్ ఫ్లో కెనాల్ (ఎఫ్ఎఫ్‌సీ), సింగూరు, నాగార్జునసాగర్ ఆయకట్టు స్థిరీకరణ కూడా ఈ ప్రాజెక్టులో ఉంది. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్లతో బ్యారేజీ కట్టడానికి మహారాష్ట్ర అభ్యంతరం తెలిపింది. 148 మీటర్లకు అంగీకారం తెలిపింది. ఆ ఎత్తుతో బ్యారేజీ కడితే 44 టీఎంసీలు మాత్రమే తరలించడానికి అవకాశం ఉండేది. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పడం వల్లే రీ ఇంజనీరింగ్ జరిగింది.

రెండు దశల్లో తక్కువ కరెంట్‌తో నీళ్లు వచ్చే ప్రాజెక్టును కాదని, 11 వేల మెగావాట్లకు పైగా సామర్థ్యం కలిగిన పంపులతో కిందినుంచి పైకి నీటిని పంపింగ్ చేసే ప్రాజెక్టు కడతారా? ఇది తప్పుడు నిర్ణయమే కదా?

అవును.. తప్పుడు నిర్ణయమే.

ఎల్లంపల్లి దాకా చేపట్టిన పనులన్నీ వృథాయే కదా? దీనిపై మాజీ ఇంజనీర్ల కమిటీ సిఫారసులను పక్కనపెట్టారా?

మాజీ ఇంజనీర్ల సిఫారసులతో ఏకీభవించను.

అదనంగా ప్రతిపాదించిన పనులను పర్యావరణ అనుమతి లేకుండా చేపట్టారా?

రికార్డులను పరిశీలించి చెబుతా.

కోల్‌బెడ్‌పై మేడిగడ్డ బ్యారేజీ కట్టారా? ఎవరి ఆదేశాలతో బ్యారేజీల్లో నీటి నిల్వ చేశారు?

వాస్తవం కాదు. (జాదవ్‌పూర్ యూనివర్సిటీ నివేదిక చూడలేదా? అంటూ నివేదికను చూపించిన కమిషన్) ప్రభుత్వ పెద్ద (కేసీఆర్ పేరు ఎత్తకుండా) ఆదేశాలతోనే నీటిని నిల్వ చేశాం.

నిర్మాణంలో సీకెంట్ పైల్స్‌ను ఎందుకు ఎంచుకున్నారు? దేశంలో ఏ హైడ్రాలిక్ నిర్మాణంలోనూ వాటిని వాడట్లేదు కదా?

దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లో ప్రాజెక్టుల నిర్మాణంలో సీకెంట్ పైల్స్‌ను వాడారు. కోల్‌కతాకు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాజెక్టులోనూ వాడారు. (దీనికి కమిషన్ అభ్యంతరం తెలుపుతూ బెంగాల్ ప్రస్తావన ఎందుకు.. ముంబైకి దగ్గరల్లో లేవా అని వ్యాఖ్యానించింది)

అన్నారం, మేడిగడ్డ పునాదుల్లో వేర్వేరు పద్ధతులను ఎందుకు పాటించారు?

నిర్మాణ ప్రదేశం ఆధారంగా పద్ధతులను ఎంచుకోవాలన్న సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) సీఈ సిఫారసుల మేరకు నిర్ణయం తీసుకున్నాం.

భూదాన్ భూముల్లో మనీలాండరింగ్..!

- రెండో రోజు ఫైళ్లు, పత్రాలతో ఈడీ ఎదుట ఐఏఎస్ అమోయ్‌కుమార్ హాజరు
- నేడు మరోసారి విచారణ..
- విశ్రాంత ఐఏఎస్ ప్రమేయంపై ఆరా

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం భూదాన్ భూముల బదలాయింపులో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారడంతో మనీలాండరింగ్ కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ చేపట్టింది. విజిలెన్స్, స్థానిక పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా దర్యాప్తు జరుపుతోంది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాజకీయ నేతల ప్రమేయం ఉండటంతో పూర్తిస్థాయిలో విచారణకు ఈడీ సిద్ధమైనట్లు సమాచారం. విచారణలో భాగంగా పశుసంవర్ధక శాఖ సంయుక్త కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్‌ను ఈడీ వరుసగా రెండో రోజు ప్రశ్నించింది. బుధవారం మొదటిసారి ఆయన్ను సుదీర్ఘంగా విచారించిన ఈడీ ప్రత్యేక బృందం.. పలు పత్రాలు, డాక్యుమెంట్లు తేవాల్సిందిగా చెప్పి పంపించారు. దీంతో ఆయన పలు ఫైళ్లు, పత్రాలతో గురువారం ఈడీ విచారణకు హాజరయ్యారు. ఆయన్ను విచారించిన ఈడీ అధికారులు.. శుక్రవారం మరోసారి విచారణకు హాజరు కావాల్సిందిగా చెప్పి పంపించారు. అయితే సీనియర్ ఐఏఎస్‌ను ఈడీ వరుసగా విచారిస్తున్న క్రమంలో ఈ కేసు ఎప్పుడు ఏ మలుపు తీసుకుంటుందోననే చర్చ మొదలైంది. రంగారెడ్డి జిల్లాలో విలువైన భూముల బదలాయింపులో విశ్రాంత ఐఏఎస్ ప్రమేయంపైనా ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఫైళ్లు పరిశీలిస్తున్న ఈడీ అధికారులు.. విశ్రాంత ఐఏఎస్ ప్రమేయంపైనా ఆరా తీస్తున్నారు. విచారణలో లభించే సమాచారం, పత్రాల ఆధారంగా మరికొందరు ప్రముఖులకు ఈడీ సమన్లు జారీ చేసి ప్రశ్నించే అవకాశమున్నట్లు సమాచారం. భూదాన్ భూములతోపాటు రంగారెడ్డి జిల్లా పరిధిలో జరిగిన మరికొన్ని భూ బదలాయింపులపైనా ఈడీ దృష్టి సారించింది. కొన్ని బడా రియల్ ఎస్టేట్ సంస్థలకు జరిగిన భూ బదలాయింపుల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్న నేపథ్యంలో వాటన్నింటిపైనా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

ఒకటి, రెండేళ్లు జైలుకు వెళ్లడానికైనా సిద్ధమే

- కాంగ్రెస్ నేతలు పెట్టే కేసులకు భయపడం
- పోలీసులు, అధికారులు.. అతి చేస్తే ఊరుకోం
- కాంగ్రెసోళ్లను ఉరికించి కొట్టే రోజులు దగ్గర్లోనే
- ఆ పార్టీ మోసాలను మహారాష్ట్రలోనూ చెప్పండి
- ఆదిలాబాద్ రైతు పోరుబాట సభలో కేటీఆర్



ఆదిలాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): "అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. పోలీసులు తొందరపడి ఆగం కావద్దు.. న్యాయం, ధర్మం ప్రకారం పని చేయండి.. వచ్చేది మళ్లీ మా ప్రభుత్వమే.. ఎవరినీ వదిలిపెట్టేది లేదు.. పోలీసులైనా, అధికారులైనా అతి చేస్తే ఊరుకోం. పేర్లు రాసిపెట్టుకుని మరీ అధికారంలోకి రాగానే మిత్తితో సహా చెల్లిస్తాం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. ఆదిలాబాద్‌లో గురువారం నిర్వహించిన రైతు పోరుబాట సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు పెట్టే కేసులకు భయపడబోమని, అవసరమైతే ప్రజల కోసం రెండేళ్లు జైలుకు వెళ్లడానికైనా సిద్ధమేనని ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులు చట్ట ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. హైడ్రా పేరుతో ఇళ్ల నిర్మాణాలను కూల్చివేయడం, కడుపు కాలి ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైలులో పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలు తిరగబడి కాంగ్రెస్ వాళ్లను ఊళ్లలో ఉరికించి కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. రుణమాఫీ చేయడం లేదని ప్రశ్నించిన రైతులపై కేసులు పెట్టారన్నారు. అలాంటప్పుడు కల్యాణలక్ష్మి కింద నగదుతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి.. మోసం చేసిన సీఎంపై కేసులు ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు. సన్న ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పినా.. ఇప్పటికీ రాలేదన్నారు. రైతు భరోసా ఇస్తామని చెప్పిన సీఎం కుర్చీకే భరోసా లేదన్నారు. బీసీ సబ్‌ప్లాన్, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ, యువ మహిళా డిక్లరేషన్, 2లక్షల ఉద్యోగాల భర్తీ ఏమైందని ప్రశ్నించారు. త్వరలోనే మహారాష్ట్రలో ఎన్నికలు జరుగుతున్నాయని, కాంగ్రెస్ మోసాలను అక్కడి వాళ్లకు కూడా చెప్పాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వాస్తవానికి కాంగ్రెస్, బీజేపీ రెండూ తోడు దొంగలేనన్నారు. ఎన్నికల సమయంలో సీసీఐని పునరుద్ధరిస్తామని చెప్పిన బీజేపీ.. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు దందాలు చేస్తూ చందాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కేంద్రంలో జుమ్లా ప్రధాని.. రాష్ట్రంలో హౌలా సీఎం ఉన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అంటే.. భారత రాష్ట్ర సమితి కాదని.. భారత రైతు సమితి అని, పార్టీ శ్రేణులు రైతుల పక్షాన పోరాడాలని కార్యకర్తలకు సూచించారు.

చిరు గాయం.. మందు రాసుకున్న కేటీఆర్

సభ ప్రారంభంలో అభిమానులు, కార్యకర్తలు కేటీఆర్ దగ్గరికి వచ్చేందుకు ప్రయత్నించారు. కరచాలనం చేసే ప్రయత్నంలో ఎవరివో గోళ్లు కేటీఆర్ చేతికి తగలడంతో.. చిన్న గాయమైంది. దీంతో సభలో ఆ గాయానికి కేటీఆర్ మందు రాసుకుంటూ కనిపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.